


# గానకళ
## సంగీత మాసపత్రిక

#30-1-29, రంగయ్యనాయుడు వీధి, కాకినాడ - 533 001, సెల్: 9441488721

సహాయ సంపాదకులు
**శ్రీ వాసా గోపీనాథరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్
**శ్రీ కె.వి.బ్రహ్మానందం,**
విజయవాడ, విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల
**శ్రీ మండలీక సీతారాఘవరావు,** చెన్నై
**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి,** కాకినాడ

అసోసియేట్ ఎడిటర్స్
**శ్రీ ధర్మాల రామమూర్తి**
(హైదరాబాద్)
**డా॥ బి.యస్.వి.ప్రసాద్,**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మృదంగం
కాశీవిశ్వవిద్యాలయం, వారణాసి.

**సంపుటి - 57** | **ఫిబ్రవరి - 2020** | **సంచిక - 09**



**సంపాదకవర్గం :**
శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
శ్రీ నేమాని సోమయాజులు
శ్రీ తాతపూడి వెంకట సుబ్బరాయ శాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి.వర్ధని
శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబ
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్.వి.సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**
శ్రీ ఎం.ఎస్.శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్.అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మిదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, ,M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి.రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై.శేషరాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి


పేజిలలో **ఈ సంచికలో...**


| | | |
|---|---|---|
| 2. | నాదలోలుడవై బ్రహ్మానందన మందవే మనసా | -శ్రీ మల్లాది సూరిబాబు |
| 5. | తంజావూరిలో ఆంధ్రదేశ విద్వాంసులు | - వేమూరి రామలక్ష్మి |
| 10. | మరపురాని గాయని కీ॥శే॥ శిష్టా శారదా | - శ్రీ మోదుమూడి సుధాకర్ |
| 12. | కళ్యాణి రాగం - ఒక పరిశీలన | - శ్రీమతి మల్లాప్రగడ అనసూయదేవి |
| 18. | సుందరేశ్వరవిలాసము యక్షగానప్రబంధం | - డా॥చల్లా విజయలక్ష్మి |
| 22. | హిందూస్తానీ సంగీతంలో తాన్‌పుర-తబలా | - ప్రొ॥ శ్రీమతి ద్వారం లక్ష్మి |
| 23. | మధురై మణి అయ్యర్ | - శ్రీ కె.సద్గురు చరణ్ |
| 25. | కీ॥శే॥ వింజమూరి వరదరాజ అయ్యంగారికి నివాళి | - నారద |
| 28. | సంగీత సభల కార్యకలాపములు | - 'విహారి' |


## ముఖచిత్రం

**1.** భద్రాచలంలో జరిగిన రామదాసు సంకీర్తనల గోష్ఠి గాన దృశ్యం.

**2.** ది.22.02.2020న శ్రీగాయత్రి మహిళా సంగీత సన్మండలి, గుంటూరులో శ్యామశాస్త్రి ఆరాధన సందర్భంగా విజయనగరం డి.వర్ధని గారిని సన్మానిస్తున్న దృశ్యం.

**3.** "సుజన రంజని", హైదరాబాద్ సంస్థ నుండి ది.21.02.2020న "సోమనాధ పురస్కారం అందుకుంటున్న సంగీత ఆచార్య డా॥ వైజర్స్ బాలసుబ్రహ్మణ్యం.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

# నాదలోలుడవై బ్రహ్మానందమందవే మనసా!



మల్లాది సూరిబాబు, సెల్ : 9052765490

సాహిత్య ప్రపంచంలో యామిజాల పద్మనాభ స్వామి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన ప్రముఖులతో హరికథా పితామహుడైన ఆదిభట్ల నారాయణదాసుగారికి ఎంతో సన్నిహిత పరిచయం ఉండేది.

రామాయణ, భారత, భాగవతాలను తెలుగులోకి అనువదించి, సారస్వత లోకానికి చిరపరిచితుడైన యామిజాల పద్మనాభ స్వామి నారాయణ దాసుకు ఎంతో ప్రీతిపాత్రుడు .విజయనగరంలో తన విద్యార్థిత్వం పూర్తైన తర్వాత ఓ రోజు దాసుగారింటికి వెళ్ళి, 'తాతా । నాకు సంగీతం చెప్పు, అన్నాడు.

ఒక్క నిమిషం చూసి, ఆ మూలనున్న తంబూరా తీసుకురా పదిలంగా అని ఆయన అనగానే తెచ్చి ముందు పెట్టారు – తంబూరా తీగలు శృతిచేసి షడ్జంలో స్థాయి నిలుపుతూ ఇలా ఒక అరగంటసేపు 'సా' అని పట్టు పట్టరా!' అన్నారు.

'బాబోయ్! అంతసేపు నావల్ల కాదు' అన్నారట యామిజాల.

'ఒరే! పాటకు శ్రుతి ప్రాణం. అది నాభి నుంచి పుట్టి రాగస్వరూపాన్ని ఆవిష్కరిస్తూ వెన్ను నుంచి సహస్రార చక్రానికి వెళ్ళి అక్కడ అమృత స్థాయిగా మారుతుంది. తరువాత హృదయ కోశానికి వచ్చి కంఠాన్ని ఆశ్రయించి ముఖతః నిండుగా బహిర్గతం కావాలి.

అనునాసిక కాకూడదు. అలా శ్రుతిపక్వమైతే గానం అమృతత్వాన్ని పొందుతుంది. దాని వల్ల పాడినవారు, విన్నవారు, అమృతత్వాన్ని పొందుతారు అంటూ దాసుగా రేమన్నారో తెలుసా?

'నీకు సంగీతం రాదు. అయినా సంసార తరణ సాధనంగా, అమ్మ నీకు ఒక జోలె ఇచ్చింది. అదిచాలు. అన్ని జోలెలూ నీకే కావాలంటే ఎలా? నువ్వేమైనా నారాయణదాసువా'? అన్నారట చిరునవ్వుతో.

మరొకరైతే ఆ మాటకు మళ్ళీ జీవితంలో దాసుగారిని చూడరు. మాట్లాడరు. ఆ వ్యక్తులు వేరు. ఆ మనుషులు వేరు. ఆనాటి మనుషుల మధ్య వాత్సల్యం వేరు.

'అయితే శాపం పెట్టారన్న మాట' అన్నారు పద్మనాభ స్వామి.

'అబ్బే! శాపం కాదురా! నీకు సంస్కృతం వచ్చు. సంగీతానికి సంబంధించిన శాస్త్రం ఆ భాషలో ఉంది. అది ఒకసారి చూడు. దాని స్వరూప స్వభావాలు తెలుస్తాయి. తాళ పద్ధతులు తెలుసుకో' అని సప్త తాళాలు, జాతులూ నేర్పారు. అన్నీ శ్రద్ధగా చక్కగా నేర్చుకున్న 'యామిజాల' ను మెచ్చుకుంటూ 'శహబాస్!

'నీ హృదయంలో చక్కని లయ జ్ఞానం ఉంది. నెమ్మదిగా గాన స్వరూప స్వభావాలు తెలుస్తాయి. ఇది నా వరం అనుకో' అని మృదువుగా తల నిమిరారట – ప్రజ్ఞగల వారి మాట తిరుగులేనిది. వారిద్దరూ సమాన స్థాయిలోని వ్యక్తులు కాబట్టి సరిపోయింది.

ఈ రోజుల్లో ఏ గురువైనా అంత ధైర్యంగా ఉన్నదున్నట్లు మాట్లాడే సాహసం చేయడు – అర్థం చేసుకునేశిష్యులూ ఉండరు.

మానవులు సాధించవలసినది కైవల్యం. అది ఆస్తికత్వం ఉంటేనే గానీ సాధ్యపడదు. దానికి అవినాభవ సంబంధం ఉన్న సంగీత, సాహిత్యాలు ఎంతో అవసరమని దాసుగారి అభిప్రాయం. లోపాలున్నాయంటే చాలామంది సంగీతం విషయంలో నిజాయితీగా ఒప్పుకోరు.

ఒక మధురమైన ఫలాన్ని మనం ఆస్వాదిస్తున్నామంటే ఆ పండు వెనుక ఎంతో చరిత్ర ఉంది. వృక్షం పెరిగి మొగ్గతొడిగి పుష్పించాలి. అందులో రజస్సు ఏర్పడాలి. తర్వాత పిందెగా, కాయగా, పండుగా మారాలి. కైవల్యానంద రసానుభూతికి విద్యావృక్షం సంగీతమనే పుష్పాన్ని పుష్పించాలి. అందులో సాహిత్యమనేదే పుప్పొడి. సరియైన సంగీత సాహిత్యాల వల్ల ఆస్తికత్వం అనే ఫలం ఏర్పడుతుంది. దాని అనుభవం వల్ల కైవల్య రూపమైన బ్రహ్మానంద రసానుభూతి కలుగుతుందనే నారాయణ దాసుగారి అభిప్రాయం.

**సంగీత పుష్ప ముద్దిష్టం సాహిత్యం తద్రజః స్మృతమ్ ఆస్తికత్వం ఫలం ప్రోక్తం కైవల్యం రస ఈరితమ్** సంగీతంలో

సాధారణంగా మూడు రకాలుంటాయి. వింటున్నంతసేపూ బాగానే ఉంటుంది. అంతకంటే లోపలికి వెళ్ళదు. రెండవది చెవి దాటి కాస్త మెదడులోకి ప్రవేశిస్తుంది. బుద్ధికి పని చెబుతుంది.

మూడవ రకం తిన్నగా మనసులోకి ప్రవేశించి ఆనందాన్నిస్తుంది. కాస్త భావ పరిణితి చెందితే హృదయాన్ని కరిగించి ఏడిపిస్తుంది.

భావాతాత స్థితిలో ఉంచుతుంది.

బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా చేస్తుంది. గాయకుడికి ఈ అనుభవం ముందు కలగాలి. అప్పుడే శ్రోత క్కూడా ఆ అనుభూతి చేరుతుంది.

మొదటి రకం పాటకు, ఇటువంటి అనుభూతిలేమీ ఉ ండవు.ఎందుకు పాడతారో, ఎందుకు వింటారో అంతుపట్టదు. కాస్త ఆలోచింపజేస్తూ, నాదామృతంతో నిండిన మాటలు హృదయాకాశాన్ని పలకరిస్తే కలిగే అనుభూతియే నిజమైన సంగీతానుభూతి.

సంగీతం అంటే ఏదో కొందరి కోసం కొందరిచేత కొందరి యొక్క అవసరమైన విలాసం కోసం (లగ్జరీ) అనుకునే వారికి శాస్త్రము, స్వరము, రాగ నిర్ణయం, రసము మొదలైన విషయాల అవసరం ఉండవు.

ఆనంద సాగరమీదని దేహము భూమికి భారమని త్యాగయ్య గారు చెప్పిన ఆ ఆనందం వేరు.

ఆనందంగా ఆకాశంలో ఎగిరి సుదూర తీరాలకు చేరాలని విమానాశ్రయానికి వెళ్తాం. టేకాఫ్ లేకుండా ఎంత సేపూ రన్‌వే మీదనే తిరుగుతూ, ఊరికే చక్కర్లు కొడుతుంటే ప్రయోజనం ఎలా ఉండదో, ఆనందామృత అనుభూతి ఇవ్వలేని సంగీతం కూడా అంతే. ఈ లోకాలన్ని పరబ్రహ్మం యొక్క జ్ఞాన స్వరూపాలే అనే భావంతో ఉండే నాదయోగి తన ఆత్మారాముడితో తాదాత్మ్య భావాన్ని కలిగి ఉంటాడు. ఆ దివ్యమైన గానం వినేది ఆత్మారాముడే – ఎదురుగాఉన్న శ్రోతలు కాదు. వారు నిమిత్తమాత్రులు.

నాలుగున్నర నిమిషాల పాటకే ఆహా! ఓహో అని వెర్రిగా ఊగిపోయే వారికి వెనకటితరంలోని విద్వాంసులు గంటలకొద్దీ రాగాలు జలపాతంలా పాడేసేవారని తెలిస్తే ఆశ్చర్యంగా ఉంటుంది. ఏడాది పొడవునా తంజావూరు సంస్థానంలో ఉన్న 365 మంది విద్వాంసులు ఒక్కొక్కరు ఒక్కొక్క రాగం పాడేవారట.

శంకరాభరణం నరసయ్య, తోడి సీతారామయ్య, (పట్నం) బేగడ సుబ్రహ్మణ్య అయ్యర్ మొదలైన ఎందరెందరో విద్వాంసులు ఎందరో దీనికి ఉదాహరణ. అంతే కాదు. రాగాలను తాకట్టు పెట్టి సొమ్ము తెచ్చుకున్న సంఘటనలున్నాయి. విద్వాంసులను బట్టి రసికులుంటే అలాగే ఉంటుంది.

సుస్వరం, శుద్ధమైన మనస్సే పెట్టుబడిగా సద్భక్తి, సంగీత జ్ఞానమే అర్హతలుగా, పరమార్థమే లక్ష్యంగా పాడుకుని తరించారు.

దూరంగా నిల్చుని చూస్తే పువ్వుల అందం తెలుస్తుంది. దగ్గరగా పట్టుకుని చూస్తే పరిమళాలు వెదజల్లుతాయి. కాని, తుమ్మెద తన ఆరు కాళ్ళు పువ్వుల్లోకి జొనిపి గర్భకుహరంలోనికి చొచ్చుకుపోయి మకరందాన్ని గ్రోలుతూ మత్తెక్కి పోతుంది. శుద్ధమైన సంగీతాన్ని నమ్మిన నిజమైన సంగీత సాధకుడి పరిస్థితి కూడా అలాగే ఉంటుంది.

ఆకర్షణతో కూడుకున్న సంగీతానికి ఆదరణ ఉండదు. నియమ నిష్టలతో నేర్చుకున్న గౌరవమైన సంగీతానికి ఆకర్షణ ఉ ండదు. మూర్తిత్రయం వారి తర్వాత 60,70 ఏళ్ళకు మొదటితరంలోని త్యాగయ్య శిష్య పరంపర ఆరంభమైంది. క్రమంగా ఆయన సంగీత రీతులన్నీ ప్రచారమవటం మొదలయ్యాయి. ఎందరో విద్వాంసులు బయలుదేరారు.

పామరులు కూడా పండితులై, సంప్రదాయ సంగీతాన్ని గౌరవిస్తూ వినటం అలవాటు చేసుకున్నారు. ఆ సంగీత రసికులే శిష్యుల సంగీత స్థాయినీ, సంఖ్యనీ పెంచేశారు. అలా పెరిగీ పెరిగీ మహా వటవృక్షంలా అయిపోయింది. శాఖోపశాఖలై వర్థిల్లుతూ వచ్చింది.

సంగీతం కోసమే సంగీతం నేర్చుకుని పాడవలసినదంతా పాడేశారు. అటువంటి సమ్మోహనకరమైన సంగీతం పాడిన వారిలో కోనేరి రాజపురం వైద్యనాథయ్యర్, ఆ రోజుల్లో అంటే 19వ శతాబ్దంలోనే తిరుగులేని సంగీత విద్వాంసుడుట. ఓసారి మా పరమేష్టి గురువైన పినాకపాణి గారి స్నేహితుడైన డా.బ్రహ్మయ్య శాస్త్రి గారనే సంగీత రసికుడు, ఈ మహా విద్వాంసుణ్ణి గురించి విశాఖ రైల్వేస్టేషన్‌లో కూర్చుని చెప్పారు. విస్తుపోతూ విన్నాను.

జట్కా బండి తోలుకునే జనం కూడా వైద్యనాథయ్యర్ కచేరీకి వస్తూ, దూరంగా బళ్ళు కట్టేసి, కూర్చుని వినేవారంటే సంగీతం మీద వాళ్ళకున్న ఆసక్తి ఎంతో, ఎలా ఉండేదో ఊహించండి. ఉత్తమ విలువలతో కూడిన సంప్రదాయ ఆచారాలు, కట్టుబాట్లు సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో ఉత్తమ

సంగీతమైనా సాహిత్యమైనా వాటి పాత్రను అవి పోషించి తీరుతాయి– అనటానికి ఈ విద్వాంసులే సాక్ష్యం.

గుంటూరులో బలిజేపల్లి సీతారామయ్య (1885–1947) అనే ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసుడు కోనేరి రాజపురం వైద్యనాథ అయ్యర్ పాటకు పరవశుడై గుంటూరుకు ఆ మహా విద్వాంసుడ్ని ఆహ్వానించి కొన్ని రోజుల పాటు ఆయన గానాన్ని ఆస్వాదించాడు. ఈమని లక్ష్మీనారాయణ, తాడిగడప శేషయ్య, బలిజేపల్లి మద్రాసులో కొన్నాళ్ళపాటు ఉండి కోనేరి రాజపురం గానాన్ని పరిపూర్ణంగా విని ఇక్కడ ఆ శైలిని ప్రచారం చేశారు.
మహా వైద్యనాథ శివన్, పట్నం సుబ్రహ్మణ్యయర్,ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్, తంజావూరు కృష్ణ భాగవతార్, కోనేరి రాజపురం వైద్యనాథయ్యర్, మధురై పుష్పవనమయ్యర్ లాంటి మహావిద్వాంసులు ఎందరో దక్షిణాది (తమిళనాడ) నుండి, కర్ణాటక నుండి వీణ శేషన్న, వీణ సుబ్బన్న, వీణ పద్మనాభయ్య, పరమేశ్వరయ్యర్, కెంపెగౌడ, మైసూర్ సదాశివరావు, బిడారం కృష్ణప్ప, బెంగుళూరు నాగరత్నమ్మ, సంప్రదాయ సంగీత వైభవాన్ని విస్తరింపజేయటం ప్రారంభించారు. పిరాట్ల శంకరశాస్త్రి, బలిజేపల్లి సీతారామయ్య, తాడిగడప శేషయ్య, మొదలైన వారు ఆంధ్రదేశంలో దక్షిణాది సంగీత సంప్రదాయాన్ని నెలకొల్పారు. కానీ, శిష్యులను పెద్దగా తయారుచేయలేకపోయారు. తమిళనాడు నుంచి, తిరుకోడి కావల్ కృష్ణయ్యర్, గోవిందస్వామి పిళ్లై, రాజమాణిక్యం పిళ్లై వంటి వయోలిన్ విద్వాంసులు, పళని స్కూలు నుంచి మాంపూడియా పిళ్లై, దక్షిణామూర్తి, అళఘునంబి వంటి మేధావులైన మృదంగ విద్వాంసులు కూడా వెలుగులోకి వచ్చేశారు.

అద్భుతమైన శిష్యులను తయారుచేసిన వారిలో 'పూచి' (రామనాడ్) శ్రీనివాసయ్యంగార్ (1860–1919) పేరు చిరస్థాయిగా సంగీత లోకంలో నిలిచిందనడానికి కారణం నిజ మర్మములను తెలిసి నిజాయితీగా తనకు స్వాధీనమైన సంప్రదాయ సంగీత విద్యను అర్హులైన వారికి పంచి పెట్టిన మహా ప్రజ్ఞాశాలి కావడమే. త్యాగరాజ స్వామికి మూడవ తరంలోని వాడు పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ శిష్యుడు.త్యాగరాజ కీర్తనలను, అనుష్టాన పూర్వకంగా పాడుకున్న 'పట్నం', సంగీత బోధ చేయటంలో ఎంతో సమర్థుడుగా పేరు తెచ్చుకున్న మహా విద్వాంసుడు.

గట్టెక్కించ గల గురువును పట్టుకోవడంలోనే సంగీత రహస్యం దాగి ఉంది. పొరబాటున గురి తప్పిందా ?

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని చందంగా అర్హతలున్న వారు కూడా భ్రష్టులై పోతారనే వారు మా గురువుగారు.

ఓ రోజు శ్రీనివాసయ్యంగార్ తలంటు స్నానం చేస్తూ ఉండగా, ఆయన కోసం వేచి యున్న ఇద్దరు సంగీత విద్వాంసులు (తంజావూరు కృష్ణభాగవతార్, శూలమగళం వైద్యనాథ భాగవతార్.. ఇద్దరూ పేరున్న హరికథా భాగవతార్‌లే!) శ్రీనివాసన్ గారు! మీ గురువుగారి 'ముఖారి' రాగకీర్తన 'ఎప్పుడు కృప గల్గునో' విందామని ఆశగా వచ్చాం. ఒక్కసారి మీ నోట ఆ కీర్తన విని వెళ్ళిపోతామన్నారు. స్నానాల గది నుండే కీర్తన పాడటం మొదలుపెట్టి పక్క వాద్యాలతో కచేరిలో కూర్చుని ఎలా పాడతారో అలాగే పాడి ముగించి ఇవతలకు వచ్చాడు. అద్భుతమైన ఆ కీర్తన విన్న ఆ ఇద్దరూ పులకాంకితులై నమస్కరించి పాదాభివందనం చేసి వెళ్ళిపోయారు. సంగీతం నేర్చుకునే వారి కోసం ఎన్నెన్నో వర్ణాలు, కృతులు, జావళీలు, తిల్లానాలు రచించి సంగీత లోకంలో చిరస్మరణీయుడైన రామ్నాడ్ శ్రీనివాసయ్యంగార్ శిష్యుడైన అరియక్కుడి రామానుజయ్యంగార్ – ఈ వేళ మనం వింటున్న సంగీత కచేరీ పద్ధతికి ఆద్యుడు, మార్గదర్శకుడు.

## దండమూడి వారింట వివాహ మహోత్సవం

ప్రముఖ మార్దంగికులు కీ॥శే॥ దండమూడి రామమోహనరావు, శ్రీమతి సుమతి (మార్దంగిక శిరోమణి) గారల ఏకైక కుమార్తె చి॥ల॥సౌ వాణీ శ్రీలయ వివాహం శ్రీనర్రా రాధాకృష్ణ శ్రీమతి పుష్ప నళిని దంపతుల కనిష్ఠ కుమారుడు చి॥ విజయతేజతో ది.01.02.2020న ఫిల్మ్‌ఛాంబర్ ఫంక్షన్ హాల్, విజయవాడలో వైభవోపేతంగా జరిగింది.
సంగీత లోకమంతా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించింది.
'గానకళ' నూతన వధూవరులకు శుభాకాంక్షలు అందిస్తున్నది.

## శారదా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల

ఆధ్వర్యంలో అకాడమీ 19వ వార్షికోత్సవం సందర్భంగా ది.25.01.2020 నాడు వడయార్ చెన్నై విద్యార్థులచే నామ సంకీర్తనం కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. బాపట్ల శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపసభాపతి శ్రీకోన రఘుపతిగారు ముఖ్య అతిథి విచ్చేసి సభా కార్యక్రమాలు విజయవంతంగా సాగాలని ఆయన ఆశీస్సులు అందచేసారు.

# తంజావూరిలో ఆంధ్రదేశ విద్వాంసులు - సంగీత పరిణామములు

వేమూరి రామలక్ష్మి, సెల్ : 9701486050

తంజావూరు పాలకులు - నాయక రాజులు - మహారాష్ట్ర పాలకులు క్రీ.శ.1580-1614 అచ్యుతప్ప నాయకుడు - మంత్రి గోవింద దీక్షితులు.

1614-1633 రఘునాధనాయకుడు - మహామంత్రి. గోవింద దీక్షితులు-యజ్ఞనారాయణ దీక్షితులు, వెంకటేశ్వరదీక్షితులు- మంత్రులు.

1633-1673 విజయరాఘవ నాయకుడు

మహారాష్ట్ర పాలకులు

1676 - 1623 ఏకోజి -1

1684 - 1712 శాహజీ, శాహభూపాలుడు

1711 - 1728 మొదటి శరభోజి- శరభభూపాలుడు (శహజీకి మొదటి తమ్ముడు)

1728 - 1736 తులజాజి (శహజీకి రెండవ తమ్ముడు) తుక్కాజీ (సంగీతసారామృతకర్త)

1736 - 1739 రెండవ ఏకోజీ (తులజాజికుమారుడు) అలియాస్ భావసాహెబ్

1740 - 1763 ఏకోజీ తరువాత - జయసింహుడు, ప్రతాపసింహుడు, తులజాజి -2 (1763 -1787)

1787 -1798 అమరసింహుడు (సవతి తమ్ముడు)

1798 - 1832 శరభోజీ -2 (అపరభోజుడు)

1832 - 1855 శివాజీ - 2

తంజావూరు పాలకుల కాలంలో సంస్కృతాంధ్రభాషలు, సంగీత నాట్యములు ఆదరించబడినవి. నాయకరాజులు, ఆస్థాన విద్వాంసులును అనేక యక్షగాన రచనలు చేశారు.

తరువాత పాలించిన మహారాష్ట్రులు - మాతృభాష మరాఠీ అయినను, తెలుగు సంస్కృత భాషా విద్వాంసులను ఆదరించేరు, సంగీత నాట్యాలను, యక్షగాన రచనలను ప్రోత్సహించేరు. రఘునాధ నాయకుడు ''జయంతసేన'', రామానందము'' - అనుక్రొత్త రాగములను కనిపెట్టేరు. 'రఘునాధ నాయక మేళవీణ' కనిపెట్టబడినది.

గోవింద దీక్షితులు 'సంగీత సుధ' లక్షణగ్రంధము రచించేడు. వేంకటమఖి/వేంకటేశ్వరదీక్షితులు 72 మేళకర్తల పధకము రూపొందించిన మొదటి లక్షణకారుడు. నాయక రాజులు, మహారాష్ట్ర పాలకుల కాలంలో సంగీత నాట్యములకు 'స్వర్ణయుగం'. అనేక మంది సంగీత విద్వాంసులు రచించిన వివిధ రకములైన సంగీత రచనలు - తరువాత కాలంలో పరిపూర్ణతను సంతరించుకున్నాయి. వేంకటమఖి "చతుర్దండి ప్రకాశిక" అను లక్షణ గ్రంధమును వ్రాసాడు.

యక్షగానములలో అనేక దేశిరాగ రూపములు మనకు కనబడతాయి. కళవాణి, కేదారి పంతు, ఖాచి (ఖమాచి), గౌడపంతు, ఘంటరావము, లలిత పంచమము, సాళగసౌరాష్ట్ర, గుమ్మకేదార, మొదలైన ప్రాచీన రాగాలు, తివుడ, విజయభూషణ వంటి తాళములు, యక్ష గానములు, క్షేత్రయ్యపదములు, అన్నమయ్య సంకీర్తనలలోనే మనకు లభ్యమగుచున్నవి.

గనుక - ఆయా వాగ్గేయ కారుల రచనలు మనకు అమూల్యములు, పరిశోధకులు దీనిపై దృష్టి సారించుట అవసరము.

**వెంకటమఖి (వెంకటేశ్వర దీక్షితులు) (1614 - 1633** (ప్రాంతము) : తంజావూరు రఘునాధ నాయకుని మహామంత్రి యైన గోవింద దీక్షితులు యొక్క రెండవ కుమారుడు వేంకటముఖి. పెద్దకుమారుడైన యజ్ఞనారాయణ దీక్షితునికి శిష్యుడు. తానాప్పాచార్యుని వద్ద సంగీత శాస్త్రం లక్ష్య లక్షణ సహితంగా సంపాదించాడు. 50 రాగాలకు పైగా లక్షణం స్థిర పరచి - లక్ష్యగీతములు కూడా రచించేడు.

క్రీ॥శ 13వ శతాబ్దమందు గోపాలనాయకుడను సంగీత విద్వాంసుడు "చతుర్దండి" యని బిరుదు వహించి గానము చేసిన గీత - ప్రబంధ - రాయ, ఆలాపాలననుసరించి సంగీత రచనలు చేసిన వాగ్గేయకారుడు. 10 ప్రకరణములతో కూడిన " చతుర్దండి ప్రకాశిక" యను గ్రంధమును రచించాడు. ఎన్నో లక్ష్య, లక్షణ గీతములు రచించాడు. 72 మేళకర్త రాగములు, వానికి జన్య రాగములను నిర్దేశించి, వానికి లక్షణ గీతములు రచించాడు. జయదేవుని గీతగోవింద మార్గములో 'శ్రీత్యాగరాజేశ్వరుని'కి అంకితముగా రచన చేసేడు. 1660 లో చతుర్దండి ప్రకాశిక లక్షణ

గ్రంథం రచించాడు. శ్రీకృష్ణ దేవరాయల కాలం నుండి నాయక రాజుల వరకు గల సంగీత చరిత్రకు ఆధారము ఈ చతుర్దండి ప్రకాశికయే !!! నాయకరాజులు, మహారాష్ట్ర పాలకుల కాలంలోఆస్థాన విద్వాంసులు, యక్షగాన రచనలు చేసిన ఆంధ్ర బ్రాహ్మణ భాగవత మేళముల వారు రచించిన రచనలలో వాడిన అపూర్వ, దేశీయ రాగములైన గౌడిపంతు, సైంధవి, పూర్వగౌళ, నవరోజు మొదలైన రాగముల లక్షణములు ఈ చతుర్దండి ప్రకాశికలో కనబడతాయి. క్షేత్రయ్యపదములలో కూడా యీ దేశిరాగములు కనబడతాయి.

**నాడులు - నాయంకరములు :** శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలనా సౌలభ్యం కోసం – కొన్ని ప్రాంతములను విభజించి – ప్రాంతీయాధికారులుగా – రాజ ప్రతినిధులుగా – దండ నాయకులుగా కొందరు నాయకులను నియమించాడు. 'పాలన' ను నాయంకరము' అనియు – ఆయా రాజ ప్రతినిధులను "అమరనాయకులనియు" వ్యవహరించారు.

అటువంటి ప్రాంతములే మధుర, తంజావూరు, చెంజి (సెంజి) – నారాయణతీర్థులు, క్షేత్రయ్య పర్యటించిన ఈ ప్రాంతములలో ఆంధ్రదేశమునుండి వలసలు వచ్చిన వారధికసంఖ్యలో ఉన్నారు. ఈ నాయకరాజులందరును తెలుగువారే ! వీరికి సంగీత నాట్యకళాభిరుచి ఎక్కువ, కృష్ణా – గుంటూరు ప్రాంతముల నుండి వలసలు వచ్చిన ఆంధ్రబ్రాహ్మణ (త్రైలింగ) వెలనాటి భాగవత మేళముల వారికి నాయక రాజులు బహుమానముగా యిచ్చిన ఊత్తుకాడు, మేరత్తూరు, శూలమంగలం, మూవనల్లూరు, గోవిందపురం లోని అనేకమంది వాగ్గేయకారుల కృషి ఫలితంగా సంగీతం పరిణామములు చెందుతూ వృద్ధిపొందుతూ – విస్తరిస్తూ వచ్చింది.

ఈ కాలంలో యక్షగాన సంగీత నాట్య ప్రబంధము – లేగాక – అనేక గీత రచనలు, స్వరజతులు, తిల్లానాలు, దరువులు, శబ్దములు కూడా రచించబడినాయి.

**నారాయణ తీర్థులు (1580–1680):** తంజావూరు నాయక – మహారాష్ట్ర పాలకుల కాలం. ఈ కాలంలో సంగీతంలో అనేక విధములైన పరిణామములు చోటు చేసుకున్నాయి.

వాగ్గేయకారులైన అనేక మంది శాస్త్రీయ, జానపద సంగీత రీతులను పరిశోధనాత్మక దృష్టితో పరిశీలించి లక్ష్య లక్షణములను సమన్వయం చేయుటకు చాలా ప్రయత్నాలు చేశారు.

శ్రుతులు, స్వరస్థానముల నిర్ణయము, రాగ పరిణామము లననుసరించి సంగీత వాద్యముల పరిణామముల పరిణామములు ఈ కాల మందు జరిగినవి. నాయకరాజులు, మహారాష్ట్ర పాలకులు యక్షగానముల నాదరించేరు.

సంగీత రచనా విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ దశలో నారాయణ తీర్థులు రచించిన "శ్రీకృష్ణలీలా తరంగిణి" యను మహా సంగీత యక్షగానము ప్రాధాన్యత సంతరించుకున్నది.ప్రాచీన సంస్కృత యక్షగానముల వలనే– ఇది సంస్కృతమందు రచించ బడిననూ యిందలి రచనలలో తెలుగు భాషా యతి ప్రాసలు వాడబడినవి. 12 అంశములుగా రచించబడిన వీనికి 'తరంగముల'ని పేరు. ప్రతి తరంగ భాగములోను శ్లోకము, దరువులు, చూర్ణిక, దండకము, కీర్తన, గద్యలతో కూడి ఉండి, నృత్త గీత, వాద్యములకనుగుణముగా వ్రాయబడిన ఈ కృష్ణలీలా తరంగిణి– ప్రాచీనా చార్యులు " సంగీతము'' పదమును నిర్వచించిన విధముగా నృత్త గీత వాద్యములకు సమాన ప్రాధాన్యత ఇవ్వబడినది.

వేదాంత బోధనాత్మకమైన – భక్తి రస ప్రధానమైన ఈ యక్షగానము –దేవాలయములందు, నాట్య ప్రదర్శనలలోను, సంగీత కచ్చేరీలలోగానము చేయుటకు అనుకూలముగా నుండుటయే గాక – ప్రాచీన మార్గతాళములు కనుమరుగు అగుచున్న ఈ తరుణంలో దేశీయ సూళాది తాళములు ప్రవేశించి, మృదంగ పాటముననుసరించి రచించబడిన 'శబ్దజాతులు' తరువాత వాగ్గేయ కారులు "కృతి" రచనల్లో సొల్లుకట్టు స్వరములు ప్రవేశ పెట్టుటకు మార్గమును కల్పించాయి.

శ్రీపాదరాయలు, అన్నమయ్య, పురందర దాసులు రచించిన "సూళాది" రచనలే గాక – సప్తమ – తరంగములోని ధ్రువాది సప్త తాళములందలి కీర్తనలు కలిపి గానము చేసిన – "సూళాది ప్రబంధము " వలె కనబడుతుంది.

వీనిని కీర్తన రచనల వలె విడివిడిగా కూడా గానం చేయవచ్చును. అందువలన ఇది ప్రాచీన సంస్కృత ప్రబంధరచన పునాదులపై ఆవిష్కరించబడిన " కర్ణాటక సంగీత సంప్రదాయమైన యక్షగానమని" చెప్పవచ్చును.

సంగీత, సాహిత్య నాట్య వేదాంతాది బహుశాస్త్ర వేత్తయైన నారాయణ తీర్థులు యోగి పుంగవులు, తత్త్వవేత్త. కృష్ణా తీరం నుండి బయలుదేరి–అనేక క్షేత్ర దర్శనములు చేస్తూ తంజావూరు

చేరిన కాలంలో-అక్కడ పాలిస్తూఉన్న నాయక రాజులు ఆంధ్రదేశము నుండి వలసలు వెళ్ళిన అనేక మంది భాగవతమేళ కుటుంబములకు ఆశ్రయమిచ్చి విద్వత్తును గౌరవించి దానము చేసిన గ్రామములే మేలత్తూరు, ఊత్తుకాడు, శూల మంగళం, మూవనల్లూరు, గోవిందపురం. శ్రీకృష్ణలీలా తరంగిణిలో కనబడిన 'వరహూరు' ఇక్కడనే ఉన్నది.

'అచ్యుతాబ్ధి'కే ''అచ్యుతరాయ సముద్రము''- 'భూపతిరాజపుర 'మని పేర్లు, వేదశాస్త్ర పండితుడు, వాగ్గేయ కారుడు, లక్షణకారుడు అయిన గోవింద దీక్షితులు తంజావూరు అచ్యుతప్పనాయకునికి - రఘునాధనాయకునికి ఆస్థాన విద్వాంసుడు - మహామంత్రియైన రాజ్యతంత్ర నిపుణుడు.

అన్నమయ్య, పురందరదాసుల కాలంలో ఎక్కువగా ప్రచారంలో ఉన్న భజన సంప్రదాయ సూళాదులు నారాయణ తీర్థుల వారి కాలానికి కనుమరుగైనాయి. అయినప్పటికీ వాని మూల లక్షణములు కొన్ని తీర్థుల వారి తరంగాలలో కనబడుతూంటాయి. సూళాది రచనలకు గల లక్షణములలో ఒకటి యిందులోని సాహిత్యము (మాతువు) విభాగములు, ఖండములు , గద్య, పద్య కీర్తనారూపములలో ఏదైనా ఒకటిగా ఉండవచ్చును. అన్నమయ్య, పురందరదాసుల సూళాదులు గద్యములుగా కనబడుతున్నవి. తీర్థులవారి యక్షగానంలో సూళాదులు కీర్తనారూపంగా ఉండుటచే అవి నృత్తగానాదులకనుకూలంగా ఉన్నాయి. అన్నమయ్య సూళాదిలోని "తివుడ" 'ర' గణం / లేదా/ రగణమఠ్య తాళములు కూచిపూడి భాగవతులు ప్రదర్శనలలో ఈ నాటి మఠ్య తాళమునకు సరిపోల్చవచ్చును. యిది గతిబేధముగా అక్కడక్కడ కొన్ని ప్రయోగములుగా కనబడిన

సారిసా-నీదనీ -/ పాదనీ - దాపమా ।

సారెసా-రెకూనీ / కోరినా   నునిపా

(ఖమాన్‌స్వరజాతిలో భాగం )

ఈ విధమైన ప్రయోగములు మఠ్యతాళాంగములతో వేసిన యెడల - అది 'రగణ' మఠ్య అవుతుంది. తాళాంగములు లఘువు - ద్రుతము - లఘువు = ।౦। -మఠ్యతాళం

ఛంధస్సు - గురువు - లఘువు - గురువు = 2-2 -రగణమఠ్య

రా - జ - భా

సంగీతంలో లఘువు - 4 అక్షరకాలములు - ఛంధస్సులో లఘువు - 1 హ్రస్వాక్షరం సంగీతంలో గురువు = 8 అక్షర కాలములు - ఛంధస్సులో గురువు -2 అక్షరాలు. చిత్రకవితలుగా ఇటువంటి రచనలు కొన్నిటిని వాగ్గేయ కారులు వాడినారు. అన్నమయ్య చెప్పిన తివుడ తాళము-నేడు 'త్రిపుట' తాళమునకు పేరు. అన్నమయ్య చెప్పిన "చేపదోళము-4పాదములు గలిగిన సాహిత్యం-ఏకతాళం,తీర్థులవారితరంగ కీర్తనల్లో 4పాదములు గల (పంక్తులు) చరణములు గల కీర్తనలు చాలా ఉన్నాయి.

సంగీత చరిత్రలో తీర్థులు వారి కాలం మొదలు సంగీత త్రిమూర్తులైన త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముద్దు స్వామిదీక్షితులు వారి కాలం వరకు పరిణామ కాలం చాలా కీలకమైనది.

ప్రాచీన సంగీత మూలములపైననే వాగ్గేయ కారులు రచనలు చేయుటచేత - ఇవి భరతుని నాట్యశాస్త్ర కాలమునాటి రచనలకు ప్రతిబింబములు. భద్రాచల రామదాసు కాలం నుండి వచ్చుచున్న చూర్ణిక, దండకము, రగడ, ద్విపదులకు తెలుగు భాషా ఛందస్సులే వాడబడుతున్నాయి. దండకము, చూర్ణికలు ప్రాచీన ప్రబంధరీతులు. దేవతాసంబధమైన- భక్తి రసయక్షగానములు -దేవాలయములందు ప్రదర్శించేవారు. తరువాత కాలంలో - నాయకరాజుల కాలం నుండి- రాజా స్థానములో ప్రదర్శించే యక్షగానములను కూడా కొందరు వాగ్గేయకారులు రచించినారు.

ఇందులో యక్షగానములలో కనబడు ప్రాచీన ప్రబంధము ''కైవాడము''. ఇది కైవారము, ''కౌతము' ''కౌత్వము'' గా వ్యవహరించబడుతున్నాయి. దేవాలయములందు ప్రదర్శించు కైవారము / కౌతము ఆ దేవతాస్తుతి గాను, రాజాస్థానములలో ప్రదర్శించు కైవారము రాజస్తుతి గాను ఉంటుంది.

వీనిని రామామాత్యుడు, గోవింద దీక్షితులు దేశిప్రబంధ విశేషంగా పేర్కొన్నారు. తంజావూరు మహరాష్ట్ర పాలకుల కాలములో 'శబ్దము', సలాము శబ్దములుగా మారింది. తంజావూరు నందలి " తిరువాసనల్లూరు' గ్రామమును శాహజీ మహరాజు 46 మంది విద్వాంసులకు దానమిచ్చాడు. దీనికి 'శాహరాజపురం' అని వ్యవహారం. ఈ కాలంలో కనబడే మరియొక రచన 'తోడయము'. ఇది 'జయ జయ' శబ్దములతో ప్రారంభం అవుతుంది. ఇది ప్రాచీన కాలమందలి 'మంగళగీతి' వంటిది తోడయమంగళము.

శార్ఙ్గదేవుడు చెప్పిన "కైవాడప్రబంధపు" ఆద్యతన పరిణామమే "శబ్దము" అని చెప్పబడినది. "శబ్దము" అనునది ఒక నృత్య గీతము అనియు, ఈ రచన అంతయు జతులు

కూర్చబడి-నాట్య అభినయములకు అనుకూలముగా రచించబడినదే "శబ్దము" అని కూడా చెప్పబడినది.

ఉత్తర హిందూదేశ మందలి "కవిత్త " అను కవిత్వగీతము నుండి దక్షిణ హిందూ దేశ సంప్రదాయములోనికి వచ్చినట్లు కూడా చెప్పబడినది. (రిఫరెన్సు: తె.వి.స. వాల్యూమ్.3) దీనిని బట్టి ఈ ''కవిత్త'' యే ''కౌతము'' గా వ్యవహారము కలిగినదని భావించవచ్చును. ఆంధ్రదేశము నుండి తంజావూరునకు వలసలు వెళ్ళిన భాగవత మేళముల వారి కాలంలో దేవాలయములతో సంబంధము కలిగిన రెండు శాఖలు ఉండెడివి. 1. నృత్య నాటకములు 2. దేవదాసీ నృత్యములు. మొదటి శాఖయైన నృత్యనాటకములను బ్రాహ్మణులు - అందులో నూ ముఖ్యముగా పురుషులు మాత్రమే ప్రయోగింపుచూ వచ్చేరు.దీనికి "భాగవత సంప్రదాయమని పేరు. ఈ భాగవత మేళముల వారు వేదశాస్త్ర సంస్కృతాంధ్ర పండితులు. దేవతాస్తుతిగా - కవితా రచనలుగా రచించబడినవియే " కౌతములు" గా వ్యవహరించి యుందురు. రాజ ఆస్థానములందు ప్రదర్శించునవి "శబ్దము" లుగా చెప్పి యుందురు. కూచిపూడి నాట్య భాగవతులు 'గణపతి కౌతము'ను ప్రదర్శించుట అందరికిని తెలిసినదే !

శాస్త్రీయ సంగీతము నేర్చుకొనిన వారందరును-ఈ పరిణామదశలను తెలిసికొనుట అవసరము.దాని వలన పూర్వీకులు రచించిన వివిధ రచనలలోని వైవిధ్యము తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

మొదటి శరభోజి కాలము నుండియు తంజావూరు ఆస్థాన విద్వాంసునిగానున్న గిరిరాజకవి యక్ష గాన రచనలు చేసేడు. ఈ రచనా సంప్రదాయ వారసత్వంలో త్యాగరాజు 'ప్రహ్లాద భక్తి విజయం' అను సంగీత యక్షగానం రచించాడు.

**క్షేత్రయ్య (1600-1680):** కృష్ణాతీరంలోని -కూచిపూడి' గ్రామమునకు సమీపంలో ఉన్న 'మొవ్వ' గోపాలాంకితంగా వేల పదములు రచించిన క్షేత్రయ్య అసలు పేరు 'వరదయ్య'. ఇతడు గోల్కొండ మొదలు తంజావూరు వరకు గల అనేక క్షేత్రములను- రాజాస్థానములను దర్శించి - బహుమానములు పొందాడు. రాజాస్థానములలో పాడుటయే గాక - అచ్చట నర్తకీమణులకు కూడా పదాభినయములను నేర్పిన ఆచార్యుడు. క్షేత్రయ్య పదములు శృంగారరస ప్రధానంగా ఉండి, అంతర్గతంగా ఆధ్యాత్మిక భోధన ఉంటుంది. అన్నమయ్య శృంగార సంకీర్తనలు చేసేడు. నారాయణతీర్థులవారి తరంగాలలో కూడా శృంగారరసం కనబడుతుంది. క్షేత్రయ్య రచించిన 'పదములు' అందుకు భిన్నంగా కనబడతాయి. అన్నమయ్య రచనలలో వేంకటేశ్వరుడు/అలమేలుమంగ -స్వీయనాయక. తీర్థులవారి తరంగములలలో పరమేశ్వరుడు నాయకుడు-జీవాత్మ-నాయిక (గోపికలు). క్షేత్రయ్య పదములలో శృంగారము అష్టవిధనాయికలు-నవరసములతో కూడియుండి-తెలుగు వ్యవహారిక భాషలో ఉన్ననూ-ధాతు కల్పనలో - స్వరములునిలిపి-రసభావములు చూపుట అవసరము గనుక-నాట్య, సంగీత కచ్చేరీలో వీనిని ప్రదర్శించుటకు చాలా అనుభవం కావలెను.

కొద్ది స్వరములతోనే విస్తారమైన రాగ ఆలాపనా భావములు మాతువు నందుగల ఒకే పదము/మాటకు-అనేకార్థములు చూపుట అనునది క్షేత్రయ్య రచనల ద్వారా-తర్వాత వాగ్గేయకారులకు మార్గము చూపించినది. ధాతు-మాతువుల విస్తరణము క్రమంగా అభివృద్ధి పొంది- త్యాగరాజాదుల కాలం నాటికి రాగాలాపన- స్వరకల్పనలతో మనోధర్మ సంగీత శాఖగా స్థిర పడినది.

సుమారుగా ఒకే శతాబ్దమునకు చెందిన ఈ ముగ్గురు వాగ్గేయకారులు - రామదాసు, నారాయణతీర్థులు -క్షేత్రయ్యలు-భగవంతుని చేరుటకై తపించేరు.
ఆశయం ఒక్కటే అయిననూ- రచనా విధానంలో అనుసరించిన మార్గములు వేరు. జయదేవుని గీత గోవిందమందలి అష్టపదుల వలె - క్షేత్రయ్య పదములు కూడా మొదట చరణము (ఉద్గ్రాహము), తరువాత పల్లవి (ధ్రువమ్) గా గానము చేయుట పద్ధతిగా వచ్చుచున్నది. పల్లవితో పాటు అనుపల్లవిని చేర్చే సంప్రదాయమునకు క్షేత్రయ్యయే మార్గదర్శకుడైనాడు.

అందువలన క్షేత్రయ్య కాలము నుండియే సంగీత రచనలలో ''అనుపల్లవి'' అను అంగము కనబడుచున్నది. మాటలలోని అనేక భావములకనుగుణంగా - రాగ విన్యాసాలతో రాగ స్వరూపాన్ని అద్వితీయంగా చూపించిన ప్రతిభాశాలి క్షేత్రయ్య. ఒకరసము నందు వివిధావస్థలను బట్టి రాగములను ఎన్నుకొనుటలోను, భావోద్రేకములు కలిగించగల స్వరసంగతులు రచించుటలో క్షేత్రయ్యకు గల అపారమైన రాగ జ్ఞానము వ్యక్తం అవుతుంది. ఉదాహరణకు- కరుణరసమునకు సంబంధించినది దుఃఖము. యిది,ఓర్చుకొనగలిగినది, దుర్భరమైనది,

హృదయవిదారకమైనది-విలాపముతో కూడిన దుఃఖము-ఈ విధంగా అనేకావస్థలుంటాయి. ఆయా స్థాయిలను బట్టి ముఖారి, ఘంట, నాదనామక్రియ, పున్నాగవరాళి వంటి రాగములను వాడుటలో క్షేత్రయ్యకుగల సంగీతము రాగానుభవం వ్యక్తం అవుతున్నాయి. రాగప్రస్తారానుకూలముగాలేని సైంధవి, నవరోజు వంటి రాగాలను కూడా తన పదములలోని భావానుకూలంగా మలచుకున్నాడు. అన్నమయ్య వాడిన అనేకరాగాలు క్షేత్రయ్య కాలానికి కనుమరుగు అవుతూ వచ్చాయి. వానిని ఆ కాలంలో ఏ విధంగా పాడేవారో తెలుసుకొనగలిగే ఆధారములు లేవు. అందువల్ల క్షేత్రయ్య వాడిన రాగముల సంగీత ప్రస్తారములే- ఆనాటి సంగీతమును తెలుపునవిగా ఆధారములుగా ఉన్నాయి.

క్షేత్రయ్య కాలంలో తంజావూరు నందు గల గాయకులు, నటులు, కవి, పండితులు కూడా ఈ పదములలోని రస భావౌన్నత్యమును ప్రశంసించుట వల్లనే- ఆనాడు "పదగాన మునకు" రాజాస్థాన గౌరవం కలిగింది. మధుర, తంజావూరు, సెంజి (జింజి), గోల్కొండ రాజాస్థానములలో క్షేత్రయ్యకు గల అపారమైన నాట్యశాస్త్ర, అలంకారశాస్త్రములకు విశేష గౌరవము లభించినది.

త్యాగరాజాది వాగ్గేయ కారుల ముందటి కాల రాగ స్వరూపములను తెలిసికొనుటకు క్షేత్రయ్య వాడిన రాగములే ప్రమాణికములు. అన్నమయ్య కాలంలో - పదములు-సంకీర్తనాపదములుగా వ్యవహరిస్తూ ఉన్న "పదము" అను శబ్దము/మాట- క్షేత్రయ్య కాలము నాటికి-"పదము" అనగా క్షేత్రయ్య "శృంగారపదము" నకే "పదము" అనే వ్యవహరించుట స్థిరపడినది.

కావ్యములలో "బయకార" శబ్దమునకు ఇచ్చిన అర్థములు (సూ. ఆం. నిఘంటువు)

1. బయకాడు : (బయలు-వృత్తిని వర్ణలోపము)
స్వరాదులు ప్రకటించువాడు-వైణికుడు

సీ॥ బయకాడు వీణెకాఁడునబొల్పు, వైణికునకు (సాం-ని-మాన-10) (సాంబ నిఘంటువు -కస్తూరి రంగకవి)

గీ॥ పంచమపుఁదంతి బయకాఁడు వట్టి మీట-గమ్ముమను నాదమును-రమ్ముకరణిగాగ (పార్వ-3-75/పార్వతీ పరిణయము-కోటిరాయ రఘునాథ తొండమాన్ భూపాలుడు).

సీ॥ మనసైన నొకసారి తనుఁదానె బయకానిముని ఁబిల్చి/ పాడించుకొనఁగరాదు (చం-రా-2-25/ చంపు రామాయణము-ఋగ్వేదకవి వేంకట చలపతి)

2) బయకాడు/గాయకుడు: పాటపాడువాడు-రాగమును వెలువరించువాడు.

సీ॥ వరిహాసకులు నటులె బయకాండ్రు మొగసాలగాచినారని తెల్పు కటికవాని (ఉ.రా.4-223) (ఉత్తర రామాయణం- కంకంటి పాపరాజు)

సీ॥ ఇంపు సొంపుల ఁబాడునెలతేటి బయకాఱులకు - వన్నె మీఱు నీలము లొసంగె (అని-2-41)

3) బయకారుడు/గాన విద్యోపాధ్యాయుడు:

ఉ॥ ..... బయకాఱులొనర్చినట్టి ప్రావేశిక మంగళ ధ్రువలు వీనుల కింపుగఁబాడి రంగనల్ (నైష-7-146)

ఉ॥ అలరాజనిభాస్య యెలుంగగట్టిగా, కోయిల కంచు కుత్తి కలకున్ బయకాఁడనవచ్చు నెచ్చెలీ... (విజయ-వి-1-119) (ఇటనౌపన్యుద్యోతము)

4) బయకాడు/జంత్ర గాత్రములయందు నేర్పుగలవాడు
సీ ॥ గాణయం చనఁగను గాయకాభిదచెల్లు
వీణెకాఁడనఁదగు వైణికుండు
బయకాఁడనంగ నుభయకారి విలసిల్లు (ఆం-భా-2-287) ఆంధ్ర భాషార్ణవము- నిఘంటువు-నుదురుపాటి వేంకనార్యుడు)
తెరగంటి బయకాడు-దేవవైణికుండు-నారదుడు

సీ॥ నిలుచుండి వీణ చేతులఁబూని తెలుగంటి / బయకాడు మేల్కొలుపు పదముఁబాడ (కువల-1-125) కువలయాశ్వచరిత్రము-(సరవరము చిన నారాయణ కవి) మాపునెమ్మోము బయకాడు మధురగాన-రీతి రంగేశుఁ బాడ సంగీత సరణి (మాపు నెమ్మోము అపముద్రి) శ్రీరంగమహత్యము/ కట్టా వరదరాజేంద్రుడు) (శ్రీరం.మ.4.158) బయకము... బయ్యంక..నాట్యవిశేషము

ద్వి॥ భ్రమరము పాళెముల్ బయకమున్ మెఱసి, రమణ/ బంచాంపి పేరణి యాడువారు. ( పండితారాధ్య చరిత్ర- పర్వత ప్రకరణము-435. క్రొత్తప్రతి)

బయకారము (బయలు-కారము) గానము (చూ.బయకాడు)

ఉ॥ ... కిన్నెర మెట్లబంతి సం,గాతపు సన్నబంతి బయకారపుఁగన్నడ గౌళ పంతు కా, సాత తతాన తాను పసంది వుటాడెడు (పెద్దన చాటువు) బయకారి, (బయకారము+ఇ) సంగీతము పాడెడివాడు.

సీ॥ మంతుఁడన నొప్పు వెఱవింత హొంతకారి, సొగసు బయకారి జాణను జూచిదగ్గి (హంస-5-169) విలాసవంతుడని భావము) -హంస వింశతి- అయ్యలరాజు నారాయణామాత్యుడు)

బయకాడనంగ నుభయకారి విలసిల్లు

సుధా తరంగమ్-24

# మరపురాని గాయని శ్రీమతి శిష్ట్లా శారద

మోదుమూడి సుధాకర్ సెల్ : 9885183988

ఎడబాసి పోకోయి–ఈదాసి నీరేయి..' అంటూ పాడి, ఎల్లరి మనసులనూ దోచి, అనూహ్యంగా చిన్నతనానే ఈలోకాన్నే ఎడబాసి దిగంతాలకు సాగిపోయింది ఆ గాయని...

ఎక్కువమందికి తెలియకపోయినా, ఆంధ్రులు గర్వించదగ్గ మరో గోపాల'రత్నం' ఆమె...

శాస్త్రీయ, లలితసంగీతాలలో 'ఏ' గ్రేడ్ తోపాటుగా, స్వరకర్తగానూ అకాశవాణి ఆడిషన్ బోర్డ్ నుండి గుర్తింపు తెచ్చుకొని, కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో పాతికేళ్లలోపే సంగీత నిర్దేశకురాలిగా ఉద్యోగం పొందిన ప్రతిభాశాలి శ్రీమతి శిష్ట్లా శారద. తన భర్త వెంకటరమణగారు, బెజవాడలో రైల్వేఉద్యోగి కావటంతో, వారికోసం కొత్తగూడం నుండి బెజవాడకు రేడియోలో తంబుర నిలయకళాకారిణిగా వచ్చారావిడ. ఈ సందర్భంలో సంగీత నిర్దేశక పదవిని తృణప్రాయంగా త్యజించారావిడ.

1998 లో ఎంతో ప్రతిష్టాత్మకంగా బెజవాడ ఆకాశవాణి కేంద్రం, ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆహూతుల సమక్షంలో లలిత సంగీత విభావరి ఏర్పాటుచేశారు. అందులో తమిళ, కన్నడ, మళాయాళి గీతాలను ఆయా భాషాగాయకులు వినసొంపుగా గానంచేశారు. తెలుగు

---

**ముందు పేజి తరువాయి)** లక్షణకారులైన వాగ్గేయ కారులు–బయకారులు –రాయబయకారులు

1) 1423–1446 "రాయబయకార" చతురకల్లీనాథుడు ఇమ్మడి దేవరాయల ఆస్థాన విద్వాంసుడు, రాయబయకార (రాజవాగ్గేయకార) అనుపేరుతో రాజోద్యోగం యితనికాలం నుండియే ప్రారంభమైనట్లు కనబడుతోంది.

''కవిసార్వభౌముడు'' బిరుదుతో శ్రీనాథునికి కనకాభిషేకం జరిగిన సమయంలో గౌరవాస్పదంగా యీ"రాయ బయకారుడు" బిరుద ప్రబంధములు పాడి ఉండును. ఈ నాటి "కైవాడ" ప్రాచీన ప్రబంధములే –తంజావూరు నాయక రాజుల కాలంలో "కైవారములు" గాను, తంజావూరు మహా రాష్ట్రపాలకుల కాలంలో "శబ్దములు"– 'సలాములు'–'పరాకులు' అను పదములు కలిగిన రచనలుగా పరిణామం చెంది, అభివృద్ధి పొందేయి.

"బయకార" శబ్దమునకు ఇచ్చిన నిఘంటు అర్థములో ఇది (3) నకు సరిపోవును.

2) 1503–1530 శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన సంగీత విద్వాంసుడు –రాయబయకార –భండారు లక్ష్మీనారాయణ. ఇతడు జంత్ర (వీణ) గాత్ర, నాట్యకుశలుడు. రామామాత్యుడు చేసిన "అచ్చుత రాయమేళవీణ" లోని మేళ పద్ధతిని కొంత సంస్కరించి –కొత్త పద్ధతిని ప్రవేశపెట్టెను. నిఘంటు అర్థము (4) జంత్ర గాత్రము లందు ప్రవీణుడు – "బయకాడు/ ఉభయకారి" ఇతడు రాయలపై రచించిన ఒక 'యశోగీతి' మోహనరాగం– "సమరధనుంజయ" అను రచనకనబుడుచున్నది.

''కైవారము''లో యశోగీతి/స్తుతిగీతి ఒకరకము. 1 గాన విద్యోపాధ్యాయుడు– (ని.అర్థము) బయకారులొనర్చునట్టి ప్రావేశిక, మంగళధ్రువలు"

3) 1550– రామామాత్యుడు– రాయబయకారుడు. అరవీటి రామరాయల ఆస్థాన విద్వాంసుడు. అచ్యుత దేవరాయల ప్రోత్సాహంతో– అచ్యుత రాజేంద్రవీణ " రూపొందించేడు. ఏలలు, రాగకదంబముల, గద్యప్రబంధములు పంచతాళేశ్వరము, సర్వాంకము, శ్రీరంగ విలాసము మొదలై ప్రబంధ రచనలు చేసి, గానము చేస్తూ ఉండెడివాడు. నిఘంటు శబ్దము (1) స్వరాదులు ప్రకటించువాడు– వైణికుడు. గాత్ర– వైణికుడు గనుక రామామాత్యుడు "ఉభయకారుడు "– రాయబయకారుడు. ఇతడు ప్రకృతి–వికృతి స్వరముల పై పరిశోధనలు చేసి – 12 స్వరస్థానములను నిరూపించేడు. ప్రధానంగా– 20 మేళ కర్త రాగాలను పేర్కొని – అందులో మాయమాళవగౌళ రాగము విద్యార్థుల అభ్యాసమునకును– సంగీత రచనలకును సరళతరమైన రాగముగా నిరూపించినాడు.

ఈ కాలమునకు పురందరదాసు చాలా వృద్ధుడు. వీణలో "స్వయం భూధ్వనులు " UPPER PARTIALS =HORMONICS పలుకుట కనుగొన్నాడు. ఈ ప్రయోగం వల్లనే 'తంబురా' పూతంగా చేసుకుని గానము చేసే ఆచారం వ్యవహారంలోకి వచ్చినది.

పైని తెలిపిన వారందరును తమకాలంలోని సంగీతాన్ని, ప్రబంధరీతులను పరిశీలించి–ఆనాటి సంగీత పరిణామాన్ని లక్ష్య–లక్షణయుతంగా నిర్దేశించారు. వీరు లక్షణకారులైన వాగ్గేయకారులు–జంత్రగాత్ర ప్రవీణులైన –"బయకారులు"

పాటలను స్వరపరచి, సమర్పించే బాధ్యత, సంగీతనిర్దేశకుడినైన నాపై ఉంచారు మా కేంద్ర సంచాలకులు. 'ఎడబాసిపోకోయి' అనే దేవులపల్లివారి విరహగీతాన్ని మిశ్ర శివరంజని రాగంలోను, 'నునుమంచు సోనలో' అనే రజనిగారి ప్రణయగీతాన్ని మిశ్రతిలంగ్ రాగంలోనూ స్వరపరచాను.

ఈ రెండు పాటలూ శారదగారి చేతనే పాడించాను. ఆనాటి శ్రీమతి శారదగానం, శ్రోతలను సమ్మోహితులను చేసింది. తెలుగు పాటల తీపి ఎలాంటిదో అందరికీ రుచిచూపింది.

తెనాలిలో 1965 జనవరి 21న పుట్టిన శారద గారిది సంగీత కుటుంబం. ఆమె తాతగారు శిష్ట్లా సత్యనారాయణ రాజశేఖరంగారు గాంధేయవాది. విద్వద్వాగ్గేయకారులు. పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి అనుంగు శిష్యులు.

తొలుత గుంటూరు, కావలి పట్టణాలలో చదువుకొని, అనంతరం కొత్తగూడెం, బెజవాడలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారావిడ. సాగి వెంకటేశ్వరరావు, పెమ్మరాజు సూర్యారావు, అన్నవరపు రామస్వామిగారల వద్ద సంగీత విద్య అభ్యసించారు. చదువులోనే కాక, సంగీతంలో కూడా ఎం.ఎ చేశారు. 1991 లో కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం నుండి ఆమె రూపొందించిన 'గోదావరి కిన్నెర' సంగీత రూపకానికి జాతీయ బహుమతి లభించింది. ఇంకా 'కోకిలమ్మ పెళ్ళి', 'సమైక్య భారతి','చక్కని రాజమార్గము' మొదలైన రూపకాలకు మంచి పేరు తెచ్చుకున్నారావిడ. ఆమె నిర్వహణలో రూపుదిద్దుకున్న 'ప్రేమ యోగి మీరా' నాటికలో ఆమె పాడిన మీరా భజనలు నిజంగా రసగుళికలు.

రజనిగారు 'కొండమలహరి' రాగంలో అపూర్వంగా స్వరపరచిన 'మొల్లలేలె నాకు'.. అనే చెంచెత పాటను అంతే అపూర్వంగా పాడి, శ్రోతలకు మరపురాని అనుభూతినిచ్చారావిడ.

మద్రాసు మ్యూజిక్ అకాడెమీ లో 3 సార్లు ప్రథమ బహుమతులు అందుకుంది ఆమెగాన కౌశలం. భూటన్ రాజు సమక్షంలో గానం చేసి, ఆయన అభినందనలతో పాటు ఘన సత్కారాన్ని అందుకున్నారామె. అప్పటి భారత రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకటరామన్ గారి సముఖాన పాడి, వారి సమ్మానాన్నీ పొందారు.

శారద గారితో బెజవాడ ఆకాశవాణిలో పనిచేసినప్పుడు నేను ఎన్నో పాటలు ఆవిడతో పాడించాను, కలసి పాడాను. చక్కని చిరునవ్వుతో అందరితో ఎంతో సన్నిహితంగా మెలగేవారావిడ.

శాస్త్రీయ సంగీతం పాడితే ఎంత గమకయుక్తంగా ఉండేదో, లలితగీతం ఆలపిస్తే అంత లలితంగా ఉండేది ఆమె గానం.. ఇక స్వరకర్తగా ఆమెది ఒక అద్భుత ఒరవడి... బెజవాడ రేడియోలో ' ఉదయరేఖలు' కార్యక్రమ ఆరంభంలో వచ్చే వాద్యసంగీతం ఆమె కూర్చినదే..

ఇంత ప్రతిభ గల శారదగారు, తన 35 వ ఏటనే, 21-11-2001న, మూత్రపిండాల వ్యాధితో కన్ను మూయటం ఎవరూ ఊహించని సంఘటన. చివరిసారిగా అదే ఏడు జులై నెలలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి ఆరాధనా స్వర్ణోత్సవాలలో ఆమె కచేరీని నేను ఏర్పాటుచేయగా, యాదృచ్ఛికంగా అన్నీ తత్వార్థాలతో కూడుకున్న అంశాలనే ఆనాడు ఆమె ఎన్నుకున్నారు.

హైదరాబాదులో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, విషమస్థితిలో ఉన్న సమయంలో ఆమెను చూసేందుకు మా ఆకాశవాణి కళాకారులు కొందరు వెళ్లగా, ఆరోజు కారణాంతరాల వల్ల నేను వెళ్లలేకపోయాను.నన్నెంతో అభిమానించే ఆమె, 'సుధాకర్ గారు రాలేదేమని' అడిగినట్లు తరువాత తెలిసి, ఎంతో బాధపడ్డాను.

అయితే, ఆవిడ పార్థివ శరీరాన్ని గుంటూరు తీసుకువచ్చినపుడు వెళ్ళి చివరిసారి చూసినప్పుడు నాకనిపించింది..'దేహం ఎవరికైనా అశాశ్వతమే.. వారి యశస్సు మాత్రమే శాశ్వతం.. అయితే ఇంకా ఎన్నో మధుర గీతాలు ఆమె గళంలో జీవం పోసుకోవలసి ఉండగానే దేవుని నుండి ఆమెకు పిలుపు రావటం దురదృష్టకరం..'

అశ్రు నయనాలతో ఆ శారదకు నమస్కరించాను.



# కళ్యాణిరాగము - ఒక పరిశీలన

శ్రీమతి మల్లాప్రగడ అనసూయాదేవి, సెల్ : 9849116944

కళ్యాణి శుభ ప్రదమైన రాగము. మంగళకర మైనరాగము. ప్రసిద్ధరాగము. బహుప్రచారములో నున్న రాగము. రక్తిరాగము. సర్వ సర్వగమక వరిక రాగము, షడ్జము, చతుశృతి రిషభము, అంతరగాధారము, ప్రతిమధ్యమము, పంచమము, చతుశృతి ధైవతము, కాకలి నిషాదము అన్నితీవ్ర స్వరములు ఈ రాగమందు అత్యంత విశాలమయిన ఆలాపన భావ సౌందర్యము, రసానుభూతి కలిగించుటకు తోడ్పడుతాయి.

సంపూర్ణ రాగము, అన్నియుూ రాగఛాయయా స్వరములగుటచే రాగాలాపనకు ఎంతో అవకాశముగలదు. ఇది మేళకర్త రాగ విభజన పథకము నందు, 65వ మేళముగా పరిగణింపబడినది క.ట.ప యాది సంఖ్యలో ఇముద్చుటకు మేచ చేర్చబడి మేచ కళ్యాణిగా పేరు పొందినది.

ఇది రుద్ర చక్రములో 5వ మేళము. దీని శుద్ద మధ్యమ మేళము బాణ చక్రములోని 5వ మేళమగు 29 శంకరాభరణము. రిరి గగ మమ దద నిని, గగ మమ దద నిని, మమ దద నిని అను జంట స్వరప్రయోగములు, నిగరి, నిరిని. దనిరీని దమ, గనిదమగరి అను దాటు స్వరప్రయోగములు, రిరిరి, గగగ త్రిపుచ్ఛ గమకములు, గగదదనిని, దనిదగరిని, దమగరి. గమదనిరిని దమగరి విశేష ప్రయోగములు రాగమునకెంతో శోభచేకూరుస్తాయి.

ఇందు వర్ణములు, కృతులు, కీర్తనలు, జావళీలు. భజనలు, అన్ని రకాల రచనలు రచింపబడినవి.

ఇది అన్ని వేళల పాడురాగము. కాని, సాయం సమయము అనువైన సమయము..

ఇది శంకరాభరణము, ఖరహరప్రియ, తోడి, కళ్యాణి హరి కాంభోజి, నటభైరవి మున్నగు 6 మూర్చనాకారక మేళములలో ఒకటి. శంకరణాభరణము యొక్క రిషభమును షడ్జము చేసి శంకరాభరణ స్వరములే పాడిన, ఖరహర ప్రియవచ్చును.

ఆ విధముగానే గాంధారము షడ్జము చేసినతోడి, మధ్యమము షడ్జము చేసిన కళ్యాణి, పంచమము షడ్జము చేసిన హరికాంభోజి, ధైవతములు షడ్జము చేసిన నటభైరవి వచ్చును.

ఇటువంటి గ్రహభేధము కర్ణాటక సంగీతము యొక్క ప్రత్యేకత. గ్రహభేదము, అనేక రాగముల ఆవిష్కరణమునకు మూల కారణమైనది. ఇది అందరికి తెలిసిన విషయమే.

కమలజాదళ (గీతము) వనజాక్షి (ఆదితాళవర్ణము) వనజాక్ష (పల్లవి గోపాలఅయ్యర్ గారి అటతాళవర్ణము) లతో అభ్యాసగానములోనే విద్యార్థులకు కళ్యాణిరాగము పరిచమయ మవుతుంది. ఈ రాగమందు త్యాగయ్య గారి కీర్తనలు అనేకములు.

1. నిధిచాలసుఖమా (చాపు)

ప॥ నిధి చాలాసుఖమా! రామునిస
న్నిధి సేవసుఖమా! నిజముగ పల్కుమనసా॥ నిధి॥
అ॥ దధినవనీత క్షీరములురుచో ధాశ
రధి ధ్యానభజనసు-ధారసము రుచో ॥నిధి॥

చ॥ దమశమమనుగంగా-స్నానము సుఖమా,క
ర్దమదుర్విషయకూప-స్నానము సుఖమా,
మమతాబంధనయుత-నరస్తుతి, సుఖమా,
సుమతి త్యాగరాజ-నుతుని, కీర్తన సుఖమా ॥నిధి॥

ఒకప్పుడు శొంఠివెంకటరమణయ్య గారు తన శిష్యుడయిన త్యాగయ్యను పలువురి ముందుపాడమని ప్రోత్యహించారు.

అప్పుడు త్యాగయ్యగారు “దొరకునా” అను బిలహరి కృతిని ఆలాపన నెరవల్, కల్పన స్వరములతో పాడి అందరిని ముగ్ధులను చేశారు.

మరియొక దినమున వెంకటరమణయ్య తండ్రిగారు, తంజావూరు ఆస్థాన విద్వాంసుడూ అయిన శొంఠి వెంకట సుబ్బయ్య గారి ఎదుట పాడుటకు త్యాగయ్య గారు నియమింపబడిరి.

వెంటనే త్యాగయ్య గారు. ‘‘మరిమరినిన్నే’’ అను కాంభోజిరాగ కృతి మనోధర్మముతో అత్యద్భుతముగా పాడి వినిపించారట.

విద్వాంసులు త్యాగయ్యగారి పాటలో నిమగ్నులయిరాజ సభకు వెళ్ళుట మరచిపోయారట. మరుసటి దినము త్యాగయ్య పాట వింటూ సభకు రాలేక పోయామని విద్వాంసులు చెప్పగా,

శరభోజి మహారాజు త్యాగయ్య పాట వినవలయునని కోరిక తెలిపినారు.

విద్వాంసులు త్యాగయ్యతో మహారాజు పై కీర్తనలు రాసి పాడమని చెప్పి, ఆ విధముగా అనేక ధన, కనక, వస్తు వాహనములు పొందవచ్చునని చెప్పారు. రాజు గారి ముందు పాడుటకు ఇష్టపడిన త్యాగయ్య వారిని స్తుతించి ధనము, కానుకలు పొందుటకు ఇష్టపడలేదు.

ఆసమయములో రాజుగారు పంపిన కానుకలను తిరస్కరిస్తూ ' నిధి చాలా సుఖమా-రాముని సన్నిధి చాలా సుఖమా' అనుకృతిని ఆసువుగా ఆలపించినారట.

ఈ కృతి యందు త్యాగయ్యగారు తన మనస్సుని తన మనస్సుని ప్రశ్నించుచున్నాడు. నిధి నిక్షేపాలు సుఖమా శ్రీరాముని సన్నిధి యందు రాముని సేవించుట సుఖమా? చెప్పవేమనసా? పెరుగు, వెన్న, పాలు రుచికరమా లేక మధురమైన రామనామభజన రుచికరమా! బాహ్యేంద్రియ నిగ్రహము, మనశ్శాంతి అనెడి గంగా స్నానము సుఖమా!

సంసారలంపట మందున్న చెడ్డ విషయము అనెడి బురద నీటి స్నానము సుఖమా! అహంకార, మమకార బంధనకరమయిన నరులను స్తుతించుటయా, మృదుమధురమైన రామనామ కీర్తనమా! ఏది సుఖము! రాముని సన్నిధిసేవ, గంగాస్నానము, రామనామ సంకీర్తనము మాత్రమే సుఖమని వారి మనస్సు వారికి సమాధాన మిచ్చింది.

**2 నమ్మివచ్చిన...**

ప॥ నమ్మివచ్చిననన్ను-నయమునబ్రోచవే-నిను
అప॥ కొమ్మని వరముల నొసగే-గోపూరిసుందరేశ ॥నమ్మి॥
చ॥ వేద పురాణాగమశాస్త్రాదులగుమిగూడి
పాదముగనజాలక॥బ్రతిమాలియు వేడి
నాదస్వరూపశ్రీ।సౌందర్యనాయకీపతీ
వాదరహిత త్యాగరాజ వరద సుందరేశ్వర నిను ॥ నమ్మి॥

ఈ కృతి గోపూరి పంచరత్నములలో నొకటి. గోపూరు మద్రాసుకు 13 1/2 మైళ్ళ దూరములో నున్నది. కోవూరు సుందర మొదలియార్ ఆహ్వానము నంగీకరించి త్యాగయ్య గారు కోవూరు వెళ్ళి సుందరేశ్వర, సౌందర్యనాయికలపై 5 కృతులు రచించినారు. "నమ్మివచ్చిన" అను కళ్యాణ రాగ కృతి ఆ అయిదింటిలో నొకటి 1. నమ్మివచ్చిన-కళ్యాణి 2.కోరిసేవింప-ఖరహరప్రియ 3.శంభోమహాదేవ-పంతువరాళి 4.ఈ వసుధ-శహన 5.సుందరేశ్వరుని-శంకరాభరణము

"సుందరేశ్వరా!తీసికో అని పిలిచి వరములిచ్చే నిన్ను నమ్మివచ్చాను.నన్ను బ్రోవుము. వేదములు, శాస్త్రములు, ఆగమములు పురాణముల, అన్నియూ కలిసి వెదకి నీ పాదములను తెలిసికొనలేక అనేక విధముల ప్రార్థించినవి. నీవునాద స్వరూపుడవు, సౌందర్యనాయకీ నాధుడవు. వాదరహితుడవు, త్యాగరాజవరదుడవు, అటువంటి నిన్ను నమ్మి వచ్చిన నన్ను బ్రోవుము దేవా!

**3 సుందరి నీదివ్య...**

పల్లవి సుందరి నీదివ్యరూపమును జూడతనకు దొరికెనమ్మా॥
అ.ప మందగమన-నీదుకటాక్ష బలమో
ముందటి పుజా ఫలమో- త్రిపుర ॥ సుంద॥
చ॥ భువిలో వరమౌశ్రీమాదాది -పురమున నెలకొన్న నీ
సొగసువిని
సు వివేకులైన బ్రహ్మాది, సురలు గుంపుగూడి
కలివాసరపు సేవ కనుగొన, కలుగు నాయని
కరగుచుమదిలో
దివిత్తరము పడు చుండగా, దీనజనార్తిహరిణి॥సుంద॥
చ॥ కలిలో దీన రక్షకి యని సభ కలిగిన తావున
బొగడుదునమ్మా,
సలలిత గుణకరుణాసాగరి-నీ సాటి ఎవరమ్మ
అలసి వచ్చినందుకు నామనసు హాయి జెందునాయని
యుండగమరి
కలకలమని సురసతులు వరుసగా కొలువ శు
క్రవారపు ముద్దు త్రిపుర ॥సుంద॥ఉ
చ॥ ననుగన్నతల్లి నా జన్మము రాదు సఫలమాయనమ్మ,
ఇపుడు ఘనదరిద్రునికి పైకమువోలె - కనుల
పండువాయె
వనజనయన! ఎండుపైరులకు జలమువలె/శు
భదాయకి-కామ జనకుని సోదరి
శ్రీత్యాగరాజమనోహరి-గౌరిశ్రీత్రిపుర ॥సుంద॥

ఈకృతి తిరువత్తియూర్ పంచరత్నములలో నొకటి. త్యాగయ్య గారు తన శిష్యుడుయిన వీణకుప్పయ్యర్ ఆహ్వానించగా మద్రాసు దగ్గరలోనున్న తిరువత్తియూర్‌చేరి అక్కడనున్న త్రిపురసుందరి అమ్మవారిపై 5 కృతులు రచించిగానము చేసినారు.

1. కన్నతల్లి – సావేరిరాగము
2. సుందరినిను – అరభిరాగము
3. సుందరి నన్నిందరిలో – బేగడరాగము
4. సుందరి నీదివ్యరూపము – కళ్యాణరాగము
5. దరిని తెలిసికొంటి త్రిపుర సుందరిని – శుద్ద సావేరిరాగము

ఓ త్రిపురసుందరీ! నీదివ్య రూపము చూచే భాగ్యము నాకు గలిగినదమ్మా ! మెల్లని నడకలదానా ! నీదు దర్శనములభించుట నీకటాక్ష బలమో, నా పూర్వపుణ్యఫలమో అంటారు త్యాగయ్య గారు.

భూలోకమున శ్రేష్టమైన ఆదిపురమందు నెలకొనియున్న తల్లి యొక్క దివ్యరూప వైభవము విని బ్రహ్మాది దేవతలు శుక్రవారపు సేవా దర్శనమునకై ఆకాశమున, గుంపులు, గుంపులుగా చేరి, తత్తర పడుచుండగా, ఆ సేవా దర్శన భాగ్యము తనకు లభించినదని త్యాగయ్య పొంగిపోతున్నారు.

ఈ కలియుగమున దీనులను రక్షించు తల్లి త్రిపుర సుందరీయేయని పదిమంది కూర్చున్న సభలో చెబుతాడట.

మృదువైన గుణములు కలిగి, కరుణామూర్తి అయిన తల్లికి, దేవతాస్త్రీ లందరూ కలకలలాడుచూ సలుపు శుక్రవార పూజ దర్శించిన నాడేత్యాగయ్యగారి జన్మ ధన్యమయినదట. ఒక పేదవానికి ధనము దొరినట్లు, ఎండిన పైరులకు నీరు లభించినట్లు, అమ్మవారి దర్శనము త్యాగయ్య కెంతో హాయి చేకూర్చినదట.

**4. ఏతావునరా......**

ప॥ ఏతావునరా నిలకడనీకు– ఎంచి చూడనగపడవు॥

అప॥ సీతాగౌరీ వాగీశ్వరీ యను స్త్రీ రూపములందా ? గోవిందా! ॥ఏ॥

చ॥ భూకమలార్క నిలనభమందా? లోకకోటులందా?
శ్రీకరుడగు త్యాగరాజ కరార్చిత–శివమాధవ బ్రహ్మాదుల యందా ॥ఏ॥

ఇది భగవంతుడు సర్వాంతర్యామి అను విషయమును అందరికి తెలుపు కృతి. భగవంతుడు సర్వవ్యాపకుడు అను సత్యమును విష్ణు, వాసుదేవ, నారాయణ శబ్దములు తెలుపుతాయి. 'అంతఃప్రవిష్ట శ్శాస్తా జనానాం విశ్వాత్మ'. లోపల ప్రవేశించి జనులను శాసించు విశ్వాత్మ = అందరికి ఆత్మయైనవాడు.

(వేదము) 'యఏషోంతరాదిత్యే' =భగవానుడు సూర్యుని లోపల నుండును (ఉపనిషత్తు) ఈశ్వర సర్వభూతానాం హృద్దేశర్జున తిష్టతి=అర్జునా! రక్షణ స్వభావము గల భగవంతుడు అన్ని భూతముల యొక్క హృదయమందున్నాడు. (భగవద్గీత) ముగురమ్మలు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడా నారాయణుని సృష్టి లేనివారే. విష్ణువు అనునది 'మధ్యే విరించి గిరీశం ప్రథమావతారః' బ్రహ్మశివుల మధ్యలో ఏర్పడిన మొదటి అవతారమట. మరియు ఈకృతి యందు 'గోవిందా' అని సంబోధించినాడు. 'గో' అనే శబ్దమునకు చాలా అర్థములున్నవి. ఆవు, ఎద్దు, కన్ను, దిక్కు, దిశ, బాణము, భూమి, వాక్కు, నీరు, కిరణము, స్వర్గము, చంద్రుడు, వజ్రాయుధము మున్నగునవి, గోవిందా! అనగా గోవిందుడు వాటన్నిటిని పొందియున్నాడని అర్థము.

ఓ రామా! నీకు స్థానమెక్కడయ్యా? నిన్ను చూడాలి అని అనుకుంటే ఎక్కడ చూడాలి? స్త్రీమూర్తులయిన సీతా (లక్ష్మీ) పార్వతి, సర్వస్వతిల యందున్నావా? భూ (భూమి) కమల (నీరు) అర్క (సూర్యుడు) అనిల (వాయువు) నభము (ఆకాశము) అనబడే పంచభూతముల యందున్నావా?

చతుర్ధశ భువనములయందా? శివమాధవ (విష్ణువు) బ్రహ్మదులయందా! అంటే త్రిమూర్తులయందా? నీ స్థానముఎక్కడ? ఎక్కడని వెదకను?

భగవంతుడు స్వతంత్రుడని, సర్వవ్యాపకుడని, సర్వాంతర్యామియని, అంతటా నిండి యున్నాడని భావమును త్యాగయ్యగారు ఇందు వివరించినారు. ఇదే భావము "పరమపావన గుణశాలి" (పంతువరాళి) అనుకృతి అ.ప " అంతటనీవై యుండలేదా! అఖిలాండములను బ్రోవలేదా" అంటారు త్యాగయ్య. "అంతయు నీవే హరి పుండరీకాక్ష" అంటారు అన్నమయ్య. ఇందు గలడందులేడని సందేహమువలదు చక్రి సర్వోపగతుండు ఎందెందువెదకి చూచిన అందందేగలడు॥ అంటాడు ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్య కశిపునితో (సప్తమ స్కంధము పోతన భాగవతము) పరమభక్తుల భావములన్నియూ ఒకే విధముగా నుండును గదా!

**5 వాసుదేవయని...**

పల్లవి వాసుదేవయని వెడలిన యీ దౌవారికుని గనరే

అ.ప వాసవాది సురపూజితుడై –వారిజనయనుని మదిని దలచు ॥వాసు॥

చ1 నీరుకావి ధోవతులను గట్టి – నిటలమున శ్రీ

చూర్ణము బెట్టి
సారివెడలి యీ సభలో జుట్టి సారెకు బంగారు
కొలనుబట్టి ॥వా॥

చ2 మాటి మాటికిని మీసము దువ్వి– మన్మథ
రూపుడుతానని క్రొవ్వి
దాటి దాటి తాపడుచును నివ్విధంబున పలుకుచు
పకపకనవ్వి

చ3 బాగుమీర నటనము జేయుచును పతిత పావనుని
తావేడుచును
రాగతాళగతులను బాడుచును. త్యాగరాజ
సన్నుతుని పొగడుచును ॥వా॥

ఇది త్యాగయ్య గారి ప్రహ్లాదభక్త విజయము అను యక్షగానములోని దరువు. ఈ యక్షగానములో దౌవ్వారికుడు అంటే ద్వారపాలకుడు పాడుకుంటూ సభ లోకి ప్రవేశించు, పాత్ర ప్రవేశ దరువుగా త్యాగయ్య గారు సమకూర్చారు.

ఇది కూచిపూడి భాగవతులు ప్రదర్శించిన యక్షగానమువంటి ప్రబంధము. ఆపద్ధతినే త్యాగయ్య తన ప్రహ్లాద భక్త విజయములో ప్రవేశపెట్టారు.

ఆద్వారపాలకుడు నీర్కావిధోవతికట్టి, నుదుట త్రిచూర్ణముపెట్టి, చేత బంగారు బెత్తము పట్టుకుని,
హరినిమదిలో తలచుకుంటూ, ఇంద్రాదిదేవ తలుచుచూ వుండగా సభలోనికి ప్రవేశిస్తున్నాడు.

ఆ ద్వార పాలకుడు తానుమన్మథునివంటి అందగాడనని గర్వపడుతూ మీసములు దువ్వుచూ, పకపకనవ్వుచూ, రాగ, తాళ గతులను పాడుచూ, శ్రీహరిని వేడుచూ, దేవుని ఉత్సవము చూచుటకు సభలోనికి ప్రవేశించుచున్నాడు.

ఇది త్యాగయ్య గారు ద్వారపాలకుని నోట పలికించిన దరువు దౌవారికుడే హెచ్చరిక చెప్పుకొనుట ఒక ప్రత్యేకత.

ఇది గాక త్యాగయ్య గారి కళ్యాణ రాగ కృతులు కొన్ని చూద్దాము:

1. ఈశపాహిమాం జగదీశ పాహిమాం॥
ఈకృతి భూకైలాసక్షేత్ర నివాసి అయిన శివుని స్తోత్రము ఈశ్వరా! నన్ను రక్షించు. సత్పురుషులు, సప్త ఋషులు సేవించుచున్నట్లు భావన.

2. "ఏవరమడుగుదురా" ఈకృతి యందు అయ్యగారి పరితాపము ప్రకటితమయినది. రామా నీపాదము అర్పించు సుఖము హనుమంతుని పాలయినది.

నీ చూపులలోని సౌఖ్యము శతృఘ్నుని పాలయినది. నీ పాదరేఖలను చూచుటలోనున్న ప్రేమరసము భరతుని పాలయినది.

నీ మనస్సు నెరిగి ఆకలిని, నిద్దురను తీర్చు భాగ్యము లక్ష్మణుని పాలయినది. నిన్ను హృదయములో నిలుపుకుని అద్వైత సుఖమును అనుభవించుట సీతమ్మ పాలయినది.

ఇంక నేనేమికోరను? త్యాగయ్య గారు "రాజపథమును" కోరినారు. చక్కని రాజ మార్గమయిన భక్తి అని అయ్యగారి భావన.

3. **"ఎందుకో నీమనసు కరుగదు ఏమినేరమో తెలియదు"** నానేరమేమి రామా ఎందుకు నీమనసు కరుగదు. అంతారామమయమని భావించితిని గదా!

4. **"కమలభవుడు వెడలి కనుగొనరే"** సముద్ర మధ్యమున ప్రహ్లాదుడు ధ్యానములో నుండి రామసాక్షాత్కారము పొందనున్నాడని తెలిసి, బ్రహ్మ, వానితో పాటు సమస్త దేవతలు, ఆ రమణీయ దృశ్యమును తిలకించుటకు సముద్ర మధ్యమునకు చేరినారు.

5. **"నిన్నువలసినదేమి? రామానన్ననవలెగాక"** తనలో లేని అకృత్యములను తనయందారోపించుకుని త్యాగయ్య గారు, నిన్నినవలసినిదేమీలేదు రామా నీవు అనుగ్రహింపకుండుటకు నా పాపమే కారణము (ఆవేదన).

6. **"భజనసేయవే మనసా– పరమభక్తి శ్రీరాముని"** ఈ మానవశరీరరము దుర్లభము. ఈ శరీరముతో నాదానందము, ఓంకారానందము, చతుష్షష్టి కళల ఆనందము పొందవచ్చును.

వాదతర్కములతో ప్రొద్దు గడపకుండా భజన చేయమని త్యాగయ్య తనకు తానే హెచ్చరించు కొనుచున్నాడు. (మానసబోధ)

7. **"రామానీవాదుకొందువో, కొనవోతొలిమానోముఫల మెట్లున్నదో"**రామా, నేను సంసార సాగరములో మునిగియున్నాను.

నీవు చెయ్యి ఇచ్చి ఆదుకొందువా? ఆదుకొనవా? నా తప్పు లెంచక నాయందు దయవుంచి ఆదుకొనుము అని త్యాగయ్య మొరబెట్టుకుంటున్నారు.

8. **"రామరామరామనాపై నీదయరాక యుండవచ్చునా"** ఇందు త్యాగయ్య గారు తనకు రాముడు తప్ప వేరే గతి లేదంటాడు. కొడుకు ఎట్టివాడయిననూ తల్లిపోషింపకుండునా! కనుకరామానీవేగతి

9. **"వచ్చును హరినినుజూడ"** ఇది ప్రహ్లాద భక్తి విజయము అను యక్షగానములోనిది. వారిధి మధ్యలో భగద్దర్శనము కొరకు తహతహలాడుచున్న ప్రహ్లాదునితో సముద్రుడు అనుచున్న మాటలివి. ॥ ప్రహ్లాదా నిన్ను చూచుటకు హరివస్తాడు. నిన్ను మెచ్చుకుంటాడు. నామస్మరణచేస్తూ ఉండు. రామ నామపారాయణకు ప్రాధాన్యత తెలిపిన కృతి

10. **"శివేపాహిమాం"** ఓ పార్వతీ, ఓ కాత్యాయిని, ఓ ధర్మ సంవర్ధనీ రక్షింపుము. నీ ప్రభావమును వర్ణించుట సరస్వతీ దేవికే కష్టము. ఇక నేనెంత ? ఓ చంద్రకళాధరి, ఓ విష్ణుమాయా విలాసిని, ఓ వేద వినుతురాలా, ఓచరాచరస్వరూపురాలా, కరమున చిలుకను ధరించిన తల్లి, నన్ను పరాకుగా చూడకమ్మా.

11. **"అమ్మరావమ్మ తులసమ్మ"** ఎప్పుడూ నీపదములే నమ్ము కున్నమమ్ము పాలింప రావమ్మ నీమెత్తని శరీరము, చక్కని పరిమళము చూచి శ్రీ నాధుడు శిరమున ధరించినాడుగదమ్మా.

త్యాగయ్య గారు తులసీ మాతమీద 5 కృతులు రచించి నారు (అమ్మ రావమ్మ-కళ్యాణి) దేవితులసమ్మ (మాయామాళవగౌళ) తులసీదళములచే (మాయామాళవగౌళ) తులసి జగజ్జనని (సావేరి) తులసమ్మ మాఇంట (దేవగాంధారి)

2. ముత్తు స్వామిదీక్షితార్ 1. కమలాంబాం (ఆది) నవావర్ణకృతులలో ఒకటి " నిత్య కళ్యాణ కాత్యాయని " (రాగముద్ర)

2. భజరే రేచిత్త బాలాంబికా (చాపు)

3. శ్యామశాస్త్రి 1. తల్లినిన్ను నెరనమ్మి (త్రిశ్రలఘువు)
2. కంచి కామాక్షి నన్ను బ్రోవవే తల్లి (రూపకము)
3.హిమాద్రి సుతే పాహిమాం (సంస్కృతము రూపకము)
4.బిరానవరాలిచ్చి (తెలుగు -రూపకము)

4. సుబ్బరాయశాస్త్రి - నిన్ను వినాగతి- ఆది

5. పల్లవి గోపాలయ్యర్ - నీదుచరణ పంకజములేగతి (ఆది)

6. స్వాతితిరునాళ్ 1. పాహిమాం శ్రీ వాగీశ్వరి (దేవీనవరాత్రికీర్తన) (6 సరస్వతీ దేవికి 3 పార్వతీదేవికి అంకితం)

7. పట్నం సుబ్రహ్మణ్యఅయ్యర్ : 1. నిజదాసవరద (ఆది)

8. తలగంబాడి పంచనదయ్య : 1. బిరానబ్రోవయిది.

9. తిరువత్తియూర్ త్యాగయ్యర్ : 1. సరస్వతినన్నెపుడు

10. చెంగల్వరాయశాస్త్రి : 1. దేవిమీనాక్షి ముదం

11. శింగరాచార్యులు : 1. దేవిమీనాక్షముదం

12. ఘనం కృష్ణయ్యర్ : 1. సారెగుం-ఆది (పదము)

13. సుబ్బరాయయ్యర్ : 1. తైయల్ ఉన్నా (రూపకము) (పదము)
2. ఎత్తైకండు (రూపకము) (పదము)
3.తత్తైమొగియాళ్ (ఆది) (పదము)

14. పట్టాభిరామయ్య : 1. ఎంతటికులుకే (రూపకము) (పదము)

15. ఆండాళ్ళు తిరుప్పావై : అంబరముతన్నీరై (పాసురము)

**కళ్యాణిలో పల్లవులు:**

1 భజరేరఘువీరం మానస (కళ్యాణి-ఆది)

2 తిరిగిచూడరాదటవే-ఓలలనామణి (కళ్యాణి-రూపకము)

3 కరిమొర వినలేదా కరివరదా... (ఆదితాళమ)

కళ్యాణిలో ప్రఖ్యాత విద్వాంసుల రికార్డ్సు వినితీరాలి, ఆనందించాలి, నేర్చుకోవాలి.

1. ఎం.ఎస్ సుబ్బలక్ష్మి : నిధి చాలసుఖమా రామునిసన్నిధి

2. టీ.ఎన్ కృష్ణ (వైలన్) : నిధి చాలసుఖమా

3. మహారాజపురం సంతానమ్ : యునైయల్లల్.సాహిత్యము పాపనాసమ్ శివన్

4.శ్రీ బాలమురళీకృష్ణ
1. గతినీవే ఈజగతిని గతినీవే
2. సొగసునీ సొమ్ము కళ్యాణి, రాగిణి
3. సుందరి నీదివ్య రూపము
4. పిబరేరామరసం (సదాశివబ్రహ్మేంద్ర)
5. సఖిహే, కేసిమదన ముదారం (యమన్) (జయదేవుడు)

5 మహావిద్వాన్ జీఎన్‌బీ బాలసుబ్రహ్మణ్యం
1. రాగం, తానం, పల్లవి, రాగము కళ్యాణి
2. ఏ వరమడుగుదురా
3. శివకామేశ్వరి చింతయే
4. రాధా సమేతాకృష్ణా (యమునాకళ్యాణి)

6 ఎండీ రామనాధమ్
1. వనజాక్ష (అటతాళవర్ణము) పల్లవిగోపాల అయ్యర్
2. కమలాంబ
3. ఏతావునరా
4. భజరేచిత్త
5. నినువినా..
6. నాద ప్రణవసప్తస్వర...

7. శ్రీ నూకల చిన్న సత్యనారాయణ : పాఠము బోధించు డీవీడీలలో ఆలాపన కృతి, స్వరకల్పన చాలా వివరంగా బోధించారు. (దివ్యనామము) హరిదాసులు వెడలె (యమునాకళ్యాణి)

8. శ్రీ జేసుదాసు

1. ఏతావునరా

2. శ్రీనారదనాద

9. యు మాండలిన్ శ్రీనివాస్-1.ఏతావునరా

10. ఎన్ రమణి-1. పంకజలోచన, స్వాతితిరునాళ్

11. టీఆర్ మహలింగం

1. రాగమ్, తానమ్, పల్లవి- కళ్యాణి

12. ప్రిన్స్ రామవర్మ

1. ఆజ్‌జానేకీజిద్‌నాకరో (యమన్) గజల్

హిందూస్థానీ రాగమయిన యమన్ కళ్యాణికి దగ్గరగా ఉంటుంది. కాని కళ్యాణిలో అన్ని రాగఛ్ఛాయ స్వరములు, బాగా గమకముతో పాడవలయును. యమున్‌లో గమకము తక్కువ (ప్లెయిన్ నోట్స్)

**జన్యరాగాలు**

1. సారంగ 2. యమునా కళ్యాణి 3.హమీర్ కళ్యాణి

**సారంగ**

1. నీవాడనేగాన నిఖిలలోక నిదాన (ఝంపె-త్యాగయ్య)
2. కరుణచూడవయ్య (శ్రీరంగపంచరత్నము) (ఆది-త్యాగయ్య)
3. మామవరఘురామం ( ఆది. త్యాగయ్య)
4. ఏహిత్రీ జగదీశ ( ఆది. త్యాగయ్య)
5. ఏమితోవ- నౌకచరిత్రము ( ఆది. త్యాగయ్య)
6. ఓడనుజరిపే -నౌకాచరిత్రము ( ఆది. త్యాగయ్య)
7. ఎంత భాగ్యము ( ఆది. త్యాగయ్య)
8. అరుణాచల (పంచలింగస్థలకృతి) రూపకము (దీక్షితార్)
9. ఆ సమయమున (ఆది. పట్నం సుబ్రమణ్యాఅయ్యర్)
10. రామానిన్నె (ఝంపె- రామ్నాడ్ శ్రీనివాస అయ్యంగార్)
11. ఇటువంటి సమయము (ఝంపె- తిరువత్తి యూర్ త్యాగయ్యర్)
12. పాలయ రఘునాయక (చాపు-స్వాతి తిరుణాళ్)
13. దర్శిత్తాళరే (అది.ముత్తు తాండవర్)
14. ఎక్కడి నేస్తము (త్రిపుట-క్షేత్రజ్ఞ పదము)
15. స్మరసమరోచిత (చాపు-జయదేవ అష్టపది)

**యమునాకళ్యాణి**

1 నారాయణహరి - త్యాగయ్య

2 రామరామ "

3 సాగరుండు "

4 హరిదాసులు "

5 విధి శక్రాదులకు - త్యాగయ్య - హమీర్ కళ్యాణి

1. నీదాసానుదాసుడను (త్యాగయ్య)
2. మానము లేదా ( త్యాగయ్య)
3. వెంకట శైలవిహారా (సుబ్బరాయశాస్త్రి)

ఇక ఈ కళ్యాణి రాగములో అనేక వేల పాటలు, దక్షిణాది భాషలలోనూ, హిందీభాషలో నూ సినీ సంగీతములోనూ స్వర రచన చేయబడ్డాయి.

త్యాగయ్య సినిమాలో త్యాగరాయకృతులు, భక్త జయదేవసినిమాలో అష్టపదులు, రామదాసు సినిమాలో రామదాసు కీర్తనలు, అన్నమయ్య సినిమాలో అన్నమాచార్య కీర్తనలు, క్షేత్రయ్య సినిమాలో పదాలు బాగా ప్రజాదరణ పొందాయి.

అవిగాక సందర్భాను సారముగా కొన్ని కర్ణాటక సంగీత రచనలు సినిమాలో ప్రదర్శించుట జరిగినది. " చందన చర్చిత ", "నీదయరాదా" సుశీల పాడగా విన్నాము- " ప్రక్కల నిలబడి", ఏ తావునరా'', సావిరహే తవదీనా'' భానుమతి గళంలో ఆనందించాము.

''సామజవరగమన'', ''బ్రోచేవారెవరురా, '' మానససంచరరే " శంకరాభరణం సినిమా నుంచి వాణిజయరాం, బాలసుబ్రహ్మణ్యం పాడగా ఆనందించాము. సప్తపది నించి "మరుగేలరా ఓ రాఘవా విని ఆనందించాము.

పాతకాలపు గేయరచయితలు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, సముద్రాల రాఘవాచారిగారు, పింగళి, ఆరుద్ర, శ్రీశ్రీ, నారాయణరెడ్డి, ఆత్రేయ, వేటూరి చక్కటి సాహిత్యము అందించగా.

సాలూరి రాజేశ్వరావు, ఘంటశాల, సుసర్ల దక్షిణామూర్తి, కెవీ మహదేవన్, విశ్వనాధన్‌మూర్తి, ఆదినారాయణ, పెండాల్య, కోదండపాణి, చలపతిరావు,. రాజన్‌నాగేంద్ర మున్నగువారు చక్కని బాణీలు స్వరపరచగా, సుశీల, లీల, జిక్కి, ఘంటశాల, శ్రీనివాస్ అతిమధురంగా గానం చేయగా ఆనందించాము. 30,40 సంవత్సరములు 1980 వరకూ సుమారుగా చక్కటి తియ్యని

# సుందరేశ్వరవిలాసము - యక్షగానప్రబంధం
## (చెయ్యూరు చెంగల్వరాయశాస్త్రి)

గత సంచిక తరువాయి)

మీనాక్షీదేవి తలుచుకుంటేరాదు. ఒకవేళ తల్చుకుంటే కలిగిన ఆ విరహాన్ని తాళలేను ఎదురుగా ఉంటే సిగ్గు నోరెత్తనీదని అనుకుంటుంది. అది స్త్రీల సహజవైఖరి. పైకిమాత్రం చుర్రుబుర్రులాడతారు. కట్టుకున్నవాడంటే వల్లమాలిన ప్రేమ. ఆ విషయాన్ని మీనాక్షి మరోమారు మాటల్లో నిరూపిస్తుంది. దర్బారురాగంలోని ఈ కీర్తనలో ఎత్తిపాడుపులతో దేవుని దూరుతుంది.

"పల్లవి – ఔర నీమాయలన్నిటి గంటిర
కోరివచ్చిన సారసాక్షుల నిరసించుట మేరగాదుర ॥
అ.ప – మాయలాడికి న్యాయమేటికి
తోయజానన నీయుపాయము నాయెడ బనిసేయునటనె ॥
చరణాలు 1. పనికిరాని యిట్టి బ్రతుకేలగంటి – కనతగదు వినతగదు నీ కథ మునులు గనుగొనవలెను కదరా ॥
2. చూడజాలక నాడెద వేటికి – తోడివారలజాడ గానవు. చేడె నీకిది పాడిగాదే ॥
3. పాడిగాననివాడవు నీవని – ప్రౌఢలందరు నాడుకొందురు నేడుగా దలవాడె వినరా ॥
4. మోసగించి, దోసమెంచ – జేసెరోసి గాసువేసి గాసిదీని బోసుకొంటిగా ॥ "పుట – 27

చివరికి నా మనవి ఆలకించి నన్ను చేకొనమని ప్రాధేయపడుతూనే ఎకసెక్కాలడుతుంది. ఐనా అలుకలుదీరి ఇద్దరు ఒకటౌతారు. తర్వాత రజతాచలంనుండి మధురాపురానికి వస్తారు.

మీనాక్షీదేవితో మధురానగరానికి వచ్చిన సుందరేశ్వరుడు అనేక కార్యాలు చేశాడు. వాటినీ విధంగా సూత్రధారి ముఖంగా చెంగల్వరాయశాస్త్రి వర్ణించాడు.

కుండోదరుడనే భూతానికి అన్నకుండం ఇచ్చాడు.

వృత్రాసురవధచేసిన ఇంద్రుని బ్రహ్మహత్యాపాతకాన్ని

---

**ముందు పేజి తరువాయి)** పాలలాగ మాధుర్యము ఉట్టి పడుతూ, శుద్ధమయిన రాగాలలో ఆనందించాము.

తర్వాత కొంచెం పాలల్లో నీళ్ళు కలిసి పల్చబడ్డాయి. ప్రజాదరణ కోసం తాపత్రయం పడడంతో రాగాలలో కొంచెం అన్యరాగచ్ఛాయలు కలిపి స్వరరచన చేయుట మొదలయినది.

**కళ్యాణిరాగంలో సినిమా పాటలు**

(తెలుగు) (సరదాగా పాడుకోవడానికి)

ఘంటశాల : కుడిఎడమైతే /మదిశారదాదేవి మందిరమే/ చల్లని వెన్నెలలో/ రావే నాచెలియా/ పలుకరాదటెచిలకా/ పూచే పూలలోన / తలనిండపూదండదాల్చిన రాణి/ పయనించే ఓచిలుకా/ జగమే మారినది.

భానుమతి : మనసునమల్లెమాలూగెనే/ సావిరహేతవదీనా.

సుశీల : తోటలోనారాజు/ శ్రీరామనామాలుశతకోటి/ వినిపించని రాగాలే/ జోరుమీదున్నావుతుమ్మెదా/ లలితకళారాధనలో/ మనసాతుళ్ళిపడకే/ మధురభావాల సుమమాల.

బాలమురళీకృష్ణ : సలలితరాగ సుధారససారం

బాలసుబ్రమణ్యం : దొరకునా ఇటువంటిసేవా, ఏదో ఒకరాగము, గాలిచిరుగాలి (చిత్ర) రారమ్మని (కౌసల్య) నమ్మినామది మంత్రాలయము (రాఘవేంద్ర సినిమా) (వేటూరి సాహిత్యము)

జయ జయ ప్రియభారత జనయిత్రి దివ్యధాత్రి (జాతీయగీతము)

**తమిళము:** "జననీజననీ" సినిమా తాయిమూకాంబికాయై) / అమ్ముఎంద్రుమనమ్/, "కళవానియే" (సినిమా సింధుభైరవి) గాయకుడు ఏసుదాసు సంగీతం ఇళయరాజా/
"మన్నివన్‌వందనాడి " గానం సుశీల, సంగీతం కేవీ మహదేవన్
"కత్రిల్ ఒరుమ్‌గీతమ్" సినిమా కటీసన్, సంగీతము ఇళయరాజా

**హిందీ:** సారంగా తేరీయాద్‌మే (ముఖేష్)
దేఖ్‌హమేఆవాజ్‌నదేనా (ఆశాభోంశ్లే–రఫి)
"రసిక బలుమా" (లతామంగేష్కర్)
"చందన్‌క బదన్" (ముఖేష్)
జబ్‌దీప్ జలే ఆనా " (జేసుదాసు)
బీత్‌నాబితాయే (భూపేంద్ర)

ఇంకా ఎన్నో ఎన్నెన్నో గీతములు స్వరరచన చేయబడినవి. అన్నింటికి శాస్త్రియ సంగీతమే ఆధారము.

సౌత్ మీట్స్ నార్త్ : కర్ణాటక ఎండ్ హిందుస్థాన్ క్లాసిక్
డాక్టర్ ఎన్ రమణి (ఫ్లూట్ ) కళ్యాణి
డాక్టర్ హరిప్రసాద్ స్వామి (ఫ్లూట్) వైలెన్
డాక్టర్ బాలమురళీకృష్ణ (వోకల్) (కళ్యాణి)
డాక్టర్ భీమేశ్వర్‌జోషి (వోకల్) యమన్
జుగల్ బందీ వినాలి, ఆనందించాలి నేర్చుకోవాలి.

పోగొట్టాడు. చోళధాత్రీసురునికి అనుకూలంగా శ్రమణులు పంపిన మత్తగజం కోపంతో చంపడానికి వస్తే శరణుజొచ్చిన పాండ్యరాజుకు దంతిని కొట్టాడు.

పాండ్యుడు చేసే తొంభైయారు ఆధ్వరాలను ఇంద్రుడు తెలుసుకొని విఘాతం కలిగించడానికి జలధిని పట్టణం మీదకు పంపిస్తే అదిచూసి శివుడు శక్తితో సంద్రాన్ని ఇంకింపజేశాడు.

అలాగే చోళరాజు పాండ్యునిమీదకు కృత్రిమపశువులను పంపితే నందీశ్వరుని పంపి మృషాపశువును చంపించాడు. వీరపాండ్యుడు కరువును అరికట్టాలని శివుని వేడితే మేరు పర్వతంలో ద్రవ్యం ఉంది. అదంతా గ్రహించమని ఆ కొండను చెండుతో కొట్టి స్వవశం చేశాడు.

మాణిక్యవాసుని కోరిక తెలిసి శత్రువైన పాండ్యునకు చూపించిన గుఱ్ఱాలను పులులను చేశాడు. పాండ్యునిమీద కోపించి చోళభూపతి పోరాడుతున్నప్పుడు యుద్ధంలో దప్పికగొన్నట్టి సైనికులను చలిపందిరి పెట్టాడు.

దూర్వాసమహర్షి శాపానికి గురై వనగజమైన ఇంద్రుని ఐరావతం భక్తితో కొలిచినందుకు దాన్ని రక్షించాడు. గురు శాపంవల్ల పన్నిద్దరురాకుమారులు వరాహతనులై తల్లిలేనివారై మొరపెట్టుకోగా వారికి కరుణతో చన్నిచ్చి రక్షించాడు.

పాండ్యశేఖరుని కాంలో బ్రహ్మ అనుమతితో భారత నలభై అవరతారాలను ధరించిందని తెలుసుకొని వారితో కలిసి పీఠికనిచ్చాడు.

పతిశాపవశాన పార్వతి జాలరి యింట పుట్టినందుకు ఆమెని వివాహం చేసుకోవడానికి ఈశ్వరుడు వలవేశాడు.

అరిమర్దనుడైన పాండ్యమహీపాలుడు నిరంతరం మాణిక్యవాసుసరసవిలాసుని కొనియాడగా పులులను గుఱ్ఱాలుగా చేశాడు.

కులభూషణపాండ్యుడు భూపాలకుడై ఏలుతూ దారువన తాపసభార్యలగుట్టు చెరిపే నెపంతో విక్రముడయ్యాడు.

గౌతమముని కాంచనమాలకు చెప్పిన వ్రతం కోసం తను వేడి మీనాక్షికి సముద్రాలక్రమాన్ని చూపించాడు.

నలభైఎనిమిదిమంది విద్వాంసులు ఒకరికొకరు కలహించుకుంటూంటే వారికోర్కె తెలిసి తనదివ్యదర్శనమిచ్చి మెచ్చి వాదాన్ని అణచాడు. వసుధవనధితీరవాసుడైన వైశ్యుని తనయ కోర్కెలిచ్చి మంగళప్రదుడు లింగశమీకూపాలీల అవతరించాడు. సర్వేశ్వరుని కథలు వింటే వెయ్యేళ్ళదుర్భరమైనటువంటి దొడ్డచరిత్ర అణగిపోతుంది. వారు సామాన్యమానవసమానులే. కోరిన కోర్కెలెల్ల చేకూరుతాయి. అటువంటి శివకథాసారనాటకం ఇది. శ్రీతుడన్దార్వైద్యనాథప్రభువు సమ్మతితతో చెంగల్వరాయశాస్త్రి ఈ సుందరేశ్వర విలాసయక్షగానాన్ని రచించినట్లు ఇది ఆచంద్రతారార్కం ఉండాలని చివర చెప్పుకున్నాడు కవి.

చివరిగా సురటిరాగంలో మీనాక్షీ సుందరేశ్వరులకు మంగళం పాడతారు. అంతటితో ఈసంగీతయక్షగానాటకం ముగుస్తుంది.

**పాత్రచిత్రణ** : ఈ యక్షగానప్రబంధంలో మీనాక్షీదేవి, శివుడు, సూత్రధారుడు ఈ మూడే ప్రధానపాత్రలు. సఖిపాత్ర అంతప్రధానం కాదు.

**మలయధ్వజుడు** : మధురై నగరాన్నేలే రాజు ప్రజారంజకంగా రాజ్యపాలన చేశాడు. సంతానలేమికి పుత్రకామేష్టియాగాన్ని చేసి మూడేళ్ల ఆడశిశువును పొందుతాడు. ఆమెకు మూడుస్తనాలుండటం వల్ల మొదట భయపడినా ఆకాశవాణి ఈమెను వివాహ మాడేవాడు. తటస్థపడితే మూడవ స్తనం పోతోందని చెప్పినమాట విని ఆమెకు జాతకకర్మలు చేయించి విద్యాబుద్ధులు నేర్పుతూ పెంచుతాడు. కొంతకాలానికి అతడు స్వర్గస్థుడౌతాడు. తర్వాత మధురైనగరాన్ని అతని కూతురు మీనాక్షి పాలిస్తుంది. ఇంతటితో మలయధ్వజుని పాత్రముగుస్తుంది. ఇతని గురించి ఆరంభంలో మాత్రమే ఉంటుంది.

**సుమతి** : మలయధ్వజునికాలంనుండి ఉంటూ చేదోడువాదోడుగా ఉంటూ పేరుకు తగినట్లు వ్యవహరించే మంత్రి. రాజు మరణించిన పిదప అతని కూతురు మీనాక్షీదేవికి కూడా తన సహాయసహకారాలందిస్తూ ప్రవర్తించిన మంత్రి శ్రేష్ఠుడు. ఉచితానుచితాలనెరిగిన మంత్రి ఇతడు.

**మీనాక్షి** : మధురైనగరయువరాణి. ఈ యక్షగానంలో నాయిక. మూడుచన్నులతో మూడేళ్ళబాలికగా హెూమం నుండి పుట్టింది. వినయసౌశీల్యాలుగలదు. తండ్రి చనిపోయిన తర్వాత రాజ్యపాలనాబాధ్యతలు చేపట్టి తండ్రిబాటలో వైభవపేతంగా రాజ్యాన్ని పరిపాలిస్తుంది. దిగ్విజయయాత్రకువెళ్ళి అఖిలలోకాలు జయించి, కైలాసంలో శివునిజయించాలని వెడుతుంది. ఈశ్వరుడే ఆమె దగ్గరకు వస్తాడు. అతణ్ణి చూసినవెంటనే ఆమె మూడవ స్తనం మాయమౌతుంది. ఆకాశవాణి చెప్పిన విధంగా తనను వరించబోయే వానివల్ల స్తనం మాయమౌతుందన్న మాట స్ఫురణకు వచ్చి సిగ్గుపడుతుంది. ఈమె ధైర్యవంతురాలు కాబట్టే తనను వివాహమాడమని మధురైకి రమ్మని శివుణ్ణి ఆహ్వానిస్తుంది. పార్వతీదేవి రూపమైన మానవ స్త్రీ సహజస్వభావం కలదిగా ఈ యక్షగానంలో గోచరమౌతుంది.

కొన్నాళ్ళకు శివుడు తనభక్తులను చూడడానికి వెళ్ళి మధురైకి రాకపోవడం వల్ల ఆమె సూత్రధారునితో తన భర్తజాడ కనుక్కోమని అడుగుతుంది. ఆ మాటకు నీ భర్తపేరేమిటో చెప్పమంటే పురుషుంగన పేరు చెప్పడం పద్ధతి. స్త్రీ పురుషుని పేరు చెప్పడం న్యాయం కాదంటుంది. నా భర్తపేరు పల్కడం ఉచితంకాదంటుంది మీనాక్షి. ఇప్పుడు మీరడుగుతున్నారని చెప్తున్నాను వినరమ్మా సఖులార అని నర్మగర్భంగా చెప్తుంది. ఇది సీసపద్యంలో ఉంటుంది. చెంగల్వరాయశాస్త్రి చమత్కారంతో కవిత్వాన్ని చెప్పగల పండితుడు. ఈ సీసపద్యంలోఆ చమత్కారం ఇలాఉంటుంది.

"ఇభరాజగమన నా విభుని పేరడిగేవు
వినవమ్మ చెప్పెద విశదముగను

తరిత్రాడుగా సేయదగు పాము పేరేమి?-------వా సు కి
కదలిద్రచ్చిన గొప్ప కవ్వమెద్ది?------మం ద రం
పూలతేనియలను గ్రోలెడు పురువెద్ది?--------ద్వి రే ఫం
యరదంబునకు ముందు పరచునెద్ది?-----అ శ్వ ము
ఇలనిండ వెలుగందగల భూషణం బెద్ది?-------త రు ణి
విఘ్నేశ్వరుని చేత వెలయు నెద్ది?------కు డు ము

అన్నిటికిజూడ మూడేసియక్షరములు మధ్యవర్ణములందు నా మగని పేరు అంటూ నేర్పుతో భర్తపేరు చెప్తుంది. దీన్నే చిత్ర కవిత్వంగా పెద్దలు చెప్తారు. సకలకళల నెరిగిన దేవి మీనాక్షి అందువల్లనే తన భర్తపేరు చాలా మనోహరంగా చెప్పిది.

ఈశ్వరుడు కైలాసంలో ఉన్నాడని తెలిసి అప్పటివరకూ పుట్టింట్లో ఉన్న మీనాక్షి మెట్టినిల్లైన కైలాసానికొస్తుంది. ఈర్ష్య, కోపతాపాలను ఆమె సహజంగానే వ్యక్తం చేస్తుంది. ఈ మగవారిని నమ్మరాదనే మాట నాయెడ అనుభవమైంది. క్షణం కూడా ఎడబాయని విభునిగుణం ఇలా అయింది. పలువురిపాలైన పతికిలోనైన లలనలే సౌఖ్యాలు పొందుతారు? "ఒక్కరి సొమ్ముకై యొక్క ప్రొద్దున్న నక్కఅదీరునా యది తనదౌ" చెలిమి చేశానుగాని అతని మనసులోని కపటాన్ని చూడలేకపోయానంటుంది.

మీనాక్షీదేవి అన్న ప్రతిమాటా ముమ్మాటికీ నిజం. ఆశకు సిగ్గు తెలియదు. మోహావేశాన్ని పొందినవారెవరైనా వివేకాన్ని కోల్పోతారు. అదే స్థితిలో మీనాక్షీదేవి ఉండటం వల్ల మన్మథసైన్యాన్ని దూషిస్తుంది. చివరికి మనసుదిటవు చేసుకుని సుందరేశ్వరుణ్ణి మధురైకి వచ్చి ఏలుకోమంటుంది. మానవ సహజమైన భర్తమీద అనురాగం, ప్రేమ మొదలైన వాటిని ఈమె స్పష్టపరుస్తుంది. స్త్రీ ప్రధానపాత్రగా ఈ యక్షగానంలో కనిపిస్తుంది. పురుషుని పాత్ర గౌణంగా ఉంటుంది.

**శివుడు :** సర్వలోకాధిపతి. ఈ యక్షగానంలో మీనాక్షీదేవికి భర్త. దక్షిణనాయకునిగా కనిపిస్తాడు. జగత్తంతా ఈశ్వరమయం. ఆయనలీలలు అనితరసాధ్యం. పార్వతీదేవి కూడా శివుని లీలల్ని అర్థంచేసుకోలేకపోతుంది. చివరకు స్త్రీలోలునిగా భావిస్తుంది. వివాహమైన తర్వాత తనభక్తులను చూడాలని సుందరేశ్వరుడు బయటికివచ్చి ఎప్పటికీ మధురైకి రాకపోయేసరికి చెలికత్తెల చేత వెతికిస్తుంది మీనాక్షి. ఆయన కైలాసంలో ఉండేసరికి మీనాక్షి అక్కడికి వచ్చి మధురైకి రమ్మంటుంది. ఈ యక్షగానంలో శివపార్వతులను మానవమాత్రులుగానే ఊహించుకుని చూపించాడు.

రసపోషణ : ఈ యక్ష గానంలో విప్రలంభశృంగారం అంగిరసం. కరుణ, వీరరసాలు, పోషకాలుగా గోచరిస్తాయి. పార్వతీ పరమేశ్వరుల ప్రేమాయణాన్ని ఎంతో సున్నితంగా వర్ణించాడు. మీనాక్షీదేవి ముఖంగా ఆ శృంగారాన్ని వర్ణింపజేశాడు. నాయికా నాయకులు వివాహమైన పిదప కొంతకాలం సుఖాన్ననుభవించి తర్వాత భక్తులను చూడటానికి వెళ్ళిన శివుడు ఎప్పటికి రాకపోయేసరికి మీనాక్షి అతన్నివెదుక్కుంటూ వెడుతుంది. పరమేశ్వరుని కైలాసంలో చూసి, తిరిగి రమ్మని బ్రతిమాలుకుని మధురైకి తోడ్కొనివచ్చి అప్పుడు సుఖాన్ననుభవిస్తారు. ఈ మధ్యలో ఎడబాటు కలిగి తిరిగి కలుసుకుంటారు. అందువల్ల ఈ నాటకంలో విప్రలంభశృంగారం ప్రధానరసం. కరుణరసం హుశేని, శోకవరాళి, పున్నాగవరాళి మొదలైన రాగాల్లో మీనాక్షి విరహాన్ని ఆవేదనను వ్యక్తం చేసే సందర్భాల్లో స్పష్టపడుతుంది.

శృంగారానికి రతిస్థాయీభావం. ఋతువు, పుష్పమాలలు, మైపూతలు మొదలైనవి రసోద్దీపనం కలిగిస్తాయి. ఈశ్వరుడు కనిపించలేదని మీనాక్షి వనంలో తిరుగుతూ విరహాన్ని పెంచే మదనసేన మోహాన్ని కలిగిస్తాయి. రసోద్దీపనకు సహాయపడిన పరిస్థితులు ఇవి.

"చిలుకతేజినెక్కి – మొలచిగురుటాకు జెక్కి
తలపున కదుసొక్కి – నా దారి ద్రొక్కేవదేర
తుంటవిల్లుబూని – నా వంటి దానిపైని
కంటగించుటగాని బంటతనముగంటి తార"

అలాగే మలయమారుతాన్ని అంగహీనుడైన వాడికి రథమెలా అయ్యావని నిలదీస్తుంది. చందమామను, తుమ్మెదలను శు కపికాదులను నిందిస్తూంటుంది. ఇవన్నీ ఉద్దీపన కలుగజేసేవే. వీటన్నిటి వర్ణనలతో నిండిన ఈ యక్షగానంలో మొదట సంభోగశృంగారరసం ఉన్నా చివరికి విప్రలంభశృంగారరసం గమ్యమౌనమౌతుంది. తననాయకుని గుణగణాలు చెప్పే సందర్భంలో నాయకుడు శృంగారించే విధానాన్ని సీసపద్యంలో చెబుతుంది. అతి మనోహరంగాను, రమణీయంగాను ఉంటుంది.

"అలివేణి చేరరమ్మని – పెన్నెరులు దువ్వి
కులుకుగా విడిపూల – గొప్పమర్చు
చేడెరో మొగమెత్తి – జూడవేయని వేడి
నుదుటకస్తూరిబొట్టు కుదురుబరచు
అంగనామణి నీహొరంగు – జూతమటంచు
కుంకుమగంధంబు – పొంకబరచు
వగలాడినీ మేని సొగసు – జూతమటంచు
కళుకు బంగారు చెంగావిగట్టు
నప్పటప్పటికిని మోహముప్పతిల్ల
తనువు కైజేసి దయవార తనివి దీర
కనులపండువుగా జూచి కలసియున్న
వానికిప్పుడు నే కానిదాననైతి"

నాయిక నాయకుని అన్వేషణలో కొంతకాలంపోగా చివరికి కైలాసగిరిలో తన నాయకుడైన పరమేశ్వరుని కూడి మధురై నగరానికి వచ్చి భర్తతో సుఖాన్ననుభవిస్తుంది. మీనాక్షీదేవి.

**ఛందోప్రక్రియలు :** దరువు, సీసం, ద్విపదార్థం, ద్విపద, వాక్యాలు, గీతం, కందం.

"సరిసరి । తనకిది । సమయము ।

దొరికిన । తెరగున । ను-మన్మ।థుండొక।మూలన్
తరమెరు । గడాయె ।గా-నా
తరమా।-కాంతా।లలామ।-తాళగ।లేనే
ఓయమ్మ-తాళగలేనే
తాళలేనె ఓయమ్మ-తాళగజాలనీ
వేళను మదనుడు-బాళిమీర
విరిగోల వేయగను -తాళగలేనే" పుట-21

కందార్ధమంటే ముందునగం పద్యలక్షణాలతో తర్వాతిసగం దరువులా ఉంటుంది. కొన్నింటికి రాగతాళ నిర్దేశం ఉంది. కొన్ని యక్షగానాల్లో రాగతాళనిర్దేశం లేదు. ఇందులో కందం చతుర్మాత్రాగణాలతో నాలుగు పాదాలు ఇచ్చారు. తర్వాతి భాగం దరువుగా చెప్పుకోవాలి.

అలాగే ద్విపదార్ధం
"ఇందుకళాధరు-డింద్రవందితుడు।
సుందరాంగుడు-దాస సులభుడు నాదు।
పొందెడబాయక-బూవునుతావి ।
చందమైయున్నట్టి-సామినేడేమి।
సందియమందెనో-సవతులేమినిరొ।
ఎందుకుదాగెనో-ఏమిసేయుదును.
మా సుందరేశ్వరుని జూపరుగా-మా సుంద॥
చందన చంపక-తిందుక కరువక
కుందవకుళతరు-బృందములార-మాసుంద॥

ద్విపదర్థాంలో మొదటి పాదాల్లో ద్విపదలక్షణాలు, తర్వాతి భాగంలో దరువులక్షణాలుఉంటాయి. ఈ యక్షగానంలో వచనానికి బదులు ఎక్కువగా ద్విపదనుయోగించినట్లు కనబదు తుంది. కథా కథనం,విరహవర్ణన,మీనాక్షి, శివునివాక్యాలు, ద్విపదలో కనిపిస్తాయి.

**నాటకలక్షణాలు - యక్షగానప్రబంధం**

సుందరేశ్వరవిలాసం సంగీత నాటకం. ఇందులో మాటలు కొన్నిచోట్ల పాటలరూపంలో, కొన్నిచోట్ల పద్యాల రూపంలో, మరికొన్నిచోట్ల వచనరూపంలో ఉంటాయి. నాటకంలో ఉన్న రీతిలో నాంది, ప్రస్తావన, ప్రవేశ, విష్కంభ, అంకాలు మొదలైన విషయాలు లేవు. మీనాక్షీదేవి, సూత్రధారుడు, శివుడు అనేవి మూడే మూడు పాత్రలు. ఎక్కువపాత్రలు లేవు. సూత్రధారుడే ఎక్కువచోట్లా నాయికతో మాట్లాడతాడు. తర్వాత శివుడు, నాయకితో సంభాషిస్తాడు. పాత్రరంగప్రవేశం సంగీతపరంగా రాగతాళాలతో ప్రావేశికదరువుగా కనిపిస్తుంది. కొంతకథా కథనం ద్విపదల్లో సాగుతుంది. కాబట్టి ఇది యక్షగానలక్షణాలున్న సంగీతనాటకంగా చెప్పవచ్చు. దరువులు, వచనాలు, ఇతరపద్యాలు రాగతాళనిర్దేశంలో ఉండటం వల్ల దీన్ని సంగీతయక్షగానంగా కూడా పేర్కొనవచ్చు.


**సంగీతాంశాలు :** ఉపయుక్తరాగాలు-కందార్ధాలకు, ద్విపదార్దాలకు రాగతాళనిర్ధేశంచేశాడు.

మధ్యమావతి, పూర్ణచంద్రిక, యమునాకళ్యాణి, కళ్యాణి, కాంభోజి, భైరవి, మోహన, ఆనందభైరవి, శోకవరాళి, పున్నాగవరాళి, ముఖారి, కమాస్, దర్బారు, సౌరాష్ట్ర, గౌళిపంతు, జంఝూటి, బ్యాగ్, శంకరాభరణం, సురటి, శహా(హ)న, తోడిరాగాలు. వీటిలో అన్నిరాగాలు అత్యంతరక్తికట్టించేవే. సందర్భానికి తగినట్లుంటాయి.

తాళాలు-ఆది, రూపక, చాపుతాళాలు.

సూక్తులు-ఒక్కరిసొమ్ముకై యొక్క ప్రొద్దున్న నక్కఱ దీరునా, ఆస సిగ్గెరుగనియ్యదటన్న, బెదిరింపుబోయి తాబెదరినట్లు, తాటిమానెక్కనిచ్చి మందలకు వచ్చి క్రిందికి నిచ్చెనతీసిన చందమాయె.

**సమాప్తం**



# హిందుస్థానీసంగీతంలో తాన్‌పురా, తబలవాద్యాలు

హిందుస్థానీ సంగీతంలో అతిముఖ్యమైన వాద్యాలు తాన్‌పురా, తబలా. ఈ రెండూ సంగీత ప్రారంభం నుండి తోడుగా నేర్చుకునే దశమొదలు నుండి ఉండడం విశేషం.

ముందుగా తాన్‌పురా: తంబురా అని మనం పిలుచుకునే అతిప్రధానమైన శృతివాద్యాన్ని తాన్‌పురా అని హిందుస్థానీ సంగీతంలో పిలుస్తారు. దీనిని తంత్రీ వాద్యాలలో అత్యంత ముఖ్యమైన వాద్యంగా చెప్పుకోవాలి.

తాన్‌పురా సహకారంలేని శాస్త్రీయ సంగీత ప్రదర్శన/ సంగీత శిక్షణగానీ లేదు అన్నది వాస్తవం.హిందూస్థానీ తంబూరా ఆకారంలో సొరకాయబుర్రతో కడవను, టేకు, పనస, కర్రతో దండిని కలిగి ఉంటుంది. కొందరు లాక్షణికుల అభిప్రాయంలో క్రీ॥శ॥ 1629వ సంవత్సరం ప్రాంతానికి తంబురా ఆవిర్భవించినట్లు 'సంగీత పారిజాతం' అనే గ్రంథం ద్వారా తెలుస్తుంది. తంబురాకు ప్రధానంగా 4 కూటీలు . 4 తీగలు, ఒకబ్రిడ్జి, నాలుగు పూసలు, సూక్ష్మంగా శృతిని సరిదిద్దడానికి నూలుదారం లేదా ఊలు ఉంటాయి. నాలుగు తీగలు ప స స స మంద్రస్థాయి పంచమం, మధ్య రెండు తీగలు సారణి, అనుసారణిలుగ పిలువబడే మధ్యస్థాయి షడ్జం, నాల్గవ తీగ మంద్రస్థాయి షడ్జానికి శృతి చేయబడి ఉంటాయి.

ఈ నాలుగు స్వరాలు ..... గా రి స స గా అని వినిపిస్తూ హృద్యమైన వాతావరణాన్ని అందిస్థాయి. అరుదుగా 5వ తీగను కూడా ఏర్పరుచుకుంటారు. కొందరు విద్వాంసులు. హిందుస్థానీ సంగీతంలో ప్రారంభిక శిక్షణా సమయం నుండి కూడా స్వయంగా తంబురా వేసుకుంటూ పాడడాన్ని నేర్పించడం జరుగుతుంది.

ఒక సంగీత కళాశాలలోని హిందుస్థానీ తరగతిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఒక్కొక్క తంబరురాను శృతి చేసి ఇచ్చి, వారి చేత ఆ తంబురాను వాయింపచేస్తూ పాఠాన్ని నేర్పించే పద్ధతి పాటించడం అత్యంతహర్షదాయకం ఆచరణయోగ్యం. ఎలక్ట్రానిక్ తంబురాలు వాడుతున్నా, సహజమైన తాన్‌పురాను వాయించడం హిందుస్థానీ సంగీత విద్వాంసులు వీడలేదు.

తబలా: లయవాద్యాల్లో శృతివినిపించే లయవాద్యాలు మృదంగం, తబలా, పఖావాజ్ లను ప్రధానంగా చెప్పుకోవాలి. హిందుస్థానీ శాస్త్రీయ, లలిత, లలితశాస్త్రీయ, భక్తి, కర్ణాటక సంగీతంలో లలితశాస్త్రీయ, లలిత భక్తి కచేరీలతో పాటు సినిమా సంగీత, జానపద సంగీతాలలో కూడా అతి ప్రధానమైన స్థానంలో ఉన్న వాద్యం తబలా.

సుప్రసిద్ధ 'అమీర్‌ఖుస్రో' అనే కళాకారులు క్రీ॥శ॥ 18వ శతాబ్దంలో హిందుస్థానీ సంగీతంలో వినియోగించినట్లు చరిత్ర. ఐతే ఢిల్లీ దర్బారుకు చెందిన 'సిదార్‌ఖాన్‌దారి' అనే విద్యాంసుడు ముందుగానే తబలా వాద్యాన్ని కనుగొన్నారని ఇంకొక పాఠాంతరం. మనం ఇంకా ఎన్నో చారిత్రక నేపథ్యంలో వినే అంశాలు... 1. అమర్‌ఖుస్రో పఖావాజ్ వాద్యాన్ని సగానికి రెండుగా చేసి తబలా కనుగొన్నారని .... 2. దేవాలయాల్లో వినియోగించే 'పుష్కర' వాద్యం నుండి తబలా సృష్టించబడినదని. అరబిక్ భాషలో 'తబ్ల్' అనగా ఢంకా అని అర్థం . అందులో నుండి 'తబలా' గా స్థిరపడిందీపేరు. కుడివైపున ఉన్నదానిని 'బాయాం' అని ఎడమవైపున 'దగ్గా' అని అంటారు. సాధారణంగా కుడిచేతిలో బాయాను, ఎడమచేతిలో దగ్గాను వాయిస్తారు. కుడి బాయాపై శృతివినిపిస్తుంది. కుడికంటే ఎడమదగ్గా ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. కుడి- 15 సెంటీమీటర్ల వ్యాసం, 25 సెంటీమీటర్ల ఎత్తు, ఎడమ-20 సెంటీమీటర్ల వ్యాసం 25 సెంటీమీటర్ల ఎత్తు.

మట్టితో గాని, చెక్కతో గాని, ఇత్తడితో గాని చేయబడుతుంది. ఈ వాద్యం. చెక్కలలో ఎర్రచెక్కతో గాని, రోజ్‌వుడ్‌తో గాని, తబలాను తయారు చేస్తారు. ఒకవైపు (క్రింద) చెక్కతో మూయబడి రెండవ వైపు (పైన) చర్మంతో మూత తయారు చేస్తారు. కుడివైపు తబలా రంధ్రములలో చర్మపు లేసులవంటివి బిగించబడి ఉంటాయి. దానిని ఎక్కువగా బిగిస్తే శృతి పెరుగుతుంది. కుడి తబలాను షడ్జానికి కలిపి శృతి చేస్తారు. తబలా వాద్యంపై ' రేకా' వాయిస్తూ, తాలీ, ఖాలీల ప్రత్యేక ధ్వని వినిపిస్తారు. దీని సహాయంతో ప్రారంభిక దశ నుండే విద్యార్థులు తాళంపై ఏ క్రియలో ఉన్నామో తెలుసుకుంటారు. ముందు నుండి తబలాతో కలిసి సాధన చేయడం వల్ల అలవాటుగా మారి ఉత్తరోత్తరా ఎన్ని క్లిష్టతరమైన మనోధర్మాంశాలు పాడినా తబలాపై అతిసులభంగా తాళాన్ని రేకా ద్వారా గమనించగల శక్తి విద్యార్థులకు వస్తుంది. తాన్‌పురా, తబలా ఆద్యంతం తోడుగా ఉండే వాద్యాలు.

**(వచ్చే సంచికలో మరికొన్ని అంశాలు)**

ఆచార్య ద్వారం లక్ష్మి, సెల్-9290457296.

# మధురై మణి అయ్యర్

రచన : కె.సద్గురుచరణ్, నిలయ విద్వాంసులు, ఆకాశవాణి, విజయవాడ సెల్ : 9110363418

20వేల మంది ప్రజలు ఒకచోట గుమిగూడారంటే అది ఒక రాజకీయ నాయకుని బహిరంగ సభ అయినా అయ్యుండాలి లేదా ఒక క్రికెట్ మ్యాచ్ అయినా అయ్యుండాలి లేదా ఏదైనా సినీ సంగీత విభావరి లాంటిదైనా అయ్యుండాలి. కానీ ఒక కర్ణాటక శాస్త్రీయసంగీత విద్వాంసుని సన్మానానికి, అనంతరం జరగబోయే వారి కచేరీకి అంత భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారంటే నమ్మగలరా! కానీ నమ్మి తీరాలి. అంతటి ఘనమైన, అరుదైన గౌరవం పొందిన విద్వాంసులు 'సంగీత కళానిధి' మధురై మణి అయ్యర్ గారు. ఆయనకు ముప్పైయొక్క సంవత్సరాల వయస్సులో తంజావూరు పురప్రజలు ఈ సన్మానాన్ని చేసి, 'గానకళాధర' అనే బిరుదు ప్రదానం చేసి తమ సంగీతాభిమానాన్ని, సంస్కారాన్ని చాటుకున్నారు. ఆనాటి కచేరీలో ఆయన గానం చేసిన ' వినాయకుని వలెను' అనే త్యాగరాజస్వామి వారి కృతిలో ' అనాధరక్షకి శ్రీ కామాక్షి' అనే సాహిత్యానికి చేసిన నెరవల్ శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

మణి అయ్యర్‌గారి అసలు పేరు సుబ్రహ్మణ్యం. 1912 అక్టోబర్ 25న వీరు ఎంఎస్. రామస్వామి అయ్యర్, సుబ్బలక్ష్మి పుణ్యదంపతులకు మధురైలో జన్మించారు. మణిగారి తొమ్మిదవ యేట వారి ఇంటి దగ్గర్లో ఉండే రాజమ్ భాగవతార్ అనే మహావిద్వాంసుని వద్ద సంగీతాభ్యాసం మొదలుపెట్టారు. అదే సమయంలో పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ రెండు సంవత్సరాల పాటు వేదాధ్యయనం కూడా చేశారు. స్వరకల్పనలో దిట్టగా ప్రసిద్ధిగాంచిన రాజమ్ భాగవతార్‌గారు సరళీ, జంట, దాటు మొదలైన అభ్యాన వరుసలను సంప్రదాయసిద్ధమైన మాయామాళవగౌళలోనే కాకుండా శంకరాభరణం, కళ్యాణి, హరికాంభోజి, పంతువరాళి మొదలైన ప్రసిద్ధ రాగాలలో కూడా సాధన చేయించి, స్వర స్థానాలపై, ప్రయోగాలపై దృఢమైన పట్టును అలవర్చారు.

మణిఅయ్యర్ గారు ఆరవ తరగతి చదివే రోజుల్లో ప్రసిద్ధ విద్వాంసులు, ప్రముఖ వాగ్గేయకారులు శ్రీ హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్‌గారు 'త్యాగరాజ విద్యాలయం' లనే సంగీత పాఠశాలను నెలకొల్పి, రాజమ్ భాగవతార్ గారిని అధ్యాపకునిగా నియమించారు. అప్పట్నుంచి త్యాగరాజ విద్యాలయం మొదటి బ్యాచ్ విద్యార్థులలో ఒకరిగా రాజమ్ భాగవతార్, ముత్తయ్య భాగవతార్ గార్ల శిక్షణలో సాధన కొనసాగిస్తూ వచ్చారు. స్వయంగా తాను మార్దంగికుడు కూడా అవ్వడంతో ముత్తయ్య భాగవతార్ గారు మణి గారితో పాటు శిష్యులందరికీ కూడా లయలోని మెళకువలనెన్నింటినో నేర్పారు. సంగీతం పట్ల కుమారుని ఆసక్తినీ, పట్టుదలతో చేసే సాధనని గమనించిన రామస్వామి అయ్యర్‌గారు పాఠశాల విద్యను ఆపించి పూర్తి సమయాన్నిసంగీత సాధనకే వినియోగిం పజేశారు.



1924లో తన 12వ యేట రామనాథపురం జిల్లాలోని అలవ కొట్టైలో ప్రథమ ప్రదర్శననిచ్చారు మణి గారు. 1927లో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో జరిగిన మొట్టమొదటి మ్యూజిక్ కాన్ఫరెన్స్‌లో కచేరీ చేసి పతకాన్ని పొందారు. ఆ రోజుల్లో అంటే 1920వ దశకంలో మహా విద్వాంసులుగా కీర్తిని పొందిన నాదస్వరవిద్వాంసులు మధురై పొన్ను స్వామి పిళ్ళై, రాజరత్నం పిళ్ళై,వీణ విద్వాంసులు ధనమ్మాళ్, కారైకుడి సోదరులు, గాత్ర విద్వాంసులు మహారాజపురం విశ్వనాధయ్యర్, కాంచీపురం నయనా పిళ్ళై, మృదంగ విద్వాంసులు దక్షిణామూర్తి పిళ్ళై వంటి వారి సంగీతం నుండి ఎంతో జ్ఞానాన్ని, స్ఫూర్తిని పొందారు మణిగారు. త్యాగరాజస్వామి వారి శిష్యులైన నాగస్వామి భాగవతార్ ( వాలాజపేట వెంకటరమణ భాగవతార్‌గారి శిష్యులు) గారివద్ద నుండి అయ్యవారి కృతులనేకం పాఠం చేశారు. ఆధునిక కచేరీ పద్ధతికి మూలకారకుడైన శ్రీ అరియకుడి రామానుజయ్యంగార్ గారి పంథానే తాను కూడా స్వీకరించి కచేరీలు చేశారు మణిగారు.

దురదృష్టవశాత్తూ 1944వ సంవత్సరంలో తీవ్రమైన అనారోగ్యం పాలయ్యారు మణిగారు. అనేకచోట్ల చికిత్స చేయించుకుని అతి కష్టం మీద అనారోగ్యాన్ని తట్టుకుని నిలబడగలిగినా కచేరీలు చెయ్యడం ఆపేయాల్సి వచ్చింది. ఇది ఆయన అభిమానులను తీవ్ర నిరాశకు లోనుజేసింది. ఆయన జీవితంలో మళ్ళీ పాడలేరనే వదంతులు దేశమంతటా వ్యాపించాయి. ఆయన తండ్రిగారి సహోదరుడైన ప్రఖ్యాత గాత్ర విద్వాంసులు మధురై పుష్పవనం అయ్యర్ గారిలాగే 32వ యేటనే మణి గారి జీవితం కూడా అంతమవుతుందనే పుకార్లు సైతం వ్యాపించాయి. కానీ భగవంతుడు మణిగారి అభిమానుల పక్షానే నిలిచాడు. కర్ణాటక సంగీత ప్రపంచం ఒక అమూల్య రత్నాన్ని కోల్పోకుండా కాపాడాడు.

అయితే మణిగారు చాలాకాలం పాటు కచేరీలు

చెయ్యలేకపోయారు. గాత్రం కూడా దెబ్బతిని, పై స్థాయిలోకి వెళ్లలేక ఆయన తన శృతిని ఒకటిన్నరకి తగ్గించుకోవాల్సి వచ్చింది. గాత్రానికి ఎన్నో పరిమితులు ఏర్పడినప్పటికీ తన జ్ఞానానికి, అనుభవానికి కఠోరమైన సాధనను జతచేసి మరింత రక్తియైన బాణీని సృష్టించుకుని సమకాలీన, వరిష్ట విద్వాంసులకు తీసిపోకుండా రెట్టించిన ఉద్ధృతితో 1945లో తిరిగి రంగప్రవేశం చేశారు. మారిన తన గాత్రధర్మానికి అనుగుణంగా అకారం పాడేటప్పుడు ఒక్కోసారి ఈ , ఊ, లలలా వంటి శబ్దాలను ఉపయోగించేవారు. ఇవి ఆయన బాణీలో ఎంతగా ఇమిడిపోయాయంటే తర్వాతి తరాలలో ఆయన బాణీని అనుకరించేవారు ఆ శబ్దాలను కూడా అనుకరించడం మొదలుపెట్టారు. నేటి విద్వాంసులలో మణిగారి మేనల్లుడు, శిష్యుడు అయిన 'సంగీత కళానిధి' శ్రీ టి.వి శంకరనారాయణన్ గారి గానంలో ఆయన బాణీ మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

కుంభకోణం రాజమాణిక్యం పిళ్ళై, మైసూర్ టి. చౌడయ్య వంటి గొప్ప వయోలిన్ విద్వాంసులు, పాల్ఘాట్ టి. ఎస్. మణి అయ్యర్, పళని సుబ్రమణ్య పిళ్ళైవంటి ప్రముఖ మార్దంగికులు ఆయనకు సహకారం అందిస్తూ వచ్చారు. మద్రాసులో స్థిరపడిన తర్వాత అక్కడ అనేక దేవాలయాలలో ఆయన చేసిన కచేరీలను సామాన్య ప్రజానీకం చుట్టుపక్కల ఇళ్లపై, గోడలపై, చెట్లపై సైతం ఎక్కి కూర్చుని వినేవారట. వారిని తృప్తిపరచడానికి కచేరీ చివర ఎన్నో లలితశాస్త్రీయ అంశాలను, రాగమాలికలను, ఇంగ్లీష్ నోట్‌ను పాడేవారు.

మణి అయ్యర్‌గారు ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండిపోయారు. పరిశుద్ధమైన ఆయన వ్యక్తిత్వం, నడవడిక, వాటిని ప్రతిబింబించే తెల్లటి ఖాదీ వస్త్రధారణ, నిష్కల్మషమైన చిరునవ్వుతో కూడిన హుందాతనం ఆయనకు సంఘంలో ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ధనార్జనకై సంగీత కచేరీలు చేస్తున్న కారణంగా త్యాగరాజ విరచిత 'నిధి చాల సుఖమా రాముని సన్నిధి సేవ సుఖమా' అనే కృతిని పాడడం ఆత్మవంచనగా భావించి పాడడం మానేశారు. కచేరీలలో పాడిన ప్రతి త్యాగరాజకృతికీ ఒక్క అణా అయినా పక్కన పెట్టి (అది ఎంత చిన్న మొత్తమైనా) తిరువయ్యారులోని త్యాగరాజస్వామివారి సమాధి నిర్వహణకై వెచ్చించాలని ఆయన కోరిక. ఆయన కోరిక ఎంతవరకు నెరవేరిందన్న విషయం పక్కనబెడితే పైన చెప్పిన విషయాలను బట్టి సంగీతం పట్ల, త్యాగరాజస్వామి వారిపట్ల ఆయనకున్న భక్తి విశ్వాసాలను, నిబద్ధతను మనం అర్థం చేసుకోవచ్చు.

కర్ణాటక సంగీత ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మద్రాసు మ్యూజిక్ అకాడమీవారి ' సంగీత కళానిధి' బిరుదు మణి అయ్యర్‌గారికి 1960 జనవరి మూడున అప్పటి కేంద్రమంత్రి శ్రీ హుమాయూన్ కబీర్ గారి ద్వారా, శ్రీ అరియకుడి రామానుజయ్యంగార్, జస్టిస్ రాజమన్నార్ గార్ల సమక్షంలో ప్రదానం చేయబడింది. తన అధ్యక్షోపన్యాసంలో ఆయన విద్యార్థులకెన్నో ఉపయోగకరమైన సూచనలను చేశారు. కర్ణాటక సంగీతంయొక్క స్థాయి దిగజారకూడదంటే సరళీలను, జంటలను నాలుగు కాలాలలో, అలంకారాలను, గీతాలను మూడు కాలాలలో, వర్ణాలను కనీసం రెండు కాలాలలోనైనా సాధన చేయనిదే కృతులను అభ్యసించకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. 1960 మార్చి నెలలో ఆయనకు కేంద్ర సంగీతనాటక అకాడమీ అవార్డు అప్పటి భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్గారి చేతుల మీదుగా ప్రదానం చేయబడింది. 1963 లో తమిళ్ ఇసై సంగం వారు 'ఇసై పెరారిగ్నార్' బిరుదుతో సత్కరించారు.

ఇక నిత్యజీవితంలో సంగీతం తర్వాత ఆయనకు ఇంగ్లీష్ భాషంటే అమితమైన ఆసక్తి ఉండేదట. ఆరవ క్లాసులోనే పాఠశాల విద్యను ఆపేసినా ఇంగ్లీషు భాషలో చక్కటి ప్రావీణ్యాన్ని సంపాదించారు. జార్జ్ బెర్నార్డ్ షా, చార్లీ చాప్లిన్ ఆయన అభిమాన కళాకారులు.

తన అవసానదశలో తీవ్ర అనారోగ్యం పాలయ్యారు మణి గారు. 1964 ప్రాంతంలో ఆయన కంటిచూపు పూర్తిగా మందగించింది. రోజుల తరబడి మంచంపైనే ఉండాల్సి వచ్చింది. ఆయన బావగారు, శిష్యుడు అయిన వేంబు అయ్యర్ గారు ఆయనను కంటికి రెప్పలా కనిపెట్టుకుని సపర్యలు చేశారు. ఆ పుణ్యమేనేమో వారి కుమారుడు, మణి అయ్యర్‌గారి మేనల్లుడు, శిష్యుడు అయిన శ్రీ టి.వి. శంకరనారాయణన్ గారు గొప్ప విద్వాంసునిగా ఖ్యాతినార్జించడమే కాకుండా మణిగారి బాణీని నేటికీ సజీవంగా ఉంచి, మద్రాసు మ్యూజిక్‌అకాడమీ వారి 'సంగీత కళానిధి' బిరుదును పొందారు. ఆయన శిష్యులలో ప్రముఖులు సర్వశ్రీ ఎస్. రాజం, టి.ఎస్.వేంబు అయ్యర్, తిరువెంగాడు జమరామన్, శ్రీమతి సావిత్రి గణేషన్ మొదలైనవారు.

1968 మార్చి 31న మైలాపూర్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ కోసం మ్యూజిక్ అకాడమీ హాల్లో మాయవరం గోవిందరాజ పిళ్ళై, వెల్లూర్ రామభద్రన్‌గార్ల సహకారంతో చేసిన కచేరీతో సుదీర్ఘమైన ఆయన సంగీత జీవితానికి తెరపడింది.ఆరోగ్యం మరింత క్షీణించడంతో 1968 జూన్8న ఆయన ఇహలోక జీవితానికి కూడా తెరపడింది. సంగీత ప్రపంచం ఒక మధురమైనమణిని కోల్పోయింది. రేడియోలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారమయ్యాయి. వార్తాపత్రికలు ప్రత్యేక కథనాలను ప్రచురించాయి. జాతియావత్తూ ఘనమైన నివాళి అర్పించింది.భౌతికంగామనమధ్యలేనప్పటికీ లెక్కకు మించిన గ్రామఫోన్ రికార్డులు,క్యాసెట్లు,సిడిల ద్వారా సంగీత ప్రపంచంలోవారు చిరంజీవిగాఉండిపోయారు.ఆయనగళం, గానం, బాణీ తర్వాతి తరాలకు తరగని వారసత్వ సంపదగా నిలిచే ఉంది.

# 'గానకళానిధి' డా॥ వింజమూరి వరదరాజ అయ్యంగారికి నివాళి



2019వ సంవత్సరం డిసెంబరు 18వ తేదీన మదరాసు మ్యూజిక్ అకాడమి గానకళానిధి డా. వింజమూరి వరదరాజ అయ్యంగారిపై ఉపన్యాసము,వీడియో ప్రదర్శన ద్వారా నివాళులు అర్పించింది. ఈ ఉపన్యాసమును అందించిన వారు అకాడమీ సంగీత కళాశాల అధ్యక్షులు డా. రితా రాజన్.

శ్రీమతి రితా రాజన్ సభా నమస్కారములు అయిన తరువాత తాను మొట్టమొదట వింజమూరి వారి గురించి చాలా విషయాలు 2002వ సంవత్సరంలో చెన్నై నుండి వెలువడు శృతి అనే ఆంగ్ల సంగీత పత్రికలో చదివినట్లు తెలిపారు. ఆవిడ ఉపన్యాస సారాంశము ఇక్కడ ఇవ్వడమైనది.

వింజమూరి వరదరాజ అయ్యంగారు 1915లో గుంటూరులో జన్మించి 1991 వరకు జీవించి ఉన్నారు. వీరు తిరునల్వేలి నుంచి తరలి వచ్చిన శ్రీవైష్ణవ స్వయం ఆచార్య పురుష కుటుంబానికి చెందినవారు. వీరి తండ్రిగారు వింజమూరి భావనాచార్యులు, తల్లి కనకవల్లి గారు. వీరు తండ్రిగారు గుంటూరులో ప్రముఖ న్యాయవాది, సంఘ సంస్కర్త, దయాగుణం కలిగినవారేగాక అరియక్కూడి, మహరాజపురం, వీణ శేషణ్ణ, పరూర్ సుందరం అయ్యర్, వీణ వెంకటరమణదాసు వంటి పలు ప్రఖ్యాత సంగీత విద్వాంసులకి, సరోజనీనాయిడు వంటి రాజకీయ నాయకులకి తమ ఇంటిలో అతిథ్యం ఇచ్చి గౌరవించినవారు. వరదరాజ అయ్యంగారు వారికి 13వ సంతానం. వింజమూరి వారి కుటుంబ సభ్యులందరు, పాఠశాల విద్యార్థి అయిన వరదరాజ అయ్యంగారితో సహాస్వతంత్ర పోరాటంలో విరివిగా పాల్గొన్నవారు. వరదరాజ అయ్యంగారి 5గురు అన్నలు న్యాయవాది వృత్తిలోను, సంగీతంతోను నిష్ణాతులు. వారు 7 గురు అక్కలు కూడా సంగీతంలో శిక్షణ పొందినవారే.

ఆకాలంలో, జి.ఎన్.బి వంటి కళాశాల విద్య ముగించిన బహు కొద్ది సంగీత విద్వాంసులలో వరదరాజ అయ్యంగారు ఒకరు. ఆయన బి.ఏ. పట్టా పొందినవారు.

వరదరాజ అయ్యంగారి మొదటి గురువు ముక్త్యాల సంస్థాన సంగీత గురువైన శ్రీ పిరాట్ల శంకర శాస్త్రిగారు. వారు వింజమూరి వారి అక్కలకు సంగీత విద్యనేర్పే సమయంలో చిన్న వరదరాజు సంగీతంపై చూపించే నేర్పు, శ్రద్ధ, కుతుహలం, మక్కువ చూసి ముచ్చటపడి వారి 5వ ఏట సంగీతం నేర్పడం ఆరంభించారు. శంకర శాస్త్రిగారు తిరువట్టియూర్ త్యాగయ్యర్ పరంపరకు చెందినవారు.

1935వ సంవత్సరంలో వింజమూరి మదరాసు విశ్వవిద్యాలయంలో టైగర్ వరదాచార్యర్ ఆధ్వర్యంలో సంగీత డిప్లొమలో చేరి ముగించిన అనంతరంకూడా వారి వద్దనే సంగీత శిక్షణ కొనసాగించుతూ, గురువుగారితో ప్రయాణం చేస్తూ, వారికి సహకార సంగీతం అందించేవారు. వారికి అరియకూడ్రి పాఠాంతరంపై గల మక్కువ వారిని తన మానసికగురువుగా తలపింపజేసింది. వింజమూరి వారు టైగర్, అరియక్కూడిల బాణిలను చక్కగా సమన్వయించి, అనుసరించి పాడిన అద్భుతమైన బాణి సంగీతలోకముచే వారిని చిన్న అరియక్కూడి, ఆంధ్రా అరియక్కూడి, చిన్న టైగర్ వంటి అనేక పేర్లతో పిలిపించింది.

1935వ సంవత్సరమున మదరాసు మ్యూజిక్ అకాడమీలో జరిగిన సంగీత పోటీలో వింజమూరి పాల్గొనటం జరిగింది. ఆసందర్భంలో మొదటి బహుమతి బంగారుపతకం ఇవ్వవలసిన సందర్భంలో, న్యాయనిర్ణేతలు వారికి ఒక తంబూర ఇచ్చి శృతి చేయవలసినదని చెప్పగా, వింజమూరి తంబూరాని రెండు, మూడు నిమిషములలోనే అత్యంత సమర్ధవంతముగా, శృతి శుద్ధముగా శృతిజేసిన విధానమునకు అబ్బురపడిన సి యస్ అయ్యర్ (సర్ సి విరామన్ గారి అన్న, సంగీతజ్ఞాని, అకాడమి ప్రముఖులలో ఒకరు) మరొక బంగారుపతకం కూడా ఇవ్వ ప్రకటించిరి. అవిధంగా ఆనాడు వింజమూరివారికి రెండు బంగారు పతకాలు ఇవ్వడం జరిగింది.

వింజమూరివారి మొట్టమొదటి సంగీత ప్రదర్శన వారి ఏడోవ ఏట గుంటూరులో వీణ శేషణ్ణగారి సమక్షంలో జరిగింది. వారి చిరుప్రాయంలోనే ముక్త్యాల సంస్థానంలో వారు తమ

గురువుగారి బదులు చేసిన కచ్చేరి బహు అద్భుతంగా జరిగింది. వారి సంగీతజ్ఞాన ప్రదర్శనకు అబ్బురపడిన గురువు పిరాట్లవారు, హృద్వేగంచే కన్నీరునిండిన కనులతో "నేను – ఈ శంకరుడె నీకు గురువా? లేక ఆ ఆది శంకరుడె నీకు గురువా?" అని ప్రశంసించిరట.

వింజమూరికి సుమారు 20సంవత్సరముల వయస్సులో, అరియక్కూడి పాడవలసిన కచ్చేరి తాను పాడలేక వింజమూరిచే పాడించవలసినదని 'రసికరంజని సభ' యాజమాన్యమునకు చెప్పగా, వింజమూరి ఆ చిరుప్రాయంలోనే కుంభకోణం రాజమాణిక్యం పిళ్ళె వయొలిన్, పుదుక్కోటె దక్షిణా మూర్తిపిళ్ళె మృదంగంతో సమర్థవంతగా చేసిన కచ్చేరి అరియక్కూడి మొదలగు పెద్దలచే బహు ప్రశంసలనందుకుంది.

1938వ సంవత్సరములో తిరువనంతపురం రాజ్యసభలో మహారాజు చిత్ర తిరునాళ్, మహారాణి సేతు పార్వతీబాయ్‌ల సమక్షంలో వింజమూరి తోడి రాగాలాపన, కీర్తన పాడిన విధానానికి అచ్చెరువందిన రాజ ప్రముఖులు వారికి వెనువెంటనే 'తోడి వరదరాజ అయ్యంగారు' అనే బిరుదు నిచ్చి బంగారు కడియంతో సత్కరించిరి. అంతేకాక వింజమూరివారు పాడెడి ఉత్కృష్టమైన బాణికి మెచ్చి వారిని 'భైరవి' వరదరాజ అయ్యంగారని, 'ఖమాస్', 'కళ్యాణి', వరదరాజ అయ్యంగార్ వంటి అనేక పేర్లతో అభిమానులు. పాత్రికేయులు కొనియాడెడివారు.

వరదరాజ అయ్యంగారికి చిన్నతనం నుండి పలువురు పెద్ద విద్వాంసులు; చౌడయ్య, పరూర్ సందరమయ్యర్, మరుంగాపురి గోపాలకృష్ణ అయ్యర్, తిరువలంగాడు సుందరేశ అయ్యర్, ఆర్ కే వెంకటరామ శాస్త్రి మొదలగు ప్రముఖులు అభిలషించి వయొలిన్ వాద్యము, పాలక్కాడు మణి, పళని సుబ్రమణ్య పిళ్ళే, అళగనంబి, దక్షిణామూర్తి పిళ్ళే వంటి ఉద్ధండులు మృదంగ సహకారాలను అందించిరి. అరియక్కూడి వంటి పెద్దలకు తప్ప పక్కవాద్యం వాయించని ద్వారం వెంకటస్వామి నాయుడు గారు కూడా వింజమూరి వారిని మెచ్చి, వారి పలు కచేరీలకు పక్క వాయిద్యం వాయించటం విశేషమైన విషయం.

వింజమూరి 1940–50లలోనే బర్మ, సింగపూర్, మలేషియా, సిలోన్, జాఫ్నా, కాన్డి మొదలైన విదేశాలలో పలుకచ్చేరీలు విజయవంతగా జరిపారు.

వింజమూరివారి జీవితంలో పలుచిత్రమైన సంఘటనలు జరిగాయి. వారి ఒక కచేరీకి చౌడయ్య వయొలిన్‌పై, పళని మృదంగమ్ పై పక్కవాయిద్యాలు వాయించవలసి ఉన్నది. కానీ, చౌడయ్యగారు సమయానికి ఆచోటికి రాలేకపోయారు. అప్పుడు సభికులలో ఉన్న ఫ్లూటు మాలి (శ్రీటి. మహాలింగం) వింజమూరివారికి అభ్యంతరం లేకపోతే తాను ఫ్లూటు పక్కవాద్యం వాయిస్తానని చెప్పారు. ఆవిధంగా ఆ కచ్చేరి ఫ్లూటు పక్కవాద్యంతో చాలా అద్భుతంగా జరిగింది.

చెన్నైలోని త్యాగరాజ విద్వత్ సమాజంలో జరిగిన చెంబై వైద్యనాథభాగవతారు గారి ఒక కచ్చేరి మాలి వయొలిన్, మహారాజపురం విశ్వనాథ్ అయ్యర్ మృదంగంతో జరిగింది. ఆతరువాత పాడిన వింజమూరి కచ్చేరీకి కూడా మాలి, మహారాజపురంలతో పాటు వెల్లూరు రామభద్రన్ కూడ మృదంగం వాయించడంతో ఆకచేరీ రెండు మృదంగాల కచ్చేరిగా చరిత్రలో మిగిలింది. అందరు పక్క వాద్యకులు వింజమూరివారికి సహకార వాద్యం అందించడానికి బహు ఉత్సాహం చూపేవారు.

వింజమూరి 'లవంగి' అనే ఒక తమిళ సినిమాలో కూడా నటించటం జరిగింది. 17వ శతాబ్దమునకు చెందిన జగన్నాథ అను పండితుడు మొఘల్ రాజయిన షాజహాన్ రాజ దర్బారులో ఉన్నప్పటి కథ అది. వారికి 'పండితరాయ' అనే బిరుదు రాజసంస్థానంలో లభించింది. వెరసి, 'లవంగి' లేక 'జగన్నాథ పండితరాయ' అని సినిమా పేరు. ఈసినిమాలో వింజమూరి జగన్నాథ పండితుడిగాను, కుమారి రుక్మిణి లవంగి గాను, సినిమా తీసిన వైవీ రావు షాజహాన్‌గాను ముఖ్యమైన పాత్రలలో నటించారు.

వింజమూరికి లభించిన బిరుదు సత్కారాలు ఎన్నో!1938వ సంవత్సరం మొట్టమొదటిగా పుష్పగిరి పీఠం స్వామి శంకరాచార్యులవారు వారికి 'గానవిద్యా విశారద' అనే బిరుదునిచ్చి శ్లోకమాలతో సత్కరించారు. గాయకరత్నం, గాయక సార్వభౌమ వంటి అనేక బిరుదులతోబాటు, కాకినాడ సభ వారిచ్చిన బహు గౌరవప్రదంగా పేరొందిన 'గానకళానిధి' బిరుదు; ఋషీకేష్ స్వామిశివానంద ఇచ్చిన 'సంగీతజ్యోతి' బిరుదులు కూడా వీరి సొంతం. వింజమూరివారు పలు సభలతో సంబంధ బాంధవ్యాలు ఉన్నవారు. 1946లో సంగీత విద్వత్ సమాజానికి మొట్టమొదటి కార్యదర్శిగా ఉన్నారు. సీకా (సౌత్ఇండియన్ కల్చరల్ అస్సోసియేషన్)కి ఉప–ప్రధాని గాను, ఆంధ్రప్రదేష్ సంగీత నాటక ఆకాడమీ (ఏ పి యస్ ఎన్ ఎ)కి ఉప–ప్రధానిగాను, బెర్హాంపూర్ వంటి ఊర్లలో ఉన్న సభలతోబాటు, ఇండియాలో ఉన్న పలు సభలలో కీలకమైన పాత్రలను వహించి సంగీతసేవ చేశారు.

1952–53లలో సెంట్రల్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అన్డ్ డాన్స్ పేరిట సంగీత కళాశాలను స్థాపించి, వ్యవస్థాపక ప్రధానోపాధ్యాయునిగా పని చేశారు. అంతకుమునుపే, 1943లో మదరాసు రేడియో ద్వారా 'గానలహరి' అను పేరిట, తోటా గోవిందమ్మ (టీ జీ కమల – ప్రసిద్ధ సినిమా కళాకారిణి) అనే 12 సంవత్సరాల అమ్మాయిని విద్యార్థిగా, సంగీత శిక్షణ కార్యక్రమం వారానికి 3రోజులు నిర్వర్తించారు. 1940–50లలో వారు రేడియో ద్వారా అనేక సంగీతపరమైన ప్రసంగాలు చేశారు. రాగలక్షణములు, సంగీతజ్ఞుల చరిత్రల వంటి ఎన్నో విషయాలను శ్రోతలకు పరిచయం చేశారు. నిజామ్ హయాంలో దక్కన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పరేషన్‌గా ఉన్న రేడియో స్టేషన్ స్వతంత్రం వచ్చిన తరువాత ఆకాశవాణిగా వెలిసింది. అప్పుడు,1956–64 సంవత్సరాలలో

వింజమూరి హైదరాబాదు రేడియోలో మొదటి సంగీత విభాగ ప్రయోక్తగ పనిచేసారు. ఆసమయంలో వారు చేసిన సేవ చాలా ఉత్కృష్టమైనది, అనన్యసామాన్యమైనది. 'వింజమూరివారు హైదరాబాదుని ఆంధ్రదేశపు శాస్త్రీయ సంగీతానికి బిందువుగా చేసిన మహాత్ముడు' అని నూకలగారు అన్నది అక్షరసత్యం.

ఆకాశవాణిలో వింజమూరివారు, ఈనాటికీ ప్రసారం చెయ్యబడుతున్న, భక్తిరంజని వంటి కార్యక్రమాలనెన్నో నిర్వహించి ప్రసారం చేశారు. లయవిన్యాసం అనే కార్యక్రమానికి ఆ రేడియో విద్వాంసులనే కాక, దక్షిణ భారతదేశ ఇతర రాష్ట్రాలనుంచి గూడా విద్వాంసులను పిలిపించి ప్రయోగాత్మంగా నిర్వహించేవారు. లయచిత్రము, ధ్వనినీహారిక,సంగీతసుధ, రాగలక్షణము, లయసుధ, వివిధ విషయ నేపథ్యాలకు సంబంధించిన ప్రసారములు, సంగీత రూపకముల వంటి అనేక కొత్త ప్రక్రియలను శ్రోతలకు అందించారు. వీటిలో 'సంగీతగోష్ఠి' అను ప్రక్రియ చాలా ఉద్దాత్తమైనది. ఇందులో అతి జ్ఞానపరులైన సంగీతజ్ఞులు, అతి సామాన్యమైన శ్రోతలతో సంగీతములో అతి ముఖ్యమైన విషయాల గురించి చర్చించడం, వారి అనుమానాలకు, ప్రశ్నలకు సమాధానమివ్వడం వంటివి ప్రసారము చెయ్యబడెడివి. ఇవియేకాక, ఆండాళ్ విరచితమగు తిరుప్పావై 30 పాశురములకు స్వరములను కూర్చి రేడియో ద్వారా మొట్టమొదటిగా ప్రసారం చేసిన ఘనత వింజమూరిదే! అదేవిధముగా, శ్రీలక్ష్మీనరసింహ కరావలంబన స్తోత్రం, యాదగిరి శ్రీలక్ష్మినరసింహ సుప్రభాతం వంటి స్తోత్రాలకు గూడా వర్ణమట్టు కట్టి ప్రసారం చేసినది కూడా వింజమూరివారే. మదరాసు మ్యూజిక్ అకాడమీ ప్రముఖులుగా ఉండిన టి.ఎస్.ఎ. పార్థసారధిగారు వారి ఉత్తరంలో 'మొట్టమొదట అన్నమాచార్య కీర్తనలను స్వరపరచి పాడినది వింజమూరి వారే' అని చెప్పడం, రాళ్ళపల్లివారు ప్రధములని నమ్మిన మనవంటి వారికి కనువిప్పు. అదేవిధముగా, తిరుప్పావై అరియక్కుడి మాత్రమే స్వరపరిచారన్న నమ్మకము, ప్రముఖంగా ఈనాడు మనమంతా మోహన, బిలహరి వంటి రాగాలలో పాడుతున్న తిరుప్పావైలు అరియక్కుడి కాక వింజమూరివారు స్వరపరిచినవేనని కూడా స్పష్టమైనది.

వింజమూరివారు బహు ప్రజ్ఞగల వాగ్గేయకారులు. వారు రచించిన రచనలు సుమారు 15మాత్రమే అయినా, వర్ణాలు, కృతులు, జావళీలు, తిల్లానాలు రచించారు. వారి ముద్ర '(కంచి) వరదరాజ'. వీటిలో కొన్నిటిని శ్రీఆర్కే శ్రీకంఠన్ పాడి, వింజమూరివారి గురించిన

సంగీత విభాగంలో తీసిన చాయా చిత్రంలో, టైగరుగారు, పరూర్ సుందరం అయ్యరు మొదలైన ఉపాధ్యాయులతోబాటు వింజమూరివారిని గూడా తమతో సమానంగా కుర్చీలో కూర్చుండ పెట్టిన విధం గురువులకు శిష్యుడియెడ ఉన్న గౌరవాభిమానములు వెల్లడి అవుచున్నవి.

వింజమూరివారికి 46వ సంవత్సరంలో ఒక పెద్ద ప్రమాదం సంభవించి, వారు 40 రోజులు అపస్మారక స్థితిలో ఉండి, 41వ రోజున సంపూర్ణ మెళకువతో, సంపూర్ణ జ్ఞాపకశక్తితో, సంపూర్ణ విద్వత్‌తో లేవడం ఆశ్చర్యమైన విషయం. కానీ తన శారీర బలహీనతను గుర్తించి తనకుతానే క్రమంగా సంగీత కచ్చేరీలు చెయ్యడం తగ్గించుకున్నారు. అంతటి ఆత్మ స్థైర్యం ఈ ప్రపంచంలో ఎందరికి ఉంటుంది? కానీ, ఉద్యోగము, సంగీతసేవ చెయ్యడము, వ్యాసాలు వగైరా రాయడము, సంగీతంలో పరిశోధన చెయ్యడము, కొత్త కీర్తనలను పలువురికి నేర్పడము వంటివి మాత్రం మానలేదు.

వింజమూరివారు బహుముఖ ప్రజ్ఞాశాలి. వారు ప్రఖ్యాత సంగీత విద్వాంసులు; సంగీత శాస్త్ర కోవిదులు; అసాధారణ వాగ్గేయకారులు; ఏరచనకైనా స్వరం కూర్చగల దిట్ట; ప్రఖ్యాత వ్యాస రచయిత; బహుభాషా ప్రావీణ్యత (8భాషలలో నిపుణత) గల వ్యక్తి; నిస్వార్ధపరోపకారి.

డా.రితా రాజన్ నివాళి ముగిసిన పిమ్మట కొందరు కొన్ని ప్రశ్నలు వెయ్యడం జరిగింది. వాటిలో ముఖ్యమైనవి, వింజమూరివారు తెలుగు వారా? లేక తమిళవారా? అన్నది ఒకటి (సంగీతానికి ఎల్లలు ఏవి? సంగీత విద్వాంసుని మాతృభాషకు సంగీతానికి ఉన్న సంబంధం ఏమిటి? ) వింజమూరివారి మిత్రులు, అభిమాని అయిన మేజర్ బాలసుబ్రమణ్యంగారి కుమార్తె పుష్కల గోపాల్ వింజమూరివారితో తమకున్న పరిచయం, వారివద్ద తన తల్లిగారు ఊర్మిక కృతి, సదామదిన్ అనే త్యాగరాజ కృతి వంటి అనేక కృతులు నేర్చుకొన్న విషయము, రాజకీయాలుగాని, సభ నడిపే విధానంగాని, సంగీత విషయాలు గాని అనర్గళంగా మాట్లాడగలిగిన వింజమూరివారి చాతుర్యం గురించి చెప్పారు.

అకాడమీ కార్యదర్శి శ్రీమతి సుమతీ కృష్ణన్ వింజమూరివారి పేరిట జరిగే అనేక సంగీత సేవలను కొనియాడారు. వాటిలో ఒకటిగా అకాడమీ 28సంవత్సరాలుగా డిసెంబరు సంగీత ఉత్సవంలో అతిఉన్నత పల్లవి పాడిన వారికి ఇస్తున్న బంగారు పతకం గురించి చెప్పారు.

2019-20 సంవత్సరం మదురాసు మ్యూజిక్ అకాడమీ 'సంగీత కళానిధి' బిరుదుకు ఎన్నికైన శ్రీమతి సౌమ్య వింజమూరివారి గొప్పతనం తెలుసుకోవడం తన అదృష్టమని తెలుపటమేగాక, తనుకూడా ఘనరాగ వర్ణం నేర్చుకోవాలనే ఆకాంక్ష తెలిపారు. అంతేకాక బిరుదు ప్రదానం నాడు తన కృతజ్ఞతాంగీకార ప్రసంగంలోకూడవింజమూరివారికి (టి ఏల్ వెంకటరామాయ్యర్‌ని) మరిఒకసారి వినయపూర్వకముగా తలచుకొన్నారు.

రితా రాజన్ గారి ఇద్దరు శిష్యురాళ్ళు వింజమూరివారి ఘనరాగ వర్ణం మరియు హేమవతి రాగ కీర్తన 'జాగేలరా నన్ను బ్రోచుటకు' చక్కగా పాడి శ్రోతల ప్రశంసలు పొందడమే కాక, ఘన రాగ వర్ణం తాము తమ పరీక్షలలో కూడా పాడిన విషయం తెలిపి శ్రోతల ఆశీస్సులను అందుకున్నారు.

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు, మల్కాజ్‌గిరి హైదరాబాద్

ఆనందబాగ్‌లో శంకర విద్యాపీఠంలో మాఘబహుళ పంచమి (13 ఫిబ్రవరి) నుంచి మొదలై ఏకాదశి ( 19 ఫిబ్రవరి) వరకు ఘనంగా వారం రోజుల పాటు నిర్వహించారు. మొదటి రోజు సాయంత్రం 6 గంటలకు శ్రీ తిరుపతిరావు బృందంచే నాదస్వర కచేరీతో మంగళకరంగా మొదలైనాయి. 7 గంటలకు శ్రీమతి ఈమని లలితాకృష్ణ గోటువాద్యం, పూర్ణిమ వేణుగానంతో అలరించారు. శ్రీకల్లూరి శ్రీనివాస్ మృదంగంపై, శ్రీహరిబాబు ఘటంపై సహకరించారు. 14వ తేదీ సాయంత్రం శ్రీమతి శ్రీవిద్య గాత్రకచేరీ శ్రీఓరుగంటి రాజశేఖర్ వైలెన్‌పై, శ్రీసిహెచ్ రామకృష్ణ మృదంగంపై సహకరించగా చక్కగా జరిగింది. 15వ తేదీ శ్రీఎన్ రామమూర్తి తమ గాత్ర కచేరీతో శ్రోతలను ఆకట్టుకున్నారు. శ్రీఆర్ దినకర్ వైలెన్‌పై, శ్రీడీఎస్ఆర్ మూర్తి మృదంగంపై, శ్రీ సరస్వతుల హనుమంతరావు ఘటంపై, శ్రీశ్యామ్‌కుమార్ కంజిరపై సహకరించారు. 16వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు శ్రీజొన్నలగడ్డ ఈశ్వరప్రసాద్ గారి ఆధ్వర్యంలో ఉంఛ వృత్తి సాంప్రదాయబద్ధంగా త్యాగరాజ స్వామి వారి కీర్తనలతో సాగింది. తదుపరి ఉదయం 10 గంటలకు జంటనగరాలకు చెందిన పలువురు సంగీత కళాకారులచే పంచరత్న కీర్తనల గోష్ఠిగానం వైభవంగా సాగింది. సాయంత్రం శ్రీమతి దుడ్డు రాధిక గాత్ర సంగీత సభ శ్రీఆర్ దినకర్ వైలెన్‌పై, శ్రీపెరవలి జయభాస్కర్ మృదంగంపై, శ్రీఎస్ హనుమంతరావు ఘటంపై చక్కని సహకారం అందించగా ప్రతిభావంతంగా సాగింది. 17వ తేదీ తిరుపతికి చెందిన శ్రీమతి యాళ్ళ శ్రీవాణి వీణకచేరీ నిర్వహించారు. వీరికి మృదంగంపై శ్రీజయభాస్కర్, ఘటంపై శ్రీనేమాని సోమయాజులు వాద్య సహకారం అందించారు. 18వ తేదీ శ్రీమతి అరుణ, శ్రీమతి పద్మ యుగళగాత్ర కచేరీ జరిగింది. వీరికి వైలెన్‌పై శ్రీఓరుగంటి రాజశేఖర్ మృదంగంపై నేమాని సోమయాజులు, ఘటంపై శ్రీకేవీ రామకృష్ణ సహకరించారు. చివరి రోజు 19వ తేదీ బుధవారం శ్రీధూళిపాళ శివరామకృష్ణశర్మ భాగవతార్ (గుంటూరు) గారిచే ప్రహ్లాదచరిత్ర హరికథాగానం భక్తులను ఎంతగానో అలరించింది. శ్రీఎమ్ శశిభూషణ్ వైలెన్‌పై, శ్రీపడాల రామదాసు మృదంగంపై చక్కని సహకారం అందించారు. భక్తుల సహకారంతో ప్రతీఏటా ఈ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షులు శ్రీఎస్ రామమూర్తి తెలిపారు.

**తణుకులో 82వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు**

22.1.2020 నుండి 26.1.2020 వరకు సద్గురువు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు జరుపబడినవి. మొదటిరోజు స్థానిక రాయసం సంగీత కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక బృందం, స్థానిక, స్థానికేతర కళాకారులచే త్యాగరాజ ఘనరాగ పంచరత్న కృతుల గోష్ఠిగానం జరిగింది. వీరికి కాకినాడకు చెందిన శ్రీకొక్కొండ సుబ్బరాయన్ వైలెన్‌పై, విజయవాడకు చెందిన శ్రీకందుల అనిల్‌కుమార్ మృదంగంపై సహకరించారు.

రెండవరోజు న్యూఢిల్లీకి చెందిన శ్రీమతి వేమూరి జ్యోతి శ్రీదేవి కచేరీ రమ్యంగా సాగింది. చిత్తరంజని రాగంలో 'నాదతనుమనిశం' కృతితో మొదలుపెట్టి సింధుభైరవి రాగంలో 'విశ్వేశ్వరాయ' స్వాతితిరునాళ్ కీర్తనతో కచేరీ ముగించారు. నిన్నే భజన, బ్రోవభారమా, ఆడిమోడిగలదే మున్నగు కీర్తనలతో పాటు పూర్వీ కళ్యాణిరాగంలో 'జ్ఞానమొసగరాదా' ప్రధాన అంశంగా తీసుకుని చక్కగా ప్రదర్శించారు. వారు ఆలపించిన భజన్స్ అలరించాయి. వైలెన్‌పై శ్రీపెరవలి నందకుమార్, మృదంగంపై మంగళగిరి శ్రీధర్ చక్కటి సహకారం అందించారు.

మూడవ రోజు విజయవాడకు చెందిన శ్రీమతి బి.వి.దుర్గాభవాని కచేరీ 'లతాంతప్రియ' అనే అరుదైన రాగంలో యోగనరసింహకృతి 'మరచితివో మారమణ' ఆసక్తిగా సాగింది. తంజావూరు సీతారామారావుగారి గీతమాలిక, పూర్వికళ్యాణిరాగంలో మీనాక్షిమేముదందేహి, భోగీంద్రశాయినం మున్నగు కీర్తనలతో పాటు ప్రధానఅంశంగా లలిత రాగంలో దీక్షితార్ కృతి 'హిరణ్మయీంలక్ష్మీం' హృద్యంగా ఆలపించారు. విభిన్న వాగ్గేయకారుల రచనలు వీరి కచేరీలో చోటుచేసుకున్నాయి. శ్రీహేమాద్రి చంద్రకాంత్ వైలెన్‌పై, శ్రీఎం. శ్రీధర్ మృదంగంపై సహకరించారు. నాల్గవరోజు హైదరాబాద్‌కు చెందిన శ్రీపేరి త్యాగరాజు, శ్రీపవన్‌సింగ్‌ల వయోలిన్ ద్వయం అధ్భుతంగా సాగింది. శోభిల్లు సప్తస్వర, ఎందరో మహానుభావులు, నిరవధి

సుఖదా, బంటురీతి కొలువు కీర్తనలను సుమధురంగా మెరుపువేగంతో వాయించారు. మోహనరాగంలో భవనుతకృతికి రాగప్రస్తారం అద్భుతంగా చేశారు. అలాగే కళ్యాణి రాగంలో నిధి చాలా సుఖమా కీర్తనలో 'మహతి', 'అభోగి','వసంత' రాగాలను మేళవించిన తీరు అబ్బుర పరచింది. వీరికి మృదంగంపై హైదరాబాద్‌కు చెందిన శ్రీకె. కృష్ణశ్రవణ్, ఘటంపై తాడేపల్లి గూడెంకు చెందిన శ్రీ ఎస్. హనుమంతరావుగారు చక్కటి సహకారం అందించారు.

5వ రోజు కాకినాడకు చెందిన శ్రీవిష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి గాత్ర కచేరి శ్రోతల నాకట్టుకుంది. నవరాగమాలిక వర్ణంతో మొదలుపెట్టి, గిరిరాజసుత, నాదతనుమనిశంశంకరం సరససామదాన, ఎంత వేడుకొందు, నాగగాంధారిరాగనుతే, వేంకటాచల నిలయం కీర్తనలను మధురంగా పాడి బృందావన సారంగ రాగంలో శ్రీబాలమురళీకృష్ణగారి తిల్లానాతో కచేరీ ముగించారు. మోహన రాగంలో గోపీకామనోహరం కృతికి కళ్యాణిరాగంలో వాసుదేవయని వెడలిన కృతికి రాగాలాపన స్వరకల్పన శ్రోతలనలరించాయి. వీరికి విజయవాడకు చెందిన శ్రీచావలి శ్రీనివాస్- వయోలిన్‌పై, శ్రీచావలి కృష్ణమోహన్- మృదంగంపై సహకరించారు. **-శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి**

## సరస్వతీ గానసభ, కాకినాడ

సంగీత కార్యక్రమాలలో భాగంగా ఫిబ్రవరి 8,8,10 తేదీలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

8న శ్రీమతి ఈమని లలితాకృష్ణ -వీణ వారికుమార్తె పూర్ణిమ వేణుగాన కచేరీ జరిగింది. సీనియర్ ఏగ్రేడ్ కళాకారిణి అయిన శ్రీమతిలలిత సాధికారంగా వీణపై అంశాలను వినిపించారు.

వీరి కచేరీలో గంభీర నాటలో మల్లాది. గౌళలో శ్రీమహాగణపతి, ఎందరో మహానుభావులు, ఎంతవేడుకొందు, నిశికాభూషణ విస్తృతరాగాలాపనతో మరెవైరి అంశం: మనవి ఆలకింప, శివశివయనరాదా ప్రధాన అంశంగా చక్కని మనోధర్మ ప్రదర్శన చేశారు.

మామమాధవ, గోవింద గోవింద తదితర అంశాలు చోటు చేసుకున్నాయి. వై సూర్యనారాయణ్ చెన్నై మృందంగ సహకారం చాలా బాగున్నది. కె శ్రీనివాస్ కంజిరపై పోటీపడి సహకరించారు.

9 ఫిబ్రవరిన డాక్టర్ ఆర్ కశ్యప్ మహేష్ తిరుచ్చి గానంబో శ్లోకంతో ప్రారంభించి గంభీర నాట- అమ్మా ఆనందదాయినీ, సిద్ధి వినాయకం అనిశం, సరస్వతీరాగంలో సరస్వతీ నమోస్తుతే శారదే, శ్రీరాగ పంచరత్న కీర్తనుందరో మహానుభావులు లతంగిలో పట్నం సుబ్రహ్మణ్యం రచన మరివేరే దిక్కెవ్వరు.

చింతారాగంలో దేవబ్రోవసమయమిదే, ప్రధాన అంశంగా శంకరాభరణంలో స్వరరాగసుధారస, ఎంతమత్తయిన, భోశంభో అంశాలు చోటు చేసుకున్నాయి.

ప్రతిభా కలకళాకరాలు పప్పు జ్ఞానదేవ్ వయోలిన్‌పై కె సద్గురు చరణ్ మృదంగంపై ఎన్, హరికిశోర్ కంజీర్‌పై చక్కని సహకారం అందించారు.

పతిభా కలకళాకరాలు పప్పు జ్ఞానదేవ్ వయోలిన్‌పై కె సద్గురు చరణ్ మృదంగంపై ఎన్, హరికిశోర్ కంజీర్‌పై చక్కని సహకారం అందించారు.

**శ్రీరామగానసభ (రిజిష్టర్డ్) హైద్రాబాద్**

సద్గురు శ్రీత్యాగరాజస్వామి వారి 51వ వార్షిక ఆరాధనా సంగీతోత్సవములు 1-2-2020 నుండి 9-2-2020 ఆదివారం వరకు అత్యంత వైభవంగా జరిగాయి.

1-2-2020 శనివారం సాయంత్రం 5 గంటలకు నాదస్వర మంగళవాద్యం. తర్వాత నాదోపాసన బృందం వారిచే దివ్యనామ సంకీర్తనలు గానం చేయబడినవి. శ్రీమతులు లలితా శ్రీనివాస్, ధనలక్ష్మి, విజయశ్రీ, సరస్వతి, సరిత, వెంకటరత్నం గానం చేశారు. వీరికి ఎస్ సోమయాజులు మృదంగంపై, శ్రీమతి అచ్చుత కుమారి గారు వయోలిన్‌పై సహకరించారు.

అనంతరం ప్రవచన వాచస్పతి శ్రీ టి.కె.వి. రాఘవం దీప ప్రజ్వలనం గావించి ప్రారంభించారు.

సాయంత్రం 7.15 గంటలకు శ్రీమతి అచలా శంకరనాథ్ గారి వీణాగానం చేయగా విద్యా సాగర్ మృదంగం, జనార్థన్ ఘటంపై సహకరించారు.

అచలగారు బ్రోవభారమా (బహుదారి), మనవి యాల కించరాదటే, నిధి చాల సుఖమా (కళ్యాణి) మున్నగు కృతులు వీణపై వాయించి శ్రోతలమన్నన పొందారు.

2వ తేదీ ఆదివారం శ్రీమతి మల్లెలకీర్తి (బెంగుళూరు) హిందూస్థానీ సంగీతం గానం చేశారు. వీరికి హార్మోనియంపై ఉ పకార్ గాడ్‌బోలే, శ్రీనివాస హరిదాస తబలాపై సహకరించారు. హిందూస్తానీ భజనలు, టుమ్రీలు పాడి శ్రోతల నలరింప జేశారు.

2వ తేదీ సాయంత్రం 7.15 గంటలకు శ్రీ డి.వి.

మోహనకృష్ణ గానం చేయగా వయోలిన్‌పై పెరవలి జయభాస్కర్ మృదంగంపై రామరాజు దినకర్ వయోలిన్‌పై దీటుగా అనుసరించి కచేరి సుసంపన్నం చేశారు.

నిన్నేభజన (నాట) నన్ను విడచి కదలకురా రీతిగౌళ మున్నగు కృతులు అద్భుతంగా గానం చేయగా శ్రోతలు కరతాళ ధ్వనులతో ఆనందించారు.

3వ రోజు సాయంత్రం 5.45 గంటలకు డాక్టర్ ఎమ్. హరిత సీహెచ్ కృతికామాధురి గానం చేశారు. వీరికి రామరాజు దినకర్ వయోలిన్ పైన, చంద్రకాంతశర్మ మృదంగంపైన సహకరించారు. వీరు గిరిరాజ సుతాతనయ, 'నీవాడేగాన', బంటురీతి కొలువీయవయ్య మున్నగు కృతులు శృతి, లయ శుద్ధముతో పాడి శ్రోతలమన్నలకు పాత్రులయ్యారు.

సాయంత్రం 7.15 ని॥లకు దినకర్‌గారి శిష్యులు వయోలిన్, ఫ్లూట్, మృదంగం సుమారు 9 మంది తాళవాద్య కచేరీ చక్కగా వాయించి శ్రోతల నలరింపచేశారు.

'రఘునాయక' హంసధ్వని, ఎందరో మహానుభావులు, త్యాగరాజ పంచరత్న కీర్తన వాయించిన కొన్ని కృతులు.

4వ రోజు సాయంత్రం శ్రీనేంద్రగంటి అలివేలు మంగ చారిటబుల్ ట్రస్ట్‌వారి సభ్యులు, కుమారి వరెం శ్రీలక్ష్మి, శ్రీవిద్య,కుమారి జ్యోతి, శ్రీమతి ఎన్ సరస్వతి, శ్రీమతి హరిప్రియ, శ్రీకృష్ణమోహన్ గార్లు గానం చేశారు.

మహాగణపతిం నాట, బ్రోచేవారెవరే, శోభిల్లు సప్తస్వర మున్నగు కృతులు శ్రావ్యంగా పాడేరు.

శ్రీకృష్ణమోహన్‌గారు పద్యములు అదే రాగంలో భజరే శ్రీరామం, 'రామచంద్రుడితడు' మున్నగు కృతులు గానం చేశారు.

చివరిగా గానం చేసిన పి. సుబ్బారావు అభోగివర్ణంతో ప్రారంభించి ఏతావునరా, మున్నగు కృతులు చక్కనిరాగాలాపన, నెరవు దీర్ఘ స్వరకల్పనతో గానం చేశారు.

శ్రోతలు కరతాళధ్వనులతో ఆనందించారు. వీరందరికి శివకృష్ణస్వరూప్- వయోలిన్, కర్రా శ్రీనివాసరావు మృదంగం, శ్రీగుణరంజన్ తబాలాపై అనుసరించారు.

5వ రోజు సాయంత్రం సుప్రసిద్ధ సంగీత విద్వన్మణి శ్రీమతి ఎం.వి. కమలారమణి, ('కీర్తన' సంగీత విద్యాసంస్థ వ్యవస్థాపకులు), వీరి శిష్యులు గానం చేశారు.

నాదలోలుడై బ్రహ్మానంద మందవేమనసా, బంటురీతి కొలువీయవయ్య మున్నగు కృతులు గానం చేశారు.

శ్రీమతి రాజేశ్వరి 'పరమాత్ములు వెలిగేముచ్చట' మొదలగు కృతులు శ్రీమతి అనూరాధ, శోభిల్లు సప్తస్వర చక్కని రాజమార్గము -ఖరహరప్రియ గానం చేశారు.

అనంతరం ఎమ్. వి కమలారమణి, నాటకురంజిరాగ వర్ణంపాడి, వేణుగానలోలునిగన, 'కేదారగౌళరాగం', రారమా ఇంటి దాకమున్నగు కృతులు విస్తారమైన రాగాలావన, సుదీర్ఘస్వరకల్పనలతో గానం చేశారు.

6వ రోజు శ్రీమతి మల్లాది కార్తీక త్రివేణి గానం చేశారు. వీరికి అనంత శౌరిరాజన్ వయోలిన్, శ్రీమతి వీణాధరి - మృదంగంపై అనుసరించారు.

శ్రీమతి త్రివేణి బంటురీతి కొలువీయవయ్య, ఎంత ముద్దో ఎంత సొగసో- బిందుమాలినిరాగం, రాగమాలిక తిల్లాన పాడి రాగలాపన, స్వరకల్పనలో చక్కటి గానం చేశారు.

6వ తేదీ రెండవ కచేరీలో ఎంతో అనుభవంగల శ్రీమతి రాధాపద్మనాభన్ గానం చేశారు. వీరికి అనంత శౌరిరాజన్ వయోలిన్‌పై, శ్రీనివాస గోపాలన్, మృదంగంపై, కాళివర ప్రసాద్ మోర్సింగ్‌తో సహకారం అందించారు.

రాధాగారు తోడి రాగంలో రామచంద్రాయనమస్తే, కాంభోజి రాగంలో ఓరంగసాయి, మొదలగు కృతులుగానం చేసి స్వర కల్పన రాగాలాపనతో శ్రోతల ప్రశంసలు పొందారు. శ్రీనివాసగోపాలన్ గారి తని ఆవృతం చాలా చక్కగా సాగింది.

7వ తేదీ శుక్రవారం శ్రీమతి రమ్య శ్రీనివాస్ గాన కచేరీకి అనంత శౌరిరాజన్ వయోలిన్‌పై కాళీ వరప్రసాద్ మృదంగంపై సహకారమందించారు.

సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు, మహామహోపాధ్యాయ, పద్మభూషణ్ డాక్టర్ నూకల చిన సత్యనారాయణగారి మనుమరాలు శ్రీరమ్య శ్రీనివాస్ తన కచేరీలో నాదతనుమనిశం శంకరం, సొగసుగా మృదంగ తాళము, ఎందుకో నీవు కళ్యాణిరాగంలో రాగాలాపన స్వర కల్పనలతో తాతగారిబాణీ వినిపించింది.

7వ తేదీ సాయంత్రం రెడవ కచేరీలో శ్రీమంథా శ్రీనివాస్ గానం చేశారు. శ్రీరాగంలో వర్ణం ప్రారంభించి అనుదినమును కావవయ్య 'బేగడరాగం' భీంప్లాస్ రాగంలో నగుమోముగనలేని శుద్ధసావేరీ రాగంలోకాలహరణమేలరా,హిందోళ రాగంలో సామజ వరగమన,నగుమోముగనలేనిచివరిగా తిల్లానతో కచేరీ ముగించారు.

అనంత శౌరిరాజన్ వయోలిన్‌పై సిరిపల్లి నాగేశ్వరరావు మృదంగం, కాళీవరప్రసాద్, మోర్సింగ్‌తో సహకరించారు.

మంధా శ్రీనివాస్ సుదీర్ఘమైన రాగ, స్వరకల్పనలతో శ్రోతల ప్రశంసలకు పాత్రులైనారు.

8వ తేదీ శనివారం సాయంత్రం ప్రథమ కచేరీలో కల్లూరి రామలక్ష్మి గుణానిక గానం చేశారు.

బహుదారి రాగంలో బ్రోవభారమా కళ్యాణరాగంలో ఈశపాణి మాం మున్నగు కృతులు శుద్ధమైన శృతి లయలతో రాగాలాపన స్వరకల్పనలు అందించారు.

వీరికి కంభంపాటి లక్ష్మీనారాయణశర్మ వయోలిన్‌పై, కాళీవరప్రసాద్ మృదంగం పై సహకరించారు.

8వ తేదీ శనివారం చి॥ మణిరఘురామ్ (కార్యదర్శి శ్రీనివాస్ శర్మగారి కుమారుడు) చక్కగా గానం చేసి శ్రోతలను ఆశ్చర్య పరిచాడు.

వాతాపి గణపతిం భజేహం–హంసధ్వనిరాగం, బంటురీతి కొలువీవయ్య, రామరామయనరాదా, మున్నగు కృతులు, తన స్వంతరచన 'కేసరినందన' తిల్లాన రాగాలాపన స్వరకల్పనలతో అందర్ని ఆశ్యర్య పరిచాడు.

వీరికి అచ్యుత కుమారి వయోలిన్‌పై సభకార్యదర్శి శ్రీనివాస్ శర్మ మృదంగం పై సహకరించి కచేరీ రక్తిగా ముగించారు.

8వ తేదీ 2వ కార్యక్రమంలో సంగీతాచార్య సుప్రసిద్ధ విద్వాంసులు వైజర్సు బాల సుబ్రహ్మణ్యం గారి శిష్యులు గానం చేశారు.

కుమారి ప్రణతి శోభిల్లు సప్తస్వర–జగన్మోహినిరాగం, భైరవి రాగంలో ఉపచారము చేసేవారు స్వరకల్పనతో చక్కగా గానం చేశారు.

రష్మి రామానీపై తనకూ–కేదారి రాగం, ఎవరురా నినువినా– మోహనరాగంలో, రాగాలాపన స్వరకల్పనతో గానం చేశారు.

అనంతరం బాలసుబ్రహ్మణ్యంగారు ప్రధానంగా శంభోమహాదేవ, పంతు వరాళిరాగంలో విస్తారమైన రాగాలాపన నెరవు, స్వరకల్పనతో కార్యక్రమం రక్తిగా సాగించారు.

వీరందరికీ రాజశేఖర్ వయోలిన్, రామకృష్ణ మృదంగంతో చక్కని సహకారమందించారు.

చివరిరోజైన 9–2–2020 నాడు ఉదయం 10.30 గంటలకు తిరువాయూర్ వాస్తవ్యులయిన శ్రీ జి. నాగరాజన్ భాగవతార్ గారిచే సాంప్రదాయ పద్ధతిగా ఉంఛవృత్తి (భిక్షాటనము) నిర్వహించబడినది. తదుపరి 11.30 గంటలకు త్యాగరాజ పంచరత్న కీర్తనలు గోష్టి గానము జరిగినది.

మధ్యాహ్నం 12 గంటలకు భక్తుల ఉదార విరాళములతో సుమారు 400 మందికి "మహాప్రసాదము (భోజనము) ఏర్పాటు చేయడమైనది.

సాయంత్రం 7 గంటలకు క్రాంతి కూచిపూడి నాట్యాలయ బృందము వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగినది.

రాత్రి 9 గంటలకు ఆంజనేయస్తుతి (హనుమాన్‌చాలీసా) మంగళహారతి స్వస్తివాచకముతో ఉత్సవ కార్యక్రమము విజయవంతంగా ముగిసినది.

శ్రీరామ గానసభ కార్యదర్శి శ్రీనివాసశర్మ మొదటిరోజు ప్రారంభసభలో పరిచయ వాక్యముల నుండి చివరి రోజు వందన సమర్పణ వరకు అత్యంత జాగరూకతో ముగింపు కార్యక్రమం నిర్వహించిరి.

## శ్రీశారదా సంగీత కళాసమితి–అనపర్తి

వారి 21వ త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో 3–1–2020న హైదరాబాదు నివాసి శ్రీమతి మంద శృతిరవళి గాత్రసంగీత సభ ప్రతిభావంతంగా జరిగి ఆహుతులను అలరించింది. వారికి కచేరీలో రామనిన్ననమ్మిన, వాసుదేవయని, తెలిసిరామచింతనతో, కబుపయాపాలయ, మరియు చక్కని రాగయుక్తమైన పద్యాలు చోటుచేసుకుని శ్రోతలను సమ్మోహితులను చేశారు. కుమారి విషు&ణభట్ల శివాని, శ్రీపారుపల్లి సుబ్బరాయుఫల్గుణు, శ్రీసరస్వతుల హనుమంతరావు(ఘటం) చక్కని సహకారం అందించారు.

## సరస్వతీగాన సభ, కాకినాడ

వారి ఉత్సవాల్లో 10–2–2020 నాడు కుమారి లావణ్య–ముంబాయి వారి శాక్సోఫోను కార్యక్రమం రంజకంగా చురుకుగా సాగింది. గంభీర నాట అంశంతో మొదలుపెట్టి రీతిగౌళలో 'జననినినువినా' చక్కగా ఆర్తిగా వినిపించారు. మలయమారుత రాగ అంశం 'మనసా ఎటులోర్తునే' వేగానికి పరాకాష్టగా నిలిచింది. శ్రీఎం. నీలాద్రిరావు వాయులీనంపై, శ్రీఎం. ఏడుకొండలు

మృదంగంపై, శ్రీహనుమంతరావు, ఘటంపై తగురీతిగా వాద్య సహకారం అందించి కరతాళధ్వనులు పొందారు.

## ప్రముఖ నాదస్వర విద్వాంసులు శ్రీకాకరపర్తి నిర్యాణం



కాకినాడలో ప్రఖ్యాతులైన నాదస్వర విద్వాంసులు, ఎందరికో సంగీత సద్గురువు, శ్రీవాణీ స్వరాలయ ప్రిన్సిపాలు, నిగర్వి, నిరాడంబరుడు అయిన శ్రీకాకరపర్తి వీరభద్రరావు జనవరి 30వ తేదీ నాడు 73 సంవత్సరాల వయస్సులో కాకినాడలో పరమపదించారు.

వారి శిష్యప్రశిష్యులు, సంగీత సభల నిర్వాహకులు, అభిమానులు, బంధువులు అందరూ 2-2-2020 నాడు కాకినాడ సూర్యకళామందిరంలో సంతాప సభను నిర్వహించి నివాళులు అర్పించారు.

ది 11-2-2020 నాడు వీరభద్రరావుగారి ప్రియతమ శిష్యురాలు శ్రీమతి డి. విజయలక్ష్మి నిర్వహణలో సత్కళావాహిని కార్యదర్శి ఇ.వి.కె. ఆచార్యులు నిర్దేశకత్వంలో సంగీత నీరాజన కార్యక్రమం జరిగింది. కాకినాడలోని నాదస్వర విద్వాంసులందరూ పాల్గొని స్వరనీరాజనం సమర్పించారు. శ్రీమతి ఎ. పుష్ప రామమోహనరావు, శ్రీమతి దేవరకొండ లక్ష్మి, శ్రీమతి విజయలక్ష్మి, శ్రీమతి వసుంధర, శ్రీ వి. శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఇందు పాల్గొన్నారు. అనేక మంది ఆయన అభిమానులు వారి వ్యక్తిత్వం పై ప్రసంగించారు.

## రస రమ్యంగా సాగిన త్యాగరాజ ఆరాధనోత్సవం

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ త్యాగరాజ గానసభ ఆధ్వర్యంలో త్యాగరాజ పంచరత్న కీర్తనల గోష్ఠిగానం అత్యంత భక్తి శ్రద్ధలతో సాగింది. గాన సభ అధ్యక్షురాలు శ్రీమతి డా.కె అన్నపూర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు గుత్తిన అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఘనరాగ పంచరత్న కీర్తనల ఆలాపన శృతిలయబద్ధంగా సాగి శ్రోతలను ఆనందింప చేసింది. కె జ్యోతి, సుబ్బలక్ష్మి, ఇవటూరి ప్రమీల, చల్లా అన్నపూర్ణల వీణావాదనంలో కృతులు రమ్యంగా సాగాయి. వాయులీనంపై శ్రీపి గణపతి, శ్రీ జి.వి. ఎస్ సుబ్రహ్మణ్యం మృదంగంపై వి. దుర్గానాదులు సహకరించారు. అనంతరం డా. కె రామచంద్రరాజు, డా. బి.వి. రాజు, వై. సంజీవరావు, ఎం. సూర్యకుమారి, కళాకారులను సత్కరించారు. కార్యదర్శి సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు.

## శివపదం పాటల పోటీలు

ప్రవచన కర్త శ్రీ సామవేదం షణ్ముఖశర్మ స్వరకల్పన చేసిన శివపదం పాటల పోటీలు కాకినాడ సూర్యకళామందిరంలో 19-2-2020న జరిగాయి. సంగీత విద్వాంసులు శ్రీమోదుమూడి సుధాకరు, శ్రీమతి, అంజని సుధాకరు, న్యాయమూర్తులుగా వ్యవహరించారు. శివపదం పాటలు ఆదరణ పొందాయని ట్రస్టు ప్రతినిధి చావలి రామమూర్తి అన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. సబ్‌జూనియర్స్ విభాగంలో కూచిభొట్ల భార్గవషణ్ముఖ శ్రీనివాసు, కలిదండి యషిత శ్రీలక్ష్మి తొలి రెండు బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్స్ విభాగంలో వైష్ణవి, టి. రోహిత విజేతలు. సీనియర్సు విభాగంలో జె. శ్రీవల్లివిద్య, ఎం. అరుణకుమార్. బహుమతులను పొందారు.

## సంగమేశ్వర సంగీత సమాఖ్య, పిఠాపురం

వారి ఆధ్వర్యంలో ది.09.02.2020న శ్రీమతి కరి యామిని కృష్ణ శ్రీకాకుళం వారి గాత్ర సంగీత కచేరి జరిగింది. నాటకు రంజి వర్ణంతో కచేరి ప్రారంభించి గురులేక ఎటువంటి, గౌరీ మనోహరి రాగంలో పాడి ఉపప్రధాన అంశంగా ఎన్నగాను రామ భజన పంతువరాళి రాగంలో భద్రాచల రామదాసు కీర్తన చక్కటి మనోధర్మంతో గానం చేసారు. ప్రధాన అంశమైన కరుణ చూడవమ్మ తోడి రాగంలో గాయని చాలా ప్రతిభ కనబరచారు. వాద్య సహకారాన్ని శ్రీయుతులు హెచ్ రామచరణ్ వయోలినుపై మహదాను ఏడుకొండలు, కాకినాడ మృదంగంపై సమర్ధవంతంగా అందించారు. కార్యదర్శి శ్రీ జి.ఎస్.కె.డి వెంకటరావు కళాకారులను పరిచయం చేసి కార్యక్రమం నిర్వహించారు. జయంతి సత్యనారాయణ శాస్త్రిగారు దీప ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.